2.7.07

తెలంగాణ 8వ పుస్తకం

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మలుపులు

బి.ఎస్. రాములు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాక
ప్రతినెలా వెలువడే పుస్తకాల్లో ఇది 8వది

ప్రచురణ

తెలంగాణ రాష్ట్ర కళాకారుల, రచయితల, మేధావుల ఐక్యవేదిక
406, ఉషాకిరణ్ ఆర్కేడ్, ఉస్మానియా యూనివర్సిటీ రోడ్,
హైదరాబాద్ - 500 044
ఫోన్ : 09391036987

తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు

పరిష్కరించుకుని ముందుకు సాగుతున్న ఉద్యమం

తెలంగాణ ఉద్యమం సాధించిన విజయాలు

1996 నుండి గత 12 ఏళ్ళలో తెలంగాణ ఉద్యమం ప్రజల్లో లోతుగా తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను కలిగించింది. నమ్మకాన్ని కూడా కలిగించింది. తెలంగాణ ఉద్యమం, టిఆర్ఎస్ సాధించిన విజయాల గురించి ఇప్పటిదాకా ఏడు పుస్తకాల్లో వివరంగా రాశాను. మళ్ళీ ఇక్కడ వివరించనవసరం లేదు. అందరూ తెలంగాణ రాష్ట్రం కోరుతున్నారు. ఆంధ్రప్రాంత ప్రజలు కూడా తెలంగాణ రాష్ట్రం ఎంత తొందరగా ఇచ్చేస్తే అంత తొందరగా ఆంధ్ర ప్రాంతాన్ని కూడా అభివృద్ధి పర్చుకోవడానికి కన్ఫ్యూజన్ తొలగిపోతుంది అని ఆశిస్తున్నారు. అయితే నాయకత్వం దీనిని ఒక గెంతు ముందుకు గెంతించడానికి సంసిద్ధంగా లేదు. నాయకత్వానికి ఆ శక్తి సామర్థ్యాలు లేవు. ఇదే నేటి ప్రధాన సమస్య.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఒక సామాజిక, సాంస్కృతిక ఉద్యమం దీన్ని టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు హైజాక్ చేశాయి

1996 నుండి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఒక సామాజిక, సాంస్కృతిక ఉద్యమంగా ముందుకు సాగి ఒక ప్రాతిపదిక ఏర్పడ్డాక 2001లో టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఆ నినాదాన్ని తీసుకుని ముందుకు సాగాయి. రాజకీయ పార్టీలు ముందుకు సాగే క్రమంలో సామాజిక ఉద్యమాలు ఆ పార్టీల ముందు నిలువలేక పోయాయి. వాటికి అనుబంధంగా మారాయి.

ఇటీవల తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఆయా పార్టీలు కేవలం రాజకీయ అధికార సాధనకు ఒక అవకాశంగా భావించడం పెరిగింది. ఇలాంటి పార్టీల

చేతుల్లో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ఒక సాధనంగా మాత్రమే రాజకీయపార్టీల చేతిలోని ఆటబంతిలా మిగిలి పోతుంది. అందువల్ల టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ మొదలైన పార్టీలను నమ్మి ఊరుకోకుండా ఉద్యమాన్ని మళ్ళీ తమ చేతుల్లోకి తీసుకొని తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమాలను ముందుకు నడపాల్సిన సమయం వచ్చింది.

తెలంగాణ రాష్ట్ర సమితి ఉద్యమ స్వభావం కోల్పోయి కేవలం రాజకీయ పార్టీగా స్థిరపడింది. తద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన అనే లక్ష్యం స్థానంలో టిఆర్ఎస్ ఒక పార్టీగా ఎదగడం కోసం తెలంగాణ రాష్ట్రం ఒక సాధనంగా, నిదానంగా మారిపోయింది. ఉద్యమ స్వభావాన్ని టిఆర్ఎస్ వదిలివేసింది.

రాజకీయాలే వారి వృత్తి. పాపం వారేం ఉద్యమం చేస్తారు?

నిజానికి మొదటి నుండి టిఆర్ఎస్‌కు సామాజిక ఉద్యమ స్వభావం చాలా తక్కువ. వృత్తి రాజకీయ నాయకులతో, రాజకీయాలే వృత్తిగా గల రాజకీయ నాయకులతో టిఆర్ఎస్ ఏర్పడింది. రాజకీయ నిరుద్యోగులు ఉద్యమంలో చేరి సామాజిక ఉద్యమ కారుల్ని వెనక్కి నెట్టారు. రాజకీయాలే వృత్తిగా నడిపే రాజకీయాల కనువుగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు చావకుండా బతకకుండా సజీవంగా కొనసాగుతున్నాయి. ఎన్నికల నుంచి మళ్ళీ ఎన్నికల దాకా వాయిదా వేసుకుంటు కాలం గడిపితే బాగుంటుందనుకుంటున్నారు. రాజకీయాలే వారి వృత్తి. పాపం వారేం ఉద్యమం చేస్తారు? వాళ్ళకు ఉద్యమాలు చేయడం తెలుసని, వారిచేత ఉద్యమాలు చేయించవచ్చని నమ్మి, ప్రజలను నమ్మించిన సామాజిక ఉద్యమ కారుల, తెలంగాణ సిద్ధాంత వేత్తలదే అసలు పొరపాటు అని కొందరి అభిప్రాయం. ఇలా టిఆర్ఎస్ ఉద్యమ స్వభావం కోల్పోతు ఉద్యమానికి నాయకత్వం వహించే బదులుగా రాజకీయ పార్టీగా మిగిలిపోయిందని భావిస్తున్నారు.

పర్యవసానంగా తెలంగాణ ఉద్యమం ఇప్పుడు కొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్నది. కరీంనగర్ ఉప ఎన్నికకు ముందు ఉద్యమంలో కొంత స్తబ్దత ఏర్పడింది. కరీంనగర్ ఉప ఎన్నిక తర్వాత కొత్త ఉత్తేజంతో ఉద్యమం ముందుకు సాగుతున్నది. ఈ క్రమంలో ఒక దశ నుండి మరో దశలోకి మలుపు తిరిగే సమయంలో అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. వీటిని సమీక్షించుకుని పరిష్కరించుకుంటేనే ఉద్యమం ముందుకు సాగుతుంది. నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం నీరుగారి పోతుంది.

తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళు

తెలంగాణ ఉద్యమం ఇప్పుడు ఏయే సవాళ్ళను ఎదుర్కొంటున్నది ?

1. తెలంగాణ సామాజిక ఉద్యమం స్తంభించిపోవడం.
2. తద్వారా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు రాజకీయ పార్టీల ప్రయోజనాలకు అనువుగా జరుగుతున్న సభలకు పరిమితమై పోవాల్సి రావడం.
3. తెలంగాణ రాజకీయ పార్టీలకు ఉన్న ఆర్థిక బలం, అంగ బలం, సమీకరణ శక్తి, నిర్మాణం ముందు సామాజిక ఉద్యమం నిలబడలేక పోవడం.
4. రాజకీయ పార్టీలకు సామాజిక ఉద్యమకారులు సలహాదారులుగా కుదించుకుపోయి కొనసాగడం. ప్రజల్లో సామాజిక ఉద్యమం వేళ్ళూనక పోవడం.
5. ప్రజల్లో రాజకీయ పార్టీలకున్న గుర్తింపు సామాజిక ఉద్యమాలకు లేకపోవడం.
6. అందరూ కలిసి కట్టుగా పనిచేయలేక పోవడం.
7. పన్నెండేళ్ళుగా ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ తెలంగాణకు నష్టం కలిగించే ప్రాజెక్టులు, నిర్ణయాలు నిరంతరం సాగిపోతూనే ఉండడం. వాటిని అడ్డగించలేకపోవడం. తెలంగాణ నీళ్ళను, తెలంగాణ ఉద్యోగాలను, తెలంగాణ బొగ్గును, తెలంగాణ సంపదను మునుపటి కన్నా ఎక్కువగా మలుపుకుపోతున్నారు. తెలంగాణలోని ప్రభుత్వ భూములను, ప్రభుత్వ పరిశ్రమలను ఇతరులకు అమ్మివేస్తున్నారు.
8. దీనితో ఉద్యమం ఉన్నట్టా? లేనట్టా? వుండి ఏం చేస్తున్నట్టు అనే భావన పలువురిలో కలగడం.
9. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నిజంగా ఉద్యమమే అయితే ఉద్యమం నడుస్తున్నప్పుడు మునుపటి కన్నా ఎక్కువ అన్యాయాలు తెలంగాణకు ఎలా జరుగుతున్నాయి. వీటిని నిలువరించని ఉద్యమాలు ఉద్యమాలు ఎలా అవుతాయి?
10. రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ ఉద్యమాన్ని సమర్థించడం,

వ్యతిరేకించడం. అంతేగానీ తెలంగాణ ప్రజల కోసం సామాజిక చరిత్ర పరిణామాన్ని అర్థం చేసుకొని తెలంగాణ ప్రజల ఆకాంక్షను ముందుకు తీసుకుపోలేక పోవడం.

ఈ కారణాలన్నింటి వల్ల తెలంగాణ ఉద్యమం ట్రేడ్ యూనియనిజం లాగా, రాజకీయాలే వృత్తిగా గల కెరీరిజంగా మారిపోయిందా? అని అన్పించడం సహజం.

12 ఏళ్ళు ఒక ఉద్యమం సాగిందంటే సాధించిన ఫలితాలేమిటి? అనే ప్రశ్నకు జవాబు వెతుక్కోవలసిన అవసరం ఉంది.

నక్సలైట్లతో కోల్పోయిన అధికారాన్ని తిరిగి సుస్థిరం చేసుకొనే దాకా రాజకీయ నాయకులు తెలంగాణ రాష్ట్రం వాయిదాను కోరుకుంటున్నారు

వెలమలు, రెడ్లు నక్సలైట్ల ఉద్యమం వల్ల ముప్పయ్యేళ్ళుగా కోల్పోయిన అధికారాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన పేరిట సుస్థిరంగా నెలకొల్పుకునే దాకా పోరాడేది లేదు, సరండర్ అయ్యేది లేదు అంటూ కెసిఆర్ అడుగులు వేస్తున్నారు. ఇలాంటి వారికి తెలంగాణ రాష్ట్రం ఎంతకాలం వాయిదా పడితే అంత మంచిదని భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోను కాంట్రాక్టులలో తమ వాటా, తమ కమిషన్ వచ్చే దాకా – పోరాటం చేస్తామని ప్రకటనలిచ్చి ఆశించింది అందగానే మానేస్తున్నారు. బోధన్ చక్కెర ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సాగుతున్న ఉద్యమానికి మద్దతిస్తు మాట్లాడిన టిఆర్ఎస్, కెసిఆర్ దాన్ని కొన్న వారి నుండి ఆశించిన దాని కన్నా ఎక్కువగా మూటకట్టుకోవడంతో మాట పడిపోయింది.

ఉద్యమ స్వభావాన్ని కోల్పోయి టిఆర్ఎస్ రాజకీయ పార్టీగా స్థిరపడింది

ఇలా ఉద్యమ కారులు సేకరిస్తున్న సమాచారం, చేస్తున్న ఉద్యమాలు కొందరు బేరం చేసి సంపాదించుకొనేదిగా, క్రమంగా ఉద్యమాన్ని నీరు గార్చే అవకాశంగా మార్చుకుంటున్నారు. నీటి ప్రాజెక్టుల్లో అందవలసినంత వాటా టిఆర్ఎస్, కెసిఆర్ బంధుమిత్రులకు, అనుయాయులకు అందడం వల్లనే ఆయా ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మాట్లాడ్డం ఆగిపోయిందనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ఇలా టిఆర్ఎస్ ఉద్యమ పార్టీగా ఉండడం అంతరించి కేవలం రాజకీయ పార్టీగా మారిపోయి కొనసాగుతున్నది. ఉదాహరణకు

1. ఉద్యమం ఎవరినైనా గెలిపిస్తుంది. ఉద్యమం కోసం పని చేసే వారికి టిక్కెట్లిచ్చి పోటీలో నిలుపుతుంది.

2. గెలిచే వారికే టిక్కెట్లు ఇవ్వడం అనే ఆలోచన కేవలం రాజకీయ పార్టీల ఆలోచనా విధానమే.
3. టిఆర్ఎస్ గెలిచే వారికే టిక్కెట్లు ఇవ్వడం అనే ఆలోచనను కొనసాగిస్తున్నది. ఇటీవలి ఎమ్మెల్సీ టిక్కెట్ల దాకా ఇదే విధానం కొనసాగడం చూడవచ్చు. డా॥ కె.జయశంకర్‌ను రాజ్యసభ సభ్యుడిగా గాని, ఎమ్మెల్సీగా గాని ఎన్నుకోలేకపోవడం దీన్నే తెలుపుతుంది.
4. రాజకీయాలే వృత్తిగా గల రాజకీయ నాయకుల, కార్యకర్తల పార్టీగా టిఆర్ఎస్ స్థిరపడింది. అందులో కొత్తగా వచ్చి చేరుతున్న వారు ఉద్యమ కారులు కాదు. కేవలం రాజకీయ నాయకులు, కార్యకర్తలు మాత్రమే. ఉద్యమ కారులు ప్రత్యేకంగా, స్వతంత్రంగా మళ్ళీ నూతన సంస్థల నిర్మాణాలను ఏర్పాటు చేస్తున్నారు. తిరిగి అందరినీ కలుపుకొని ఉద్యమాలను ప్రారంభించారు. ఇది టిఆర్ఎస్ ఉద్యమాలు చేయడం లేదనే దాన్ని నిరూపిస్తుంది.
5. అందువల్ల టిఆర్ఎస్ ఉద్యమ పార్టీగా కొనసాగడం లేదు. అది కేవలం రాజకీయ పార్టీగా మాత్రమే కొనసాగుతున్నది.
6. రాజకీయ పార్టీలకు ఉద్యమాలు సాధనంగా ఉంటాయి.
7. తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యంగా అందరినీ కలుపుకుపోవడానికి టిఆర్ఎస్ సిద్ధంగా లేదు.
8. మా పార్టీయే ఎదగాలి అనే దృక్పథం స్పష్టంగా ఉద్యమ పార్టీ దృక్పథాన్ని వదిలివేసి కేవలం రాజకీయ ప్రాంతీయ పార్టీగా మారిపోయిన విషయాన్ని తెలుపుతుంది.
9. ఇలా అన్ని కోణాల్లో టిఆర్ఎస్ ఉద్యమ స్వభావాన్ని, తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యం అనే లక్ష్యాన్ని కోల్పోయి కేవలం రాజకీయ పార్టీగా స్థిర పడి కొనసాగుతున్నది.
10. 2004 ఎన్నికల్లో లబ్ది పొందారు. అధికారంలోకి వచ్చారు. మళ్ళీ ఎన్నికల దాకా నాన్చుతున్నారు. మళ్ళీ ఎన్నికలకు ఈ నినాదాన్ని చూపి ఓట్లు సంపాదించి అధికారంలోకి రావాలనుకుంటున్నారు.
11. ఇలా ఎంత కాలం వీలైతే అంత కాలం తెలంగాణ రాష్ట్ర ప్రజల డిమాండును ఓటు బ్యాంకుగా మార్చుకొని గెలువాలనే తాపత్రయం,

రాజకీయ పార్టీల స్వభావంలో, అవి చేసే ఉద్యమాల్లో స్పష్టంగా కనబడుతుంది.

12. కేసిఆర్, నరేంద్ర తదితరులకు రాజకీయాలే వృత్తి. గద్దర్, పాశం యాదగిరి, బి.ఎస్.రాములు మొదలైన వారికి ఉద్యమాలే ఊపిరి. ఇవాళ రాజకీయాలే వృత్తిగా సాగిస్తున్న వారి వెంట నడవాలా? ఉద్యమాలే ఊపిరిగా సాగుతున్న సామాజిక నాయకత్వం వెంట నడవాలా? అనే ప్రశ్న ప్రజల ముందున్నది.

13. రాజకీయ నాయకులు, రాజకీయాలే వృత్తిగా గల వాళ్ళు ఉద్యమాలను ఏం చేస్తారో మర్రి చెన్నారెడ్డి నిరూపించారు. మర్రి చెన్నారెడ్డి ఆరేళ్ళు తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేస్తే, ఎం.సత్యనారాయణరావు 36ఏళ్ళుగా తెలంగాణకు ద్రోహం చేస్తూ నిరూపించారు. రెండేళ్ళు ఢిల్లీలో నిద్రపోయి కేసిఆర్, నరేంద్రలు కూడా నిరూపించారు.

14. 2007 నవంబర్ కరీంనగర్ ఉప ఎన్నికలో తిరిగి గెలుపొందడం కోసం టిఆర్ఎస్‌ను గెలిపించకపోతే తెలంగాణ రాష్ట్రం గోవిందా అనే మానియాను, భయాన్ని సృష్టించి ఎలా వెలమ రాజకీయాలను పటిష్ట పరుచుకున్నారో, వృత్తి రాజకీయాలు ఎలా ఉంటాయో తమకు తామే తెలుపుకున్నారు.

15. టిఆర్ఎస్‌లో చేరికలు, చీలికలు కూడా ఉద్యమ స్వభావాన్ని వదిలేసి కేవలం రాజకీయ పార్టీగా మారిపోయిన తీరును తెలుపుతాయి.

16. ప్రజలు సామాజిక, సంస్కృతిక ఉద్యమ నాయకత్వంలో మళ్ళీ తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించవలసి ఉన్నది.

టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల పరిమితులు

టిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల రాజకీయ నాయకత్వం తెలంగాణ రాష్ట్ర సమస్యను రాజకీయ లక్ష్యాలకు సాధనంగా భావిస్తున్నాయి. తద్వారా వాటి ఉద్యమాలు ఆయా పార్టీల పరిమితులకు కుదించుకుపోయాయి.

తెలంగాణ ప్రజలకు రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యం
ప్రజల నాడి పట్టుకున్న గద్దర్

అయితే తెలంగాణ ప్రజలు, ఆంధ్ర ప్రజలు తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక

లక్ష్యంగా ముందుకు సాగే ఉద్యమం విస్తరించాలని కోరుకుంటున్నారు. రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంస్థలు ఇందుకు సిద్ధంగా లేవు. పార్టీల రాజకీయ సాధనకు కాకుండా తెలంగాణ ప్రాంత పార్టీలన్నీ తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా కలిసి పనిచేయాలని అందుకు రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఒక ఫ్రంటుగా ఏర్పడాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా కవి గద్దర్ ప్రజల నాడి పట్టుకొని ప్రజల తరపున తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక నినాదంగా, ఏకైక లక్ష్యంగా 1980లో అస్సాంలో సాగిన ఉద్యమంలో లాగా ఆల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఆసు), ఆల్‌పార్టీస్ అలెయన్స్ లాగా ఒక ఫ్రంటు ఏర్పడాలని గత కొన్ని నెలలుగా బలంగా ముందుకు తెస్తున్నారు. అందరూ ఒక ఫ్రంటు అవశ్యకతను అంగీకరిస్తూనే ఫ్రంటుగా ఏర్పడడానికి రాజకీయ పార్టీలు ముందుకు రావడం లేదు. ఎందుకిలా జరుగుతున్నది ?

రాజకీయ పార్టీలు స్వార్థపూరితంగా కదులుతున్నాయి
తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని తమ పావుగా మార్చుకోవాలని చూస్తున్నాయి

రాజకీయ పార్టీలకు అవి ఎన్నికల్లో గెలవడానికి ప్రజల డిమాండ్లను అనేకం స్వీకరిస్తాయి. తమ గెలుపుకు వాటిని సాధనంగా మలచుకుంటాయి. అలా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తమ పార్టీకి ఏ మేరకు లాభిస్తుంది అనే అంశాన్ని ప్రధానం చేసి ఆలోచిస్తున్నారు. ఇది రాజకీయపార్టీ తన ఉనికి కోసం చేసే ప్రయత్నమే తప్ప తెలంగాణ లక్ష్యం కోసం ఉద్యమించడం కాదు.

తెలంగాణ రాష్ట్రం లక్ష్యంగా ఉద్యమించడం వేరు –
తమ అధికారానికి, పార్టీ ఎదుగుదలకు ఒక సాధనంగా భావించడం వేరు

తెలంగాణ లక్ష్యంగా ఉద్యమించడం వేరు. తెలంగాణ రాష్ట్ర సాధనను రాజకీయ లబ్ధికి ఒక సాధనంగా మలచుకోవడం వేరు. తెలంగాణను అంగీకరించిన రాజకీయ పార్టీలు అన్నీ తమ పార్టీ ఉనికికి అనువుగా, విస్తరణకు అనువుగా నడుస్తున్నాయి. ఇదే ఈనాడు తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న ప్రధానమైన సవాలు.

సామాజిక ఉద్యమ నాయకుల అసమర్థత రాజకీయ పార్టీల బలంగా మారింది – అందుకే హైజాక్ చేయగలిగారు

సామాజిక ఉద్యమం రాజకీయ పార్టీల దిశా నిర్దేశం చేసి ప్రజలను తాను

నడుపుతూ పార్టీలు ఆ మార్గంలో నడిచే విధంగా చేయలేక పోయింది. రాజకీయ పార్టీల ఆర్థిక సంపత్తి ముందు, కార్యకర్తల బలం ముందు సామాజిక ఉద్యకారులు నిలువ లేక పోయారు. వాళ్ళు నర్మదా బచావో ఆందోళన్ నిర్మించి ప్రపంచాన్ని ఆకర్షించిన మేధాపాట్కర్‌లా, నీరును నిల్వ చేసి ఎడారులను సస్యశ్యామలం చేసి అపర భగీరథుడుగా సుప్రసిద్ధుడైన రాజేందర్ సింగ్‌లా ఎదగలేకపోయారు. సామాజిక ఉద్యమ కారులు ఓడిపోకపోయినా ఉద్యమం పట్ల తమ బలమైన ముద్రను, నాయకత్వాన్ని, పట్టును నిలుపుకోలేక పోయారు. తద్వారా రాజకీయ పార్టీలకు ఇలా చేస్తే బాగుంటుందని సూచనలు చేసే వాళ్ళుగా కుదించుకు పోయారు.

మేధాపాట్కర్, రాజేందర్ సింగ్ లాంటి నాయకత్వం తెలంగాణ రాష్ట్ర సామాజిక ఉద్యమానికి ఎందుకు కొరవడింది ? స్వతంత్ర సామాజిక ఉద్యమంగా అస్తిత్వం ఎందుకు కోల్పోతున్నది ?

తెలంగాణ సిద్ధాంత కర్తలుగా ప్రసిద్ధులైన డా. కె. జయశంకర్, ఇంజనీర్ ఆర్. విద్యాసాగర్ రావు, కోదండరామ్ మొదలైనవారు సామాజిక ఉద్యమ నాయకులుగా వైఫల్యం చెందారు. ఆయా పార్టీలకు సలహాదారులుగా వారు కోరిన విధంగా విభిన్న రంగాల్లో కార్యక్రమాలు తీసుకుంటున్నారు.

కొన్ని సంస్థలు స్వచ్ఛందంగా ఎన్నో కార్యక్రమాలు తీసుకుంటున్నాయి. అవి కూడా ఎలా మారిపోతున్నాయంటే రాజకీయ నాయకుల మాటల్లో చెప్పాలంటే "మీరు ఉద్యమకారులు దున్ని విత్తనాలేసుకుంటూ పోతే రాజకీయ నాయకులు పంట కోసుకుంటూ వాళ్ల ఇంట వేసుకుంటున్నారు." ఇలా ప్రతీది ఆయా పార్టీలకు అనువుగా మారిపోతున్నాయి. రాజకీయ పార్టీ కార్యకర్తలు సామాజిక ఉద్యమాన్ని రాజకీయ పార్టీ విస్తరణకు అనువుగా మలుచుకోగలుగుతున్నారు.

సామాజిక ఉద్యమానికి ఈ నిర్మాణ శక్తి లోపించింది. అందువల్ల తెలంగాణ సామాజిక ఉద్యమ కారులు, తెలంగాణ సాంస్కృతిక రంగ కళాకారులు అంతిమంగా తెలంగాణ రాజకీయ పార్టీల ఉద్యమాల్లో అంతర్భాగంగా విలీనమైన తీరులో ప్రకటితమౌతున్నది. అవి ఎంత స్వచ్ఛందంగా పనిచేసినప్పటికీ ఈ స్థితి కొనసాగుతున్నది. తెలంగాణ ఉద్యమం ఎదుర్కొంటున్న మరొక ప్రధానమైన సవాలు ఇది.

తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతవేత్తలు ఉద్యమ నాయకులు ప్రపంచ స్థాయిలో ఎందుకు గుర్తింపు పొందలేక పోతున్నారు?

నర్మదా బచావో ఉద్యమంలో మేధాపాట్కర్ నాయకురాలిగా, సిద్ధాంతవేత్తగా ప్రపంచానికి ఒక సందేశం ఇచ్చింది. ప్రపంచం ఆమెవైపు దృష్టి సారించింది. రాజేందర్ సింగ్ నీటి నిల్వ గురించి ప్రపంచానికే మార్గదర్శకులయ్యారు. ప్రపంచ ప్రసిద్ధి చెందారు. తెలంగాణ ఉద్యమంలోని సిద్ధాంతవేత్తలు, ఉద్యమకారులు ఇలా ఎందుకు సుప్రసిద్ధులు కాలేకపోయారు. కేవలం రాజకీయ ఉద్యమంగా ఎందుకు కుదించబడుతున్నది? అస్సాం ఉద్యమంలా ఎందుకు ముందుకు సాగలేదు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంత భూమిక ఎలా రూపొందింది?

తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి నారు పోసి నీరు పోసి నూతన సిద్ధాంత భూమికను రూపొందించిన వారు ఎందరో ఉన్నారు. 1989లో తెలంగాణ ఇన్ఫర్మేషన్ సెంటర్, స్టడీ ఫోరం ఏర్పడ్డాయి. 1991లో జగన్ రెడ్డి కాకతి అనే కలం పేరుతో తెలంగాణ రాష్ట్రం ఆవశ్యకత గురించి చిన్న పుస్తకం ప్రచురించారు. నాట్యకళ ప్రభాకర్ కేంద్రంగా తెలంగాణ సిద్ధాంత భూమిక వ్యాసాలు, పత్రికలు వెలువడ్డాయి. కాళోజి, దాశరథి రంగాచార్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై అనేక కోణాలను మళ్ళీ ముందుకు తెచ్చారు. పెద్ద దిక్కుగా ముందుకు నడిచారు. 1995లో నల్గొండ జిల్లా భోనగిరిలో తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతపై సదస్సు జరిగింది. 1996లో కోఠిలోని వి.వి.హాల్‌లో పెద్ద ఎత్తున తెలంగాణ రాష్ట్రం కోసం సభ జరిగింది. అప్పటి నుండి కాళోజి, దాశరథి రంగాచార్య, పాశం యాదగిరి, గద్దర్, రాపోలు ఆనంద భాస్కర్, మారోజు వీరన్న, మల్లేపల్లి లక్ష్మయ్య, అంబటి సురేందర్ రాజు, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎస్.ప్రభాకర్‌రావు, నాళం కృష్ణారావు, బి.ఎస్.రాములు, ఆకుల భూమయ్య, కె.శ్రీనివాస్, తడక యాదగిరి మొదలైన వాళ్ళు తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి అనేక కోణాలను, సిద్ధాంతాలను జత చేశారు.

బి.ఎస్.రాములు అందించిన సిద్ధాంత భూమిక

సామాజిక తత్వవేత్త, దరకమే ఐక్య వేదిక వ్యవస్థాపకులు బిఎస్.రాములు బహుజన దృక్పథాన్ని బలంగా ముందుకు తెచ్చారు. ఎవరు నాయకత్వంలో ఉంటారో ఆ వర్గాల డిమాండ్లే ముందుకు తెస్తారని, తెలంగాణలో అభివృద్ధిలో

వెనకబడిపోయింది బీసీ, ఎస్సీ, ఎస్టీలేనని ఎవరికన్నా ఎక్కువగా తెలంగాణ రాష్ట్రం వీరికే ఎక్కువ అవసరమని స్పష్టం చేశారు. బహుజనులు నాయకత్వం వహిస్తే అంబేద్కర్ లాగా విద్య, ఉద్యోగ అవకాశాల గురించి ఉద్యమాలు చేస్తారని, స్కూళ్లు, కాలేజీలు వృత్తి విద్యా కాలేజీలు విరివిగా పెట్టాలని ఉద్యమిస్తారని, అగ్రకులాలు నాయకత్వంలోకి వస్తే నీళ్ళు, ప్రాజెక్టులు గురించి డిమాండ్లను, ఉద్యమాలను ముందుకు తెస్తారని సోదాహరణంగా వివరించారు. బహుజనులకు భూమి లేదని, భూములున్న వారికే ప్రాజెక్టుల వల్ల ప్రయోజనమని తద్వారా అగ్రకులాల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక ఆధిపత్యం మరింత పెరుగుతుంది. అలా కాకుండా తెలంగాణలో 610 జి.ఓ. అమలు చేస్తూ నాన్‌ముల్కీ గో బ్యాక్ ఉద్యమాన్ని ముందుకు తెస్తే రెండున్నర లక్షల మంది యువకులకు ఉద్యోగాలు లభిస్తాయి. అందులో బహుజనులు కూడా ఉంటారని విశ్లేషించారు. ఉద్యమం ఊపు అందుకోవడానికి సామాజిక ఉద్యమంలో సామాజిక వర్గాల మధ్య ఈ పోలరైజేషన్ జరిగినప్పుడే లక్షలాది విద్యార్థులు, యువకులు ఉద్యమంలోకి వస్తారు. కేవలం ప్రాజెక్టుల గురించి మాట్లాడితే రైతులు అసంఘటితంగా ఉండడం వల్ల రాజకీయ నాయకుల చేతుల్లోకి ఉద్యమం పోతుంది. ఎవరికి తెలంగాణ వల్ల ప్రయోజనాలు లభించాలో ఆ వర్గాలనే ఉద్యమంలోకి నాయకత్వంగా ఎదిగించాలి. వారి డిమాండ్లనే ముందుకు తీసుకు వెళ్ళాలని 'బహుజన తెలంగాణ'ను సిద్ధాంతీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేశారు.

రాపోలు ఆనంద భాస్కర్ చేసిన కృషి ఇచ్చిన సిద్ధాంత భూమిక

1996 నుండి రాపోలు ఆనంద భాస్కర్ 'తెలంగాణ ప్రగతి వేదిక' పేరిట నిర్మాణ పరంగా అనేక సదస్సులను నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా సభలు జరిపారు. ఇవన్నీ 1969 నాటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సిద్ధాంత భూమిక కన్నా భిన్నమైన సిద్ధాంత భూమికను ముందుకు తెచ్చాయి.

1969 ఉద్యమ సిద్ధాంత భూమిక, 1996 నుండి సాగుతున్న తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత భూమిక ఒకటి కాదు

1969 నాటి జై తెలంగాణ ఉద్యమం, ఆంధ్ర గోబ్యాక్ ఉద్యమం విద్యార్థి ఉద్యమంగా మొదలై విస్తరించింది. కొండా లక్ష్మణ్ బాపూజీ, టి.ఎన్.సదాలక్ష్మి, జె.ఈశ్వరీబాయి మొదలైన వారు నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చారు. తమ శాసన సభ్యత్వానికి రాజీనామా ఇచ్చారు.

1969 జై తెలంగాణ ఉద్యమం మర్రి చెన్నారెడ్డి సృష్టించింది కాదు

ఎనిమిది నెలలు ఉద్యమం సాగిన తరువాత రాజకీయాల్లో పాల్గొనడాన్ని ఆరు సంవత్సరాలు నిషేధిస్తూ మర్రి చెన్నారెడ్డి ఎన్నికను కోర్టు చెల్లదని కొట్టి వేసింది. దాంతో మర్రి చెన్నారెడ్డి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిరాజకీయ నిరుద్యోగిగా ఉద్యమంలో చేరి ఉద్యమాన్ని హైజాక్ చేశారు. 1989 నుండి ప్రారంభమై 1996లో రాపోలు ఆనంద భాస్కర్ నాయకత్వంలో స్పష్టమైన సిద్ధాంత భూమిక రూపం తీసుకున్న తెలంగాణ ఉద్యమానికి 1969 నాటి ఉద్యమానికి నిర్మాణంలో, అవగాహనలో, సిద్ధాంతాల్లో మౌలికమైన భేదాలున్నాయి.

నాటికి, నేటికి సిద్ధాంత భూమికలో మౌలికమైన తేడాలు

1996లో రూపుదిద్దుకున్న తెలంగాణ ఉద్యమానికి ఆంధ్ర గో బ్యాక్ అనేది సిద్ధాంత భూమిక కాదు. 1969 ఉద్యమానికి ఆంధ్ర గో బ్యాక్, ముల్కి, స్థానికులకే ఉద్యోగాలు అనేదొక్కటే సిద్ధాంత భూమిక. 1996లో నీటి సమస్య, ఉద్యోగ సమస్య, చిన్న రాష్ట్రాల అభివృద్ధి సమస్య, అంతర్గత వలస వాద సమస్య, తెలంగాణ భాష, తెలంగాణ సంస్కృతి సమస్య, రాజకీయ అధికార సమస్య, వివక్షత సమస్య, తెలంగాణ జాతుల సమస్య, ఐక్యరాజ్యసమితిలో నానుతున్న హైదరాబాద్ రాజ్య సమస్య మొదలైనవి సిద్ధాంత భూమికగా ముందుకు వచ్చాయి. ఆంధ్రులపై ద్వేషం, ఆంధ్ర గో బ్యాక్ అనేవి ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం కాదు.

12 ఏళ్ళ తర్వాత కూడా ఆంధ్ర గో బ్యాక్, ఆంధ్ర ద్వేషం తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంత భూమికగా స్వీకరించబడలేదు. పైగా కొందరు మిలిటెంట్ పోరాటాల పేరిట ఈ సిద్ధాంతాన్ని ముందుకు తెస్తే ఉద్యమ నాయకుల చేత నిరాకరించబడింది. అందువల్ల 1969 ఉద్యమానికి, 1996 నుండి సాగుతున్న నేటి ఉద్యమానికి సిద్ధాంత భూమిక ఒకటి కాదు.

గ్లోబలైజేషన్, ప్రైవేటేజేషన్ నేపథ్యంలో నేటి తెలంగాణ సిద్ధాంత భూమిక

1995లో ప్రపంచ వ్యాప్తంగా గ్లోబలైజేషన్, ప్రైవేటేజేషన్, లిబరలైజేషన్ పూర్తి స్థాయిలో విస్తరించడం ప్రారంభించాయి. గ్లోబలైజేషన్ సంస్కృతికి, ప్రపంచ బ్యాంక్, అమెరికా రాజకీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఉండే సిద్ధాంత భూమిక కూడా నేటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అంతర్లీనంగా కొనసాగుతున్నది. అందువల్ల నేటి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మౌలికంగా 1969 నాటి ఉద్యమం కన్నా భిన్నమైనది, లోతైన సిద్ధాంత భూమికను కలిగి ఉన్నది. అనేక సిద్ధాంతాల

కలబోతగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఒక సొంత సిద్ధాంత భూమికను రూపొందించుకున్నది.

ప్రధాన మంత్రి దేవెగౌడ కల్పించిన ఆశలు

1996లో ప్రధాన మంత్రిగా ఉన్న దేవెగౌడ చిన్న రాష్ట్రాల ఏర్పాటు గురించి సానుకూలంగా ప్రసంగం చేయడంతో దేశ వ్యాప్తంగా కొత్త ఆశలు మొగ్గ తొడిగాయి. తెలంగాణ రాష్ట్రం కోసం విద్యావంతులు, మేధావులు, రాజకీయ అసంతృప్తి వాదులు తిరిగి సమాలోచనలు చేశారు. అనేక చర్చలు సాగాయి.

ఉస్మానియా యూనివర్సిటీ మేధావులు నిర్వహించిన మహత్తరమైన పాత్ర

ఈ నేపథ్యంలో కాళోజి, రాపోలు ఆనంద భాస్కర్, దాశరథి రంగాచార్య, రఘువీర రావు మొదలైన వారు ఇచ్చిన ప్రేరణతో 1996లో ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ సింహాద్రి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు మొదలైన వారు పూనుకొని సత్వర అభివృద్ధికి చిన్న రాష్ట్రాల ఆవశ్యకత అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహించారు. సెమినార్ పత్రాలను తెలుగు, ఇంగ్లీషులో పుస్తకాలుగా ప్రచురించారు. ఈ సెమినార్‌లో కేంద్ర ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యులు చెన్నమనేని హనుమంతరావు (బిజెపి విద్యాసాగరరావు అన్న) కీలకోపన్యాసం చేశారు. అది తెలంగాణ ఉద్యమానికి బలమైన సిద్ధాంత నేపథ్యాన్ని అందించింది.

నీళ్ళ సమస్య గురించి రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్స్ ప్రభాకర్‌రావు, నాళం కృష్ణారావుగార్లు అందించిన సిద్ధాంత భూమిక

నీళ్ళ సమస్య గురించి, ప్రాజెక్టుల గురించి కేంద్ర ప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్‌గా పని చేసిన ఎస్.ప్రభాకర్‌రావు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ చీఫ్ ఇంజనీర్‌గా పని చేసిన నాళం కృష్ణారావు తెలంగాణ సాగునీటి, తాగునీటి గురించి, తెలంగాణ నీళ్ళు ఇతర ప్రాంతాలకు మలుపుకోవడం వల్ల తెలంగాణ ఎడారిగా ఎలా మారుతున్నదో, ఎలాంటి ప్రాజెక్టులను, అందుకు ఎలాంటి ఉద్యమాలను నిర్మించాలో దశాబ్దాల అనుభవంతో సిద్ధాంతీకరించారు.

తెలంగాణ సాంస్కృతిక వేదిక నుండి అంబటి సురేందర్ రాజు, కె.శ్రీనివాస్, కాసుల ప్రతాప రెడ్డి అందించిన తెలంగాణ సాంస్కృతిక సిద్ధాంత భూమిక

తెలంగాణ సాంస్కృతిక వేదిక పేరిట జర్నలిస్టులయిన అంబటి సురేందర్

రాజు, కాసుల ప్రతాపరెడ్డి, కె.శ్రీనివాస్, జగన్ మొదలైన వాళ్ళు, బి.ఎస్.రాములు, ఎన్.వేణుగోపాల్, సంగిశెట్టి శ్రీనివాస్, దుర్గం రవీందర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి, గ్లోబలైజేషన్ వ్యతిరేక, దేశీయ సంస్కృతి, భాష పరిరక్షణ సిద్ధాంత భూమికగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. తెలంగాణ సంస్కృతి, తెలంగాణ చరిత్ర వేరని వాటి పరిణామాలు ప్రత్యేకమైనవని, ఆంధ్ర ప్రాంత సంస్కృతి, చరిత్ర వేరని ఆంధ్రులు మద్రాస్ ప్రావిన్స్‌లో అణచివేతకు గురయ్యారని తెలంగాణలో రాజరిక వ్యవస్థలో ప్రజలు బతికారని ఇలా అనేక కోణాల్లో చరిత్రను, సాహిత్య, సాంస్కృతిక చరిత్రను పునర్నిర్మించారు.

ఇలా ప్రొ॥ కేశవరావు జాదవ్, డా॥ కె.జయశంకర్, ప్రొ॥ కె.వెంకట నారాయణ, ప్రొ॥ బొబ్బిలి, ప్రొ॥ మురళి మనోహర్, గాదె ఇన్నయ్య, బి.ఎస్.రాములు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆకుల భూమయ్య, కెప్టెన్ పాండురంగారెడ్డి, ప్రొ॥ మధుసూధన్ రెడ్డి, వి.ప్రకాష్, ప్రొ॥ సింహాద్రి, ప్రొ॥ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, దాశరథి రంగాచార్య, పాశం యాదగిరి, గద్దర్, నాట్యకళ ప్రభాకర్, కోదండ రామ్, మేచినేని కిషన్‌రావు, మంద సత్యనారాయణరెడ్డి, డా॥ చెరుకు సుధాకర్, నందిని సిధారెడ్డి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, పచ్చునూరి నర్సయ్య, లోకేందర్ రెడ్డి, సబ్బని లక్ష్మినారాయణ, గోపు లింగారెడ్డి, జీవగడ్డ విజయకుమార్, సందినేని రవీందర్, పోశెట్టి, బి.వి.రావు మొదలైన వాళ్ళు తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి సిద్ధాంత భూమికను అందించారు.

వీరిలో 1996 నుండి కంటిన్యూగా తెలంగాణ ఉద్యమంలో 2007 నాటికి కూడా సిద్ధాంత భూమికతో తెలంగాణ ఉద్యమాలకు వెన్నంటి కొనసాగున్న వాళ్ళలో డా॥ జయశంకర్, పాశం యాదగిరి, కోదండ రామ్, నందిని సిధా రెడ్డి, బి.ఎస్.రాములు, గద్దర్ మొదలైన వాళ్ళు ఇప్పటికీ ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నారు. వీరికి తోడుగా యువతరం నుండి తెలంగాణ ఉద్యోగుల సంఘం నాయకులు విఠల్, శ్రీనివాస్ గౌడ్, సామాజిక ఉద్యమాల నుండి బెల్లయ్య నాయక్, వలిగి ప్రభాకర్ మొదలైన వారు ఎదిగి వచ్చారు.

దరకమే ఐక్యవేదిక అందించిన సిద్ధాంత భూమిక

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వమే ఉండాలని వారే మెజారిటీ ప్రజలని దరకమే ఐక్య వేదిక రాష్ట్ర వ్యాప్తంగా నినదించింది. నినదించడంతో పాటు బి.ఎస్.రాములు గౌరవ అధ్యక్షులుగా వున్న దళిత

రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక సభ్యులైన కనకయ్య, జి.వినోద్ తదితరులు ఎక్కడికక్కడ ప్రశ్నించారు. నిలదీశారు. డా॥ జయశంకర్ మొదలైన వాళ్ళు నీళ్ళు నమిలారు.

ఆకుల భూమయ్య, జనశక్తి కూర రాజన్న, మారోజు వీరన్న ముందుకు తెచ్చిన 'ప్రజాస్వామిక తెలంగాణ' సిద్ధాంత భూమిక

విప్లవ ఉద్యమ నాయకత్వం తెలంగాణ రాష్ట్రాన్ని సమర్థించింది. జనశక్తి రాజన్న, మారోజు వీరన్న, ఆకుల భూమయ్య, టి.హనుమాండ్లు, ఎన్.వేణు గోపాల్ మొదలైన వారు ప్రజాస్వామ్య తెలంగాణ దృక్పథాన్ని ముందుకు తెచ్చారు. ఉద్యమాలు నిర్మించారు. నక్సలైట్ల సానుభూతి పరులని, వారికి ఆశ్రయం ఇస్తున్నారని మీటింగ్‌లకు వచ్చిన ప్రజలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తలలు పగులగొట్టింది. తీవ్ర హింసల పాలు చేసింది.

వెలమల, రెడ్ల నాయకత్వానికి సిద్ధాంత భూమిక నిచ్చినవాళ్ళు

చనిపోయిన ప్రొ॥ బియ్యాల జనార్దన్‌రావు వెలమలు నాయకులుగా ఉండకూడదా అంటూ కొత్త సిద్ధాంతాలను ముందుకు తెచ్చారు. ఆంధ్ర కమ్మలు, ఆంధ్ర రెడ్లు మన మీద పెత్తనం చేయవచ్చు గాని, వారి నాయకత్వాన్ని అంగీకరించవచ్చు గాని తెలంగాణ వెలమల, రెడ్ల నాయకత్వాన్ని అంగీకరించడంలో తప్పేమిటి అంటూ తర్కాన్ని ఆయన ప్రయోగించారు.

డా॥ కె.జయ శంకర్ ముందుకు తెచ్చిన సిద్ధాంత భూమిక

డా॥ జయశంకర్ కూడా రాష్ట్ర వ్యాప్తంగా కుల సమస్య అలాగే ఉంటుంది, స్త్రీ సమస్య అలాగే ఉంటుంది, నాయకత్వ సమస్య అలాగే ఉంటుంది, తెలంగాణ రాష్ట్ర సాధనలో నాయకత్వంలో కులం చర్చ చేయకూడదు అంటూ సమర్థించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల నాయకత్వాన్ని దూరం కొట్టారు. ఎదిగించకుండా వదిలివేశారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బహుళ సిద్ధాంత భూమికలు

ఇలా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అనేక సిద్ధాంత భూమికలు వచ్చి కలిసాయి. కలిసి పని చేస్తున్నారు. ఆ సిద్ధాంత భూమికలు ప్రధానంగా ఇవి.

1. అభివృద్ధికి చిన్న రాష్ట్రాల ఆవశ్యకత - దృక్పథం
2. ప్రజాస్వామ్య తెలంగాణ దృక్పథం

3. వెలమల, రెడ్ల తెలంగాణ దృక్పథం
4. భౌగోళిక తెలంగాణ దృక్పథం
5. సాంస్కృతిక తెలంగాణ దృక్పథం
6. తెలంగాణ విద్యార్థి, యువజనుల, ఉద్యోగార్థుల దృక్పథం
7. సాగునీరు, తాగునీరు దృక్పథం
8. తెలంగాణ ప్రత్యేకచరిత్ర, ప్రత్యేకసాహిత్య, సాంస్కృతిక చరిత్ర దృక్పథం
9. గ్లోబలైజేషన్, ప్రైవేటేజేషన్ వ్యతిరేక దృక్పథం
10. బీసీ, ఎస్సీ, ఎస్టీల దృక్పథం - బహుజన తెలంగాణ దృక్పథం
11. ముస్లిం, మైనార్టీల దృక్పథం
12. తెలంగాణ - జాతుల సమస్య దృక్పథం
13. ముల్కీ, నాన్ ముల్కీ (లోకల్, నాన్‌లోకల్) దృక్పథం
14. స్వపరిపాలన, ఆత్మగౌరవం, పరిపాలనా సౌలభ్యం - దృక్పథం
15. 610 జి.ఓ. అమలుతో పాటు మూడు లక్షల ఉద్యోగాల కోసం, విద్యా సంస్థల ఏర్పాటు కోసం ఉద్యమించే సిద్ధాంత భూమిక

తెలంగాణ ఉద్యమం రాజకీయ ఉద్యమంగా మలుపు తిరిగాక రాజకీయ వృత్తి దారుల చేత జనాంతికంగా తెలంగాణ సిద్ధాంత వేత్తలు అని గౌరవించ బడుతూనే చివరికి అంతఃపురంలో బండికింది కుక్క అని అవమానించబడ్డారు. ఎడ్లబండి కింద నడిచే ఇంటికుక్క బండిని తానే నడుపుతున్నానని అనుకుంటుందట. యజమాని తిని పారేసే బొక్కలు నమిలే కుక్క బండికింది కుక్క అనేది దీని అర్థం.

ఇలా 12 ఏళ్ళుగా తెలంగాణ సిద్ధాంత భూమిక, నాయకత్వం ఫలానా విధంగా ఉండాలంటూ తమను ప్రశ్నించే వారిని, కోరే వారిని డా॥ కె. జయశంకర్, బియ్యాల జనార్దన్ రావు, కోదండరామ్, నందిని సిధారెడ్డి, గాదె ఇన్నయ్య మొదలైన వాళ్ళు మెల్లి మెల్లిగా సామాజిక ఉద్యమాలకు దూరం చేసే ప్రక్రియలు ప్రారంభించారు. పొమ్మనలేక పొగపెట్టారు. తద్వారా వారే నష్టపోయారు. మేధాపాట్కర్‌లా ప్రపంచ ప్రసిద్ధి పొందాల్సిన వాళ్ళు బండికింద కుక్క అనే అవమానాలను భరించాల్సిన దుస్థితి ఏర్పడింది. సామాజిక ఉద్యమ నాయకులుగా యువతరాన్ని ఎదిగించే కృషి చేయకుండా రాజకీయమే వృత్తిగా, జీవితంగా

బతికే వారిని పట్టుకొని తెలంగాణ ఉద్యమానికి రాజకీయ ఉద్యమ స్వరూపం ఇచ్చే కృషిలో ఇలాంటి అవమానాలు ఎదురయ్యాయి. ఇలా మేధాపాట్కర్‌లా ఎదిగే అవకాశాలను కోల్పోయారు. రాజకీయాల్లోనే కాదు సామాజిక రంగంలో కూడా హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయి అనడానికి తెలంగాణ ఉద్యమ సిద్ధాంత వేత్తలే నిదర్శనం.

రాపోలు ఆనంద భాస్కర్ కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం చేసిన కృషి ప్రత్యేకమైనది. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి అనువుగా మార్చడంలో ఆయన కృషి ఫలించినప్పటికీ అవతలి పక్షం నుండి అనేక అవరోధాలు ఎదుర్కొని రాజకీయంగా వెనక్కి నెట్టి వేయబడ్డారు. ఇలా ఆయా పార్టీల్లో, సంస్థల్లో తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత భూమికను రూపొందించిన వాళ్ళు క్రమక్రమంగా వెనక్కి నెట్టివేయబడ్డారు. పరుగు పందెంలో కొందరు ముందుకు సాగారు. లేదా ఉద్యమాన్ని హైజాక్ చేసి తమ చేతుల్లోకి తీసుకున్నారు.

దాంతో డా॥ కె.జయశంకర్, ఆర్.విద్యాసాగర్ రావు, పాశం యాదగిరి, ఎం.కోదండ రామ్, వంటి ఉద్యమ నాయకులు మేధాపాట్కర్‌లా ప్రపంచ స్థాయిలో తెలంగాణ సామాజిక ఉద్యమ నాయకులుగా గుర్తింపు పొందలేకపోయారు. గత 12ఏళ్ళలో వారు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోలేకపోయారు. అందువల్ల తెలంగాణ ఉద్యమం యొక్క గుర్తింపు మేధావుల ద్వారా కాకుండా రాజకీయ పార్టీల గుర్తింపుగా కొనసాగుతున్నది. ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ఉద్యమానికి సైద్ధాంతిక భూమికను ఏర్పర్చి నాయకత్వం వహించి నడిపిన శంకర్‌గుహ నియోగి చనిపోయిన తర్వాత కూడా ఉద్యమం కొనసాగింది. రాష్ట్రం ఏర్పడింది.

తాము ఎదగకపోగా ఎదగదల్చుకున్న నాయకత్వాన్ని అడ్డుకుంటున్న తీరు

మేధాపాట్కర్, శంకర్ గుహ నియోగి వలె తెలంగాణ సామాజిక ఉద్యమ నాయకత్వం సైద్ధాంతిక, భావజాల సామాజిక ఉద్యమ నాయకత్వంగా ప్రపంచంలో ప్రాచుర్యం పొందలేక పోయారు. నిర్మాణం పట్ల వారి శక్తి సామర్థ్యాలు చాలకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

సామాజిక ఉద్యమ కారులు కూడా ఏం తక్కువ తినలేదు

యువతరం ముందుకు రావడం చారిత్రక అనివార్యత. అయితే అలా ముందుకు వచ్చే నాయకత్వాన్ని చాలా పకడ్బందీగా అన్ని వైపుల నుండి

అడ్డుకుంటూ అవకాశాల్లేకుండా, ఎదగకుండా కొందరు అడ్డు పడుతున్నారు. చెంచా గిరి చేసేవాళ్ళు, చెంచా నాయకత్వం సామాజిక ఉద్యమ నాయకత్వంగా ఫోజులు కొడుతూ ముందుకు రావడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతున్నది. అనగా వాళ్ళు సామాజిక ఉద్యమ నాయకత్వంగా మేధాపాట్కర్ లాగా, శంకర్ గుహ నియోగిలాగా ఎదగడానికి సిద్ధంగా లేరు. ఇతరులు ఎదిగితే ఓర్వలేక పోతున్నారు. అడ్డగిస్తున్నారు.

సామాజిక ఉద్యమకారులుపెద్ద కుట్రలు చేసే అంత శక్తివంతులేమి కారు. కానీ...

అందుకు పెద్దకుట్రలేమీ చేయడం లేదు. కుట్ర చేసే అంత శక్తివంతులేమి కాదు. ఏ మీటింగ్ ఎక్కడ జరుగుతుందో ఎవరు, ఎక్కడ ఏ ఉద్యమాలు నిర్మిస్తున్నారో అనే విషయాలను కమ్యూనికేట్ చేయకుండా ఉంటారు. పిలవడం మానేస్తారు. చెప్పడం మానేస్తారు. వాళ్ళు మాత్రం వెళుతుంటారు. కొన్నాళ్ళకు మిగతా వాళ్ళు ఏ విషయం తెలియక ఎదురు చూసి ఆగిపోతుంటారు. ఆయా సామాజిక వర్గాల, కులాల, పేదల, స్త్రీల, ఉద్యోగార్థుల సమస్యలను వదిలేసి ఉద్యమించడం వల్ల ఉద్యమాల పట్ల ఆసక్తిని కూడా కోల్పోతుంటారు.

ఎదగదలుచుకున్న వారికి అవకాశం లేకుండా 12 ఏళ్ళుగా ఈ ఎత్తుగడలతో నిలువరిస్తూ తామే పెద్ద దిక్కుగా కనపడే విధంగా పని చేస్తారు. ఇందుకు పరిమితమైన లక్ష్యాలతో చిన్న చిన్న సంస్థలను బలహీనమైన నిర్మాణాలను ఏర్పాటు చేసి స్థిరమైన నిర్మాణాలను, ఉద్యమ విస్తరణను వాయిదా వేస్తుంటారు. సామాజిక ఉద్యమ నాయకత్వంగా ఎదగాలని ముందుకు వస్తున్న శక్తులు ముందుకు సాగితే తమ ఉనికి శూన్యం అవుతుందని వారి భయం. వారి భయం అర్థం లేనిది. వారిని ఎదిగించకపోవడం వల్ల సిద్ధాంత వేత్తలే ఎలా నష్టపోయారో పైన చూశాం.

సామాజిక సాంస్కృతిక ఉద్యమం పరిష్కరించుకోవాల్సిన సమస్యలు

సామాజిక ఉద్యమం ఉన్నప్పుడే కళాకారులు, రాజకీయ నాయకులు ఉద్యమం పట్ల ఆకర్షితులవుతారు. సామాజిక ఉద్యమానికి రాజకీయ పార్టీలకు లభించే అర్థబలం, అంగబలం సమకూర్చుకోవడం నేటి పరిస్థితుల్లో చాలా కష్టమవుతున్నది. ఒక మీటింగ్ పెట్టడానికి 50 వేల నుంచి 5లక్షల రూపాయల దాకా ఖర్చు అయితే ఆ ఖర్చు ఎలా సేకరించాలి అనేది పెద్ద సమస్య.

సామాజిక ఉద్యమాలు - కార్యకర్తలు

రాజకీయ పార్టీల్లో అయితే ఏదో ఆశించి ఖర్చుపెడతారు. సామాజిక ఉద్యమంలో అయితే ఖర్చు పెడితే మాకేం వస్తుంది? అని వెనుకకు దీస్తున్నారు. నాలుగు మీటింగులు పెట్టడం అంటే ఒక ఎమ్మెల్యేకు నిలబడ్డప్పుడు పెట్టే ఖర్చు కన్నా తక్కువ కావడం లేదు. సామాజిక ఉద్యమానికి ఆర్థిక లోపం వల్ల కార్యకర్తలు కూడా తక్కువవుతున్నారు. వాళ్ళు రాజకీయ పార్టీలకు కార్యకర్తలుగా మారుతున్నారు. తద్వారా వాళ్ళు రాజకీయ పార్టీలు చెప్పిన పని చేసిపెట్టేవాళ్లుగా మిగిలిపోతున్నారు. ఈ స్థితిని మార్చడం ఎలా అనేది ప్రశ్న.

సామాజిక ఉద్యమాలకు వనరుల సేకరణ కొత్త కాదు

ఈ ప్రశ్నకు జవాబును తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యంగా ముందుకు వచ్చే రాజకీయ ఫ్రంట్ నాయకత్వం, సామాజిక ఉద్యమం పట్ల నిబద్ధత ఉన్న వాళ్ళు ఆర్థికంగా సహకరించడం ద్వారా పరిష్కరించుకోవడం అవసరం. ముఖ్యంగా ప్రజల నుండి విరాళాలు సేకరించాలి. లక్షలాది మందిని విరాళాల సేకరణ ద్వారా ఉద్యమంలో మానసికంగా భాగస్వామ్యం చేయాలి.

మీ నాయకత్వంలో ఉద్యమం సాగితే వంద కోట్లు అయినా పెడతారు అని కొందరు ఇచ్చిన హామీయే ఒక గొప్ప ధైర్యం. ఆ మాటలను సాకారం చేయడం ద్వారా సామాజిక, సాంస్కృతిక ఉద్యమం సఫలం అవుతుంది. సంపన్నులపై ఉద్యమాలు ఆధారపడేటట్లు చేయడం కూడా ఒక సిద్ధాంత దృక్పథమే. ప్రజల నుండి ఉద్యమాలు రాకుండ డబ్బున్న వాళ్లు మాత్రమే రాజకీయ, సామాజిక రంగాల్లో ఎదగడానికి ఈ వ్యూహం ఎత్తుగడలు తీసుకుంటారు అనేది మర్చిపోకూడదు.

సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు. నూతన శక్తుల ప్రవేశం

2007 జూన్ మొదటి వారం నుండి తెలంగాణ సామాజిక, సాంస్కృతిక ఉద్యమం మరో మలుపు తిరిగింది. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం మహాసభ నిర్వహించుకొని అల్లం నారాయణ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని వేగవంతం చేయడానికి పునరంకితమైంది. తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి మహాసభ పాశం యాదగిరి కన్వీనర్‌గా నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంది. జూన్ 10న వందలాది కళాకారులతో, గాయకులతో, పాట కవులతో తెలంగాణ సాంస్కృతిక ఫ్రంటు ఏర్పడింది. టిఆర్ఎస్‌తో కలిసి పని చేస్తున్న కళాకారులకు

కూడా ఆహ్వానం పలుకుతూ తలుపులు తీసి ఉంచింది. అలాగే తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక, 25 కుల సంఘాలు వలిగె ప్రభాకర్ నాయకత్వంలో నడుం బిగించాయి.

తెలంగాణ ఉద్యమంలో కుల సంఘాల చురుకైన పాత్ర ఉద్యమాల్లో కొత్త మలుపు

యాదవ, గౌడ, వడ్డెర, పూసల, బోయ, వంశరాజ్ (పిచ్చకుంట్ల),హోలియ దాసరి, బుడగ జంగాల, మొండి, మున్నూరు కాపు, రజక, దక్కలి, నాయీబ్రాహ్మణ బుడుబుడకల, చేనేత, లంబాడ, మాదిగ, ఉప్పరి, మాల, ముదిరాజ్, గంగపుత్ర, భట్రాజు మొదలైన కులహక్కుల పోరాట సంఘాలు తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు నడపడానికి నిర్ణయం తీసుకున్నాయి. గద్దర్, బి.ఎస్.రాములు, పాశం యాదగిరి, అల్లం నారాయణ, వలిగె ప్రభాకర్ తదితరుల నాయకత్వంలో సామాజిక, సాంస్కృతిక ఫ్రంటుల నాయకత్వంలో ఉద్యమాల్లో కొత్త మలుపు ప్రారంభమైంది.

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకంగా మారనున్న బిఎస్‌పి మద్దతు

మరొకవైపు ఉత్తర ప్రదేశ్‌లో బిఎస్‌పి సాధించిన విజయంతో తెలంగాణ రాష్ట్ర సాధనలో బిఎస్‌పి ఒక కీలక పార్టీగా ఎదుగుతున్నది. 2008 అక్టోబర్‌లోగా తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్, యుపిఏ ప్రభుత్వం ప్రకటించకపోతే ఆ తర్వాత కాంగ్రెస్‌కు ఆ అవకాశం ఉండదు. ఎన్నికలకు ముందు ఏం చేయడానికి వీలు కాదు. 2008 ఆగస్టు 15వ తేదీన ప్రధాన మంత్రి, రాష్ట్రపతి తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తున్నామని ప్రకటించకపోతే 2009 శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కాంగ్రెస్ గెలిచే అవకాశం లేదు. తెలంగాణ రాష్ట్రం ప్రకటిస్తేనే కాంగ్రెస్ గెలుస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో పది కన్నా ఎక్కువ లోక్‌సభ సీట్లు రావు. దాంతో పాటు దేశం మొత్తం మీద 100లోపు సీట్లకు కాంగ్రెస్ పడిపోతుంది.

అది ఎలాగంటే దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న బిఎస్‌పి తన అంచనాల ప్రకారం 200పైగా పార్లమెంట్ స్థానాలను సాధించాలనుకుంటున్నది. కాంగ్రెస్‌ను 100 సీట్లకు, బిజెపిని 100లోపు సీట్లకు కుదించడం, ప్రాంతీయ పార్టీల కాంబినేషన్‌తో బిఎస్‌పి కీలక పాత్ర వహించడం మొదలైనవి మాయావతి లక్ష్యాలుగా ప్రకటించారు. కాంగ్రెస్‌తో యుపిఏలో 2009 ఎన్నికల తరువాత కూడా కలిసి ఉన్నప్పటికీ బిఎస్‌పి మద్దతు తెలంగాణ రాష్ట్ర సాధనకు అత్యవసరం. సిపిఐ,

సిపిఎమ్, టిడిపి, టిఆర్ఎస్ పార్టీల కన్నా బిఎస్పి మద్దతు ఎక్కువ అవసరం. అందువల్ల ఈ నేపథ్యంలో బిఎస్పి రాష్ట్ర కమిటి కూడా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేయడానికి నిర్ణయించుకుంది. ఇలా తెలంగాణ ఉద్యమంలో నూతన శక్తుల ప్రవేశం ప్రారంభమైంది.

2009 ఎన్నికల్లో రాష్ట్ర నుంచి లోక్‌సభ స్థానాల్లో టిఆర్ఎస్ 5, టిడిపి 10, బిజెపి 5, బిఎస్పి 5-10, కాంగ్రెస్ 10, వామపక్షాలు మిగతావి గెలుచుకొనే అవకాశాలు వున్నాయని నేటి అంచనా. అందువల్ల కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో ప్రస్తుతం వున్న 135 సీట్లలో రాష్ట్రం నుంచి వున్న 30లో 10 మాత్రమే లభ్యం. మిగతా రాష్ట్రాల్లో ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ సీట్లను బిఎస్పి కైవసం చేసుకుంటుంది. అలాగే బిజెపి సీట్లను కూడా బిఎస్పి కైవసం చేసుకుంటుంది.

ఇలా బిఎస్పి 150 నుండి 200 పైగా పార్లమెంట్ స్థానాలకు ఎదుగుతుంది. దేశంలోనే అత్యధిక మెజారిటీ గల జాతీయ పార్టీగా గుర్తింపు పొందాలని బిఎస్పి లక్ష్యం. బిఎస్పి మద్దతు తెలంగాణ రాష్ట్రానికి సంపాదించాలంటే తెలంగాణలో బిఎస్పి అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా, ఎంపిలుగా ఎన్నుకోవడం అవసరమవుతుంది. లేని యెడల ఏ పార్టీని ఎన్నికల్లో గెలిపించారో వారినే తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇమ్మనండి - మేమెందుకు? అని బహుజన సమాజ్‌పార్టీ తెలంగాణ ప్రజలను ప్రశ్నిస్తుంది. అందువల్ల నూతన శక్తుల ప్రవేశం, టిఆర్ఎస్‌తో పాటు వెలమ రాజకీయాల అంతర్థానం 2009 ఎన్నికల్లో అనివార్యం కానున్నది.కేవలం రాజకీయ పార్టీగా మాత్రమే టిఆర్ఎస్ తన వెలమ, రెడ్డి లాబీ ద్వారా ఇప్పుడున్న స్థానాలను నిలబెట్టుకుంటే అదే మహాగొప్ప.

పెద్దల సహకారం తీసుకుంటూ యువనాయకత్వం ఎదగాలి

గతంలో ఉద్యమాల్లో పని చేసిన గద్దర్, బిఎస్ రాములు, పాశం యాదగిరి, కేశవరావు జాదవ్, దేశం చిన మల్లయ్య, మొదలైన వారికి అనేక అనుభవాలు ఉన్నాయి. వీళ్ళు నాయకత్వం వహించడానికి సమర్థులే. కాని వాళ్లు 60 ఏళ్ళ వయసు పైన ఉన్నారు. వారి ఆలోచన, వారి వయస్సు, ఆరోగ్యం, అనుబంధాలు పూర్తి స్థాయి సామాజిక ఉద్యమం నాయకత్వంగా పని చేయడానికి కుదరడం లేదు. యువతరం నుండి నాయకత్వం ఎదగాలి. ఈజీ మనీ లాగే ఈజీ నాయకత్వం, ఈజీ గుర్తింపు, ఈజీ ఉద్యమం, ఎత్తుగడలు వాళ్లను ఆకర్షిస్తున్నాయి. నిబద్ధతతో

త్యాగంతో ముందుకు వచ్చే యువతరం తగ్గుతున్నది. విప్లవోద్యమాల్లో త్యాగంతో ముందుకు వచ్చే యువతరం చనిపోయింది. మిగతా వాళ్లు బాధలకు గురయ్యారు. ఇలా నాయకత్వ సమస్య కూడా ఉంది.

ఆగిన చోటు నుంచి ముందుకు కదిలిన ఉద్యమం

తెలంగాణ ఉద్యమం గత కొన్ని నెలలుగా ఒక చౌరస్తాలో ఆగింది. ఇప్పుడు మరో మలుపు తీసుకుంది. రాజకీయ పార్టీల శక్తుల నుండి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తిరిగి తెలంగాణ సామాజిక, సాంస్కృతిక ఉద్యమంగా, తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యంగా ముందుకు సాగే ఉద్యమ నాయకుల నాయకత్వం ముందుకు వచ్చింది.

అయితే ఈ సారి సామాజిక ఉద్యమ నాయకులు రాజకీయంగా కనువిప్పుతో జాగ్రత్తగా ఉండాలి. మళ్ళీ ముందుకు సాగితే కాంగ్రెస్‌తో సహా అన్ని పార్టీలు మళ్ళీ తెలంగాణ పేరు అమ్ముకొని ఓట్లు, సీట్లు సంపాదిస్తాయి. తద్వారా తెలంగాణ రాష్ట్ర సాధన అనే లక్ష్యం కోసం కాకుండా, తమ పార్టీ లక్ష్యం కోసం ముందుకు సాగే ఉద్యమాలు సాగుతాయి. అందువల్ల సామాజిక సాంస్కృతిక ఉద్యమంలాగే తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యంగా ముందుకు వచ్చిన 12 పార్టీల ఐక్య సంఘటన రాజకీయ ఫ్రంటుగా ఒక్కటి కావడం జరిగింది.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు ఒక తక్షణ కార్యక్రమం

దీనికి తక్షణ కార్యక్రమంగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో 150 కార్పొరేటర్ సీట్లకు తెలంగాణ వాదులను పోటీకి నిలబెట్టి గెలిపించడం అనే లక్ష్యాన్ని తీసుకోవడం జరిగింది. గద్దర్ శాంతి యాత్రలాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తెలంగాణ సాంస్కృతిక ఫ్రంట్ వందలాది కళాకారులతో ప్రదర్శనలను నిర్వహించనున్నది.

610 జి.ఒ. అమలు చేయాలని 12 పార్టీల ఫ్రంటు, కేశవరావు జాదవ్ నాయకత్వంలో రిలే నిరాహారదీక్షలు జరుపుతున్న సమయంలో జూన్ 10, 2007న ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో గద్దర్ ఆశీస్సులతో ఆయన కలను సాకారం చేస్తూ తెలంగాణ సాంస్కృతిక ఫ్రంట్ ఏర్పడింది. వందలాది కళాకారులు రాత్రంతా ప్రహల్లాద్ నాయకత్వంలో సాంస్కృతిక కళారూపాలతో జాగారం కార్యక్రమం నిర్వహించారు.

గద్దర్ నేతృత్వంలో సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు

గతాన్నంతా సమీక్షిస్తూ గద్దర్, తదితరులు సీరియస్‌గా ఆలోచించి సామాజిక ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం కలిసి సాగాలని ఫ్రంటుగా ఏర్పడి తెలంగాణ ఏకైక లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రతిపాదన ముందుకు తెచ్చారు. అయితే మీరు దీనికి నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉంటేనే ఈ ప్రతిపాదన చేయండి అని తెలంగాణ రచయితలు, మేధావులు, జర్నలిస్టులు, ప్రజలు, కళాకారులు గద్దర్‌ను కోరారు. గద్దర్ దీనికి మొదట స్పష్టమైన జవాబు ఇవ్వలేదు. సమిష్టి నిర్మాణంలో నేను కూడా కలిసి పని చేస్తానని అన్నారు. అలా కాదు, స్పష్టంగా మీరే నాయకులుగా ఫ్రంటు నిర్మాణం కావాలి అని వాళ్ళు కోరారు. చివరకు గద్దర్ మీ అందరి వెంట నడుస్తానని గౌరవ సలహాదారుగా నాయకత్వం వహిస్తానని అంగీకరించారు.

'ఉద్యమాలు మావి! సీట్లు మీవా!' ఇంకానా! ఇకపై చెల్లదు

ఇలా ప్రజా యుద్ధ నౌక గద్దర్‌తో పాటు సామాజిక ఉద్యమ కారులు, బహుజన సమాజ్ పార్టీ, కుల సంఘాల సమన్వయ కమిటి, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తెలంగాణ బహుజన విద్యావంతుల వేదిక, తెలంగాణ జన పరిషత్, తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి మొదలైన నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మరో మలుపు ప్రారంభమైంది. 'ఉద్యమాలు మావి! సీట్లు మీవా!' ఇంకానా! ఇకపై చెల్లదు. అని సామాజిక ఉద్యమ నాయకత్వం నిలదీస్తూ తామే రాజకీయ నాయకత్వాన్ని కూడా అందించడానికి నడుం బిగించింది. అస్సాంలో ఉద్యమ కారులే రాజకీయ నాయకులుగా ఎన్నికైన క్రమాన్ని తన ఆదర్శంగా ప్రకటించుకుంది. అందుకే అస్సాం ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకొని ఆల్ స్టూడెంట్స్ ఫ్రంట్, కల్చరల్ ఫ్రంట్, పొలిటికల్ ఫ్రంట్ ఏర్పడ్డాయి. వచ్చే ప్రతి ఎన్నికలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తెలంగాణ సామాజిక ఉద్యమ కారులే ఎన్నికల్లో నిలబడడం, నిలబెట్టడం, గెలవడం, గెలిపించడం కోసం ముందుకు వచ్చారు. మా ఉద్యోగాలు మాకే, ఇతర ప్రాంతాల వారిని వెనక్కి పంపండి అని 1996లో ప్రారంభమైన ఉద్యమాన్ని అలాగే కొనసాగించి ఉంటే నూతన జవ సత్వాలు, యువతరం నాయకత్వం అప్పటి నుండే ఎదిగి ఉండేది. ఇలా 12 ఏళ్ళ ఆలస్యంగా నైనా తిరిగి సామాజిక ఉద్యమం చేతుల్లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కేంద్రీకృతం కావడం, పట్టు సాధించడం సంతోషించాల్సిన విషయం.

ప్రజాసమస్యలను పట్టించుకోని పార్టీలెందుకు?

తెలంగాణ సమస్యలపై కదులుతున్న టిడిపి, బిజెపి

ఇటీవల బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని టిడిపి, బిజెపి ఉద్యమించాయి. మొదట నిజామాబాద్ ఎం.పి. మధుయాస్కీ గౌడ్ దీన్ని వెలికితెచ్చారు. ఇటీవల ఇలాంటి ప్రాజెక్టులు గోదావరి మీద మరికొన్ని కడుతున్నారని పత్రికల ద్వారా, టీవీల ద్వారా నిర్ధారణ అవుతున్నది. ఒక ప్రతిపక్ష పార్టీగా టిడిపి ఈ విషయంలో విజయం సాధించింది. అలాగే లక్షలాది బీడీ కార్మికుల కుటుంబాలకు, జీవితాలకు సంబంధించిన పుర్రెగుర్తు బొమ్మను నిషేధించాలని టిడిపి ఉద్యమించడం హర్షదాయకం.

ప్రజాసమస్యలను పట్టించుకోవడంలో వెనుకబడుతున్న టిఆర్ఎస్

తెలంగాణ ప్రజల సమస్యలపై తెలంగాణ పార్టీగా రూపుదిద్దుకున్న టిఆర్ఎస్ ముందుకు కదలకపోవడం విచారకరం. పైగా ముందుకు కదిలిన పార్టీలను రాజకీయం చేస్తున్నారని విమర్శించడం సరియైనది కాదు. నిజానికి టిఆర్ఎస్ పార్టీ ముందు నడుస్తుంటే మిగతా పార్టీలు పరుగెత్తుకొని వచ్చే విధంగా ప్రజా సమస్యలపట్ల టిఆర్ఎస్ కదలాలి. కాని, ఇందుకు విరుద్ధంగా ఇతర పార్టీలు కదిలిన తర్వాత అందరూ విమర్శించిన తర్వాత బీడీ కార్మికుల గురించి సదస్సు పెట్టడం, పోతిరెడ్డిపాడు, దుమ్ముగూడెం, పోలవరం ప్రాజెక్టులను నిలపడం గురించి మాట్లాడడం వెనుకబడి నడవడమే తప్ప నాయకత్వం వహించడం కాదు.

అన్యాయాలను నిలువరించడంలో వైఫల్యం చెందుతున్న టిఆర్ఎస్

టిఆర్ఎస్ పార్టీ మొదటి నుండీ ప్రజా సమస్యలను పట్టించుకోవడంలో వైఫల్యం చెందుతూనే ఉన్నది. అందువల్లే ఆరేళ్ళుగా తెలంగాణ ఉద్యమం

విస్తరించినప్పటికి తెలంగాణకు మునుపెన్నడూ జరగనంత అన్యాయం జరిగిపోతూనే ఉంది. ఉద్యమించే చేవ ఉన్న తెలంగాణ ప్రజలను ప్రేక్షకులుగా మార్చిన ఘనత తెలంగాణ రాష్ట్ర సమితికే దక్కుతుంది. బీడీ కార్మికుల సమస్య అదేదో చిన్న సమస్య అయినట్లు మొదటి నుంచి టిఆర్ఎస్ తేలికగా మాట్లాడడం, ప్రజల పట్ల, ప్రజల ఉపాధి పట్ల టిఆర్ఎస్‌కు గౌరవం లేకపోవడమే స్పష్టం చేస్తుంది. టిఆర్ఎస్‌కు దీని పట్ల స్పష్టత ఉంటే కార్మికుల తరపున అనేక కోణాల్లో చర్చించి వారికి మద్దతు ఇచ్చి ఉండేది. ప్రజాపునాది కదిలిపోయిందని తెలిసాక నిజాం కాలేజి గ్రౌండ్‌లో టిఆర్ఎస్ బీడీ కార్మికుల సభ జరపడం వల్ల అది ఇవ్వాల్సిన స్ఫూర్తిని ఇవ్వలేక పోయింది.

బీడీల కన్నా ముందు మద్యం మీద పుర్రె గుర్తులు ఉంచాలి
గంజాయి పంటలాగా పొగాకు పంటను నిషేధించాలి
మద్యం పరిశ్రమను దేశంలో మూసివేయాలి

బీడీ తాగడం, పొగాకు ప్రజల ఆరోగ్యానికి చెరుపు చేసేదైతే పొగాకు పంటనే గంజాయి పంటలాగా నిషేధించాలి. సిగరెట్లమీద, గుట్కామీద, నశ్యం మీద, జర్దా మీద, కిమామ్ మీద ఇలాంటి పొగాకు ఉత్పత్తులన్నింటిమీద పుర్రెబొమ్మ వేయడంతో పాటు మద్యం, కూల్‌డ్రింక్స్ మీద వేయాలి. ముందు మద్యం మీద పుర్రె గుర్తు వేశాక రెండేళ్ళకు పొగాకు గురించి ఆలోచించవచ్చు. ఇదేదీ చేయకుండా బీడీల మీదనే వేయాలని ఎందుకు పట్టుబడుతున్నారు? ఇది స్పష్టంగా సామ్రాజ్యవాద మల్టీనేషనల్ కంపెనీల ప్రయోజనాల కోసం చేస్తున్న ప్రయత్నమే. సారాను తొలగించి విస్కీ బ్రాందిషాపులను విస్తరించారు.

చేతివృత్తులను ధ్వంసం చేసి మల్టీనేషనల్ కంపెనీలను పెంచితే ప్రజలు ఏం పని చేసుకొని బతకాలి ?

కుటీర పరిశ్రమలను ధ్వంసం చేసి పారిశ్రామిక ఉత్పత్తులను విస్తరించారు. కులవృత్తులు కోల్పోయారు. నేడు కొత్తిమీర కూరగాయలు, పండ్లు అమ్మకాలు, కిరాణాషాపులు కూడా మల్టీనేషనల్ కంపెనీలు చేపడుతున్నాయి.

ఇలా ప్రతి రంగం నుంచి వాటిమీద ఆధారపడిన స్థానిక వృత్తులవారిని, వ్యాపారస్తులను తొలగిస్తూ నిరుద్యోగులుగా మారుస్తూ బహుళజాతి కంపెనీలు తమ లాభాలను పెంచుకుంటున్నాయి. నిరుద్యోగులను, పని కోల్పోయినవారిని మిగులు జనాభా అని వర్ణిస్తున్నారు. మనుషులను మిగులు జనాభా అని

వర్ణించడం, వర్గీకరించడం అంత దుర్మార్గమైన, అమానుషమైన దృక్పథం మరొకటి లేదు. మనుషులు సమస్త సంపదలను సృష్టిస్తారు. చేతులు, కాళ్ళు మేధస్సు కలిసి మనిషి సమాజాన్ని ఇంత దూరం తీసుకువచ్చారు. ఇవాళ మనిషే మిగులు జనాభా అని వర్గీకరించడం ఎవరిదృక్పథం? అది స్పష్టంగా పారిశ్రామిక వేత్తల, పెట్టుబడిదారుల దృక్పథం.

పది బర్రెలు ఉంటే 20 లీటర్ల పాలిస్తాయంటారు. పది మంది మనుషులుంటే పది రకాల పనులు చేస్తారు. అమెరికాలో 28కోట్ల జనాభా ఉంటే ఇండియాలో 110 కోట్ల జనాభా ఉంది. అమెరికా కన్నా నాలుగు రెట్ల మనుషులున్నారు. కనుక అమెరికా కన్నా నాలుగురెట్ల సంపదను ఇండియాలోని మనుషులు సృష్టించగలరు అనే దృష్టితో ఆలోచించాలి.

టీ, కాఫీ, మద్యం, కూల్‌డ్రింక్స్ మొదలైన అన్నింటిపై పుర్రె గుర్తు వేయాలి

బీడీల్లో ఉండే విషపదార్థం వంటివే టీలో, కాఫీలో, కూల్‌డ్రింక్స్‌లో మరెన్నో వస్తువుల్లో ఉన్నాయి. సారా, విస్కీ, బీరు మొదలైన వాటిలో ఇంతకన్నా విషపదార్థాలు, హాని పదార్థాలు ఉన్నాయి. వాటన్నింటిని నిషేధించాలి. దానికన్నా ముందు వీటన్నింటిపై పుర్రె గుర్తు బొమ్మలను ముద్రించాలి. ఇవేవీ చేయకుండా కేవలం బీడీలపై పుర్రె గుర్తు వేయాలని ప్రయత్నించడం ప్రజల జీవితాల మీద యుద్ధం ప్రకటించడమే.

బీడీ కార్మికులు రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌జిఓల సంఖ్యతో సమానంగా బీడీ పరిశ్రమ మీద ఆధారపడి పేదలు బతుకుతున్నారు. సింగరేణి బొగ్గుగనులపై లక్షా ఇరవై అయిదు వేల కుటుంబాలు మాత్రమే ఆధారపడి బతుకుతున్నారు. వ్యవసాయం తర్వాత చేనేత ఉపాధిగా ఉండేది. చేనేత వృత్తి బట్టల మిల్లుల వల్ల పతనమైపోయింది. చేనేత కులాలు పతనమైపోయారు. ఈ దశలో బీడీ పరిశ్రమ వారికి ఒక ఆధారంగా నిలిచింది.

నిజంగా ప్రభుత్వానికి, కోర్టులకు ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ పనులు చేసి నిరూపించుకోవాలి

ప్రజల ఆరోగ్యానికి చెరుపు చేసే మాటకొస్తే ఈ దేశంలోని సగం వృత్తులు నిషేధించాల్సి వస్తుంది. శివకాశీలోని అగ్గిపెట్టెల పరిశ్రమ, టపాకాయల పరిశ్రమ మూసివేయాల్సి వస్తుంది. తేయాకు పరిశ్రమ, సిగరెట్ పరిశ్రమ, కూల్‌డ్రింక్స్, మద్యం పరిశ్రమ ఈ దేశం నుండి వలస పోవాల్సివస్తుంది.

కంకర, ఇసుక, సిమెంటు, మట్టి, పత్తి, నూలు, తోలుతో పనిచేసే అన్ని రంగాలు చెరుపుచేసేవే. రైసుమిల్లులు, తోళ్ళ పరిశ్రమలు, హార్డ్‌వేర్ చిప్స్, ఎరువుల పరిశ్రమలు, పెస్టిసైడ్స్ పరిశ్రమలు అన్నీ కార్మికులకు, ప్రజలకు ఆరోగ్యంలో చెరుపు చేసేవే. చివరకు వ్యవసాయంలో వాడే ఎరువులు, మందులు అన్నీ, ఆర్‌టిసి బస్టాండ్‌లు, రైల్వేలోని టాయిలెట్లలో పనిచేసే వారందరికీ అవి చెరుపు చేసేవే. చివరకు పెట్రోల్, డీజిల్ వాడకం కూడా మొత్తం మానవాళికి నష్టం చేసేవే. ఇవన్నీ నిషేదించడం అవసరమే. ఆధునిక సమాజంలో ఇవన్నీ నిషేదించడం సాధ్యమా? మనిషి ప్రకృతితో పోరాటం చేస్తూ ఎన్నో కష్ట నష్టాలు ఎదుర్కొన్నారు. ఎందరో పాములు, తేళ్ళ బారి పడుతున్నారు. ఇవాళ యంత్రాల బారిన పడుతున్నారు. యాక్సిడెంట్లలో దేశంలో యేటా లక్ష మంది చనిపోతున్నారు. ఇవన్నీ నివారించడం సాధ్యమా?

ప్రత్యామ్నాయం ఉంటే ఈ దిక్కుమాలిన వృత్తులు ఎందుకు చేస్తారు?

ఉపాధి పరిశ్రమలను నిషేధిస్తే ప్రత్యామ్నాయం ఏమిటి? ప్రత్యామ్నాయం ఉంటే ఈ దిక్కుమాలిన వృత్తులెందుకు చేస్తారు? సరియైన వృత్తులను వారికి కల్పించలేకపోవడం వల్లే అనారోగ్యకరమైన వాతావరణంలో పనిచేస్తున్నారు. పెంట కుప్పల్లోంచి చిత్తు కాగితాలు ప్లాస్టిక్ కవర్‌లు ఏరుతూ, పెంటకుప్పలను జారవేస్తూ వేలాది మంది రోగాల బారిన పడుతున్నారు. వైరస్ సోకి చనిపోతున్నారు. ఇలా దేశంలోనే కాదు ప్రపంచమంతటా కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. పెట్టుబడుదారుల, పారిశ్రామిక వేత్తల సామ్రాజ్యవాదుల లాభాల కోసం ప్రయోజనాల కోసం మానవాళి మొత్తం ప్రమాదంలో పడుతున్నది. చివరికి కోట్లాది ప్రజలు వృత్తులు కోల్పోయి ఆకలితో చచ్చిపోతున్నారు. ఈ సామ్రాజ్యవాద విస్తరణను అడ్డుకోకపోతే భారతదేశంలో అంతర్యుద్ధం తప్పదు. ప్రజలు చైతన్యవంతులయ్యారు. వారి చేతుల్లో ఓటు హక్కు ఉంది. వారి చేతుల్లో నైపుణ్యం ఉంది. ఈ ప్రభుత్వాలను వెంటది వెంట మార్చేసుకుంటారు.

ప్రజా సమస్యల పట్ల టిఆర్‌ఎస్ తన దృక్పథాన్ని మార్చుకోవాలి అభివృద్ధిని వికేంద్రీకరించాలి – స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించాలి

ప్రభుత్వాలు స్థానిక పరిశ్రమలను ప్రోత్సహించాలి. అభివృద్ధిని వికేంద్రీకరించాలి. మనిషికి పని కల్పించే పరిశ్రమలను రూపొందించాలి. యంత్రాలను తగ్గించాలి. అలాగే రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల కోసం

ప్రజలను కదిలించాలి. ఉద్యమించాలి. ప్రభుత్వాల కళ్ళు తెరిపించాలి. ప్రభుత్వాల నిర్ణయాలను, సుప్రీంకోర్టు నిర్ణయాలను మార్పించాలి. అంతేగానీ, టిఆర్‌ఎస్ వంటి పార్టీలు పుర్రెగుర్తుకు వ్యతిరేకంగా టిడిపి ఉద్యమిస్తే ఓట్ల రాజకీయాలను విమర్శించడం పొరపాటు. ఓట్ల రాజకీయాలు లేనిదెక్కడ ? పోలవరం, పోతిరెడ్డిపాడు, బాబ్లీ ప్రాజెక్ట్‌లను వ్యతిరేకిస్తూ, బీడీలపై పుర్రె గుర్తును వ్యతిరేకిస్తూ ఉద్యమించకపోతే పార్టీలెందుకు? ప్రజాసమస్యలను పట్టించుకోని పార్టీలు దేనికి?

మహారాష్ట్ర ప్రజల గురించి కూడా పట్టించుకోవాలి. వారి వాటా నీళ్ళు వారికి అందాలి

అయితే మహారాష్ట్ర ప్రభుత్వం తెలంగాణా భూభాగంలోని నీళ్ళను తన ప్రాంతానికి మళ్ళించడం లేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం, వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి తెలంగాణా భూభాగంలోని నీటిని ఆంధ్రప్రాంతానికి దారిమళ్ళిస్తున్నారు. టిడిపి, కాంగ్రెస్ తెలంగాణ నీళ్ళను ఆంధ్రకు మళ్ళించడాన్ని అడ్డుకుంటూ ఉద్యమాలు చేసినప్పుడే వారి చిత్తశుద్ధి నిరూపించుకున్నవారు అవుతారు.

ఎవరి భూమి మీద వర్షం పడిందో అది వారిదే. అది ప్రకృతి సూత్రం. అయితే నీటి ఒప్పందాల ప్రకారం స్థానికులకు 60శాతం నీళ్ళు అందినాకే ఇతర ప్రాంతాలకు వాడుకోవడానికి అవకాశం ఇవ్వబడింది. ఆ పరిమితి ప్రకారం మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు కట్టుకుంటున్నదా? అనేది కూడా పరిశీలించాలి. లెక్కలు తీయాలి.

నీటి లెక్కలు తీయకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తప్పు దారి పట్టించే ఆవేశాలు పెంచడం సరియైనది కాదు. ప్రాజెక్టులు కడుతున్న మహారాష్ట్ర ప్రాంతం జొన్నలు పండించుకొని తినే మెట్ట ప్రాంతంగా ఉంది. వారు నీటి వనరుల వినియోగం వల్ల కాస్త అభివృద్ధి చెందే అవకాశం ఉండవచ్చు. అక్కడి ప్రజల గురించి కూడా ఆలోచించడం అవసరం.

టిఆర్‌ఎస్, టిడిపి, బిజెపి పార్టీలు తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో చిత్తశుద్ధిని నిరూపించుకుంటూ ఉద్యమాలు నిరూపించాలి తెలంగాణా నీళ్ళను మళ్ళించే ప్రాజెక్టులను అడ్డుకునే ఉద్యమాలు చేయాలి

కానీ తెలంగాణ నదుల విషయం వేరు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న నష్టం వేరు. ఒకే ప్రాంతం, ఒకే రాష్ట్రం పేరిట తెలంగాణ నీళ్ళు ఇతర ప్రాంతాలకు మళ్ళిస్తున్నారు. 60శాతం నీళ్ళను స్థానికంగా ప్రాజెక్టులు కట్టకుండానే మొత్తం

నీళ్ళను ఇక్కడ భూములకు పారించకుండా ఆంధ్రప్రాంతానికి, రాయలసీమకు తరలించుకునిపోవడం ద్రోహం. ఇది జీవించే హక్కును కాలరాయడమే. సంపదను సృష్టించకుండా తరలించుకు పోవడమే.

పోతిరెడ్డిపాడు, పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవడం ద్వారా
టిఆర్ఎస్, టిడిపి పార్టీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
స్థానికంగా ఎక్కడికక్కడ పెద్ద చెరువులు చిన్న ప్రాజెక్టులు కట్టాలి

ఇక నుండైనా తెలంగాణా రాష్ట్ర సమితి ప్రజా సమస్యలను పట్టించుకొని ఉద్యమించడం అవసరం. అలాగే తెలుగుదేశం పార్టీ డొంకతిరుగుడు పద్ధతిలో తెలంగాణాలో బలం పెంచుకోవాలనుకునే బదులు తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ఆమోదిస్తూ తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. నీటి లెక్కలను వర్షపాతం అనుసరించి సరిచూడాలి. ఈ విషయమై ఇదివరకే వివరంగా రాశాను. ఒక వెయ్యి మిల్లీ మీటర్ల వర్షపాతం తెలంగాణ ప్రాంతానికి అవసరం. అంతకు మించిన వర్షాలేవీ పడడం లేదు. వర్షపాతమేమీ సమోదు కావడం లేదు.

అందువల్ల తెలంగాణ నుండి వాగుల ద్వారా, నదుల ద్వారా ప్రవహించే నీరంతా తెలంగాణ భూముల సాగు కోసం ఎక్కడికక్కడ నిలువ చేసుకోవాలి. అందుకు ప్రతి ఐదు, పది కిలోమీటర్లకు నదిపై కాకుండా నది పక్కన పెద్ద కాలువ, పెద్ద పాయ తీసి పెద్ద చెరువులను, చిన్న ప్రాజెక్టులను కట్టి వాగుల నుండి, నదుల నుండి నీటిని మళ్ళించాలి. తద్వారా మట్టి, ఇసుక ప్రాజెక్టులోకి చేరకుండా చూసుకోవాలి. కాకతీయులు కట్టిన పాకాల, రామప్ప చెరువులను ఆదర్శంగా తీసుకొని ఆధునిక ప్రాజెక్టులను నిర్మించాలి. భారీ ప్రాజెక్టుల వల్లనే అనవసరమైన చర్చలు దశాబ్దాల తరబడి నీరు వృధాగా సముద్రం పాలవుతున్నది.

తెలంగాణా ప్రాంతానికి నష్టం చేసే పోలవరం, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులకు వ్యతిరేకంగా టిడిపి ఉద్యమించాలి. టిఆర్ఎస్ ఉద్యమాలు చేయకుండా ఉండడంలో అర్థం లేదు. ఉద్యమాలు చేయకుండా మిగిలిపోతే అది కేవలం రాజకీయ పార్టీ అవుతుంది తప్ప తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను అడ్డగించి న్యాయాన్ని సాధించే రాజకీయ పార్టీగా మిగలదు. ప్రజా సమస్యలను పట్టించుకోని పార్టీలెందుకు? తెలంగాణ పేరు చెప్పుకొని ఓట్లు, సీట్లు దండుకోవడానికా? అనే ప్రజల ప్రశ్నకు అన్ని పార్టీలు జవాబివ్వాల్సిన అవసరం ఉంది.

అసలు కర్తవ్యాలను వదిలేసి దారితప్పుతున్న

తెలంగాణ రాష్ట్ర సామాజిక ఉద్యమాలు

తెలంగాణ రాష్ట్ర సాధన సామాజిక ఉద్యమాలు అసలు కర్తవ్యాలను వదిలేసి రాష్ట్ర సాధన లక్ష్యం వైపు ముందుకు సాగకుండా దారితప్పుతున్నాయి.

ఒక మీటింగ్ పెట్టగానే ఏదో పొడిచేసినట్టు ఫోజు కొట్టడం
సామాజిక ఉద్యమాల్లోని ప్రధాన లోపం

తెలంగాణ సామాజిక ఉద్యమకారులు ఒక మీటింగ్ పెట్టడమే తెలంగాణ తెచ్చాం అనేంతగా, తెలంగాణ కళాకారులు ఆటపాటలతో తామే ఉద్యమాన్ని నడుపుతున్నాం అనేంతగా ఎవరికి వారు ఫీలైపోతున్నారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో పని చేసే వారు ఎవరికి వారే తామే గొప్ప అని భావిస్తున్నారు. ఇలా ఒకరినొకరు విస్మరించుకుంటున్నారు. దూరం కొడుతున్నారు. అగౌరవ పరుస్తున్నారు. ఇది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం సెల్ఫ్ ఐడెంటిటీ కోసం వ్యక్తులు బృందాల మధ్య చీలిపోతున్న విషయాన్ని తెలుపుతున్నది.

టిఆర్ఎస్ ఉద్యమాల మేరకైనా సాగని సామాజిక ఉద్యమాలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగుతున్న రాజకీయ ఉద్యమం, రాజకీయ పార్టీల లక్ష్యాల సాధనలో అనేక సమస్యలను తీసుకొని ముందుకు సాగుతున్నది. మహారాష్ట్రా రోకో, తెలంగాణ జాతర, తెలంగాణ సంబురాలు, తెలంగాణ రన్, తెలంగాణ విశ్వరూపం, తెలంగాణ నీళ్ళ ప్రాజెక్టుల కోసం ఉద్యమాలు, బీడికట్టలపై పుర్రెగుర్తు ఉద్యమాలు, పోతిరెడ్డిపాడు, పోలవరం ప్రాజెక్టు, దుమ్ముగూడెం, టేల్‌పాండ్ వ్యతిరేక ఉద్యమాలు, ఫ్లోరోసిస్ వ్యతిరేక ఉద్యమాలు మొదలైన అనేక సమస్యలపై ఉద్యమిస్తున్నారు. రాజకీయపార్టీలు ఏదో ఒక కార్యక్రమాన్ని ముందుకు తీసుకొని పోతున్నవి. ఆ మేరకు టిఆర్ఎస్, బిజెపి, టిడిపి కృషి హర్షించవలసినదే.

రాజకీయ పార్టీలు తమ లక్ష్యం కోసం తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి తన

వంతు కృషి చేస్తున్నాయి. ఉద్యమం నిర్మించి తమకు ఓట్లుగా మార్చుకుంటున్నాయి. ఓట్లుగా మార్చుకున్న తరువాత పెరిగిన శక్తితో తిరిగి ఉద్యమాలను మరింత విస్తరింప చేయాలి. అలా చేయకుండా ఆగిపోతున్నారు. ఇంతకన్నా హీనంగా సామాజిక ఉద్యమ కార్యకర్తలు ఓ మీటింగ్ పెట్టడమే బ్రహ్మాండం బద్దలు కొట్టినట్లు ఛాతీ విరుచుకుంటున్నారు.

సామాజిక ఉద్యమం ఎందుకు బలహీనంగా కొనసాగుతున్నది.
సిద్ధాంత అధ్యయన తరగతులు, తెలంగాణ చరిత్ర అధ్యయనం అవసరం

ఇలా సామాజిక ఉద్యమంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమం బలహీనంగా సాగుతున్నది. తెలంగాణ విద్యావంతులు, మేధావులు తాము చేయాల్సిన పనులు చేయకుండా మిగతా పనులు చేస్తున్నారు. తెలంగాణ రచయితలు, విద్యావంతులు, మేధావులు తెలంగాణ చరిత్ర సంస్కృతి ఉద్యమాల గురించి శిక్షణా తరగతులు నిర్వహించాలి. రచనలు చేయాలి. కరపత్రాలు పంచాలి. ఇది వారు మాత్రమే చేయగలిగిన కర్తవ్యం.

తెలంగాణ ఉపాధ్యాయులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలు చేయాలి

దానితోపాటు తెలంగాణ ఉపాధ్యాయులు, కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు తెలంగాణ సాధన కోసం పెన్‌డౌన్, సమ్మె, టోకెన్ సమ్మె, నిరవధిక సమ్మె మొదలైన ఉద్యమాలు చేపట్టాలి. తమ జీతాల కోసం, సమస్యల కోసం సమ్మెలు, ఉద్యమాలు, ధర్నాలు మొదలైనవి చేస్తున్నారు.

మొత్తం తెలంగాణ ప్రజల కోసం ఇలాంటి సమ్మెలు, ధర్నాలు, ఉద్యమాలు చేయడం అంతకన్నా ఎక్కువ అవసరం. అప్పుడే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తెలంగాణ జాతీయ ఉద్యమంగా, శక్తివంతంగా కనపడుతుంది.

తెలంగాణ విద్యావంతుల, ఉద్యోగుల బలహీనతలకు
ప్రజలను బలి చేయకూడదు

ఇలాంటి పనులు తాము చేయాల్సినవి చేయకుండా ఇతరులకు పని చెప్పే పనులు మాత్రం చేస్తున్నారు. కొన్ని సభలు ఏర్పాటు చేస్తున్నారు. ఆ సభలు ఏర్పాటు చేయడమే ఒక జీవిత లక్ష్యం నెరవేరినట్టు మహదానందం పొందడం అల్ప సంతోషులుగా తేల్చివేస్తున్నది.

దీనికి తోడు వేదికపైకి ఎవరు రావాలో, ఎవరు రాకూడదో అనే చర్చలో

ఐక్యంగా కలిసి పనిచేసే దృష్టిని తునాతునకలు చేస్తున్నారు. తమ వర్గం తమ ఆశ్రితులు ఆధిపత్యంలో ఉండడానికి సభలను సాధనాలుగా మార్చుకుంటున్నారు తప్ప సామాజిక ఉద్యమంగా అందరూ కలిసి పనిచేసే లక్ష్యం లోపిస్తున్నది.

ఇటీవల ఒక కొత్త ధోరణి కనపడుతున్నది. 1969 నాటి తెలంగాణ ఉద్యమంలా తిరిగి ఉద్యమం సాగాలని ఆంధ్రా గో బ్యాక్ మొదలైన మిలిటెంట్ ఉద్యమం ప్రారంభించాలని ఉపన్యాసాలిస్తున్నారు. అనగా 1969లో 370 మంది చనిపోయినట్లుగా ఇప్పుడు ప్రజలు ఉద్యమాల్లో చనిపోవాలని అలా ఉద్యమాలు శాంతిభద్రతల సమస్యగా మార్చాలని కోరుతున్నారు. ఇలా కోరేవాళ్లు వాళ్ల ఉద్యోగ సంఘాల్లో, తమ సంస్థల్లో తమ సభ్యులను అందరికన్నా ముందుకు కదిలే వారిగా స్ఫూర్తి నివ్వాలి. కార్యక్రమాలు తీసుకోవాలి. త్యాగాలు చేయాలి. కాని ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు.

ఇలా రెచ్చగొడుతున్నవాళ్ళు తమ ఉద్యోగాలు మాత్రం భద్రంగా చేసుకుంటూ చక్కగా జీవిస్తున్నారు. వీళ్ళు కనీసం తమ ఉద్యోగ సంఘాలను తమ సోదరులను ఆర్గనైజ్ చేసి తెలంగాణ సాధన కోసం సమ్మె చేయాలని ఒప్పించలేని అశక్తులు, అసమర్థులు. ఈ అసమర్థ నాయకత్వం తాము తమ కర్తవ్యాలు, కార్యక్రమాలు చేయకుండా ప్రజలను మాత్రం రెచ్చగొట్టడం సరియైనది కాదు.

మూడు లక్షల ఉద్యోగాల కోసం యువతను కదిలించాలి.
వారిపై అదుపు ఉంచాలి

నిరుద్యోగ యువత అసంతృప్తితో మిలిటెంట్ పోరాటాల్లోకే మళ్లడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఆ తరువాత పరిణామాలు ఎలా ఉంటాయో 35 ఏళ్ళుగా తెలంగాణ ఉద్యమాల అనుభవాలు ఉన్నప్పటికీ మర్చిపోతున్నారు.

తెలంగాణ విద్యావంతులు, మేధావులు, కళాకారులు, రచయితలు, ప్రజలను రెచ్చగొట్టడం మాని తాము చేయాల్సిన కర్తవ్యాలు చేయాలి.

ఉట్టికి ఎగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్టు
చేతగాని వాళ్ళే మందికి తుపాకులు పట్టుకొమ్మని సూచిస్తారు

తాము తమ ఉద్యోగాల్లో తెలంగాణ కోసం మాస్ లీవ్ పెట్టకుండా, సమ్మెలు చేయకుండా, ఉద్యోగాలకు రాజీనామా చేయకుండా, తమ సంపదను ప్రజలకు అంకితం చేయకుండా, మీటింగ్‌లకు మాత్రం జనాన్ని సమీకరించి ఇటీవల

కొందరు తెలంగాణా రాష్ట్ర సాధన వేదికలపై తుపాకులు పట్టి పోరాటం చేసే దృశ్యాలు ప్రదర్శిస్తున్నారు. వాళ్ళు ముందు ఉద్యోగాలు వదిలేయాలి. ఉద్యమం కోసం పని చేయాలి. అప్పుడు ఇతరులకు ఉద్యమించమని కోరవచ్చు. తాము తుపాకులు పట్టకుండా ప్రజలను తుపాకులు పట్టాలని చెప్పడం చేతగాని పిరికి వాళ్ళ లక్షణం.

శాంతియుత పద్ధతులే ప్రభుత్వాలను ఎక్కువ ఇరుకున పెడతాయి.

అసలు విషయం ఏమంటే శాంతియుత పద్దతుల్లో ప్రభుత్వాలు దిగివస్తాయి. శాంతియుత పద్ధతులే ప్రభుత్వాలను ఎక్కువ ఇరుకున పెడతాయి. శాంతి భద్రతల సమస్యగా మారితే బాగుండు. ఫోర్సును పంపి అణచివేయవచ్చు అని ప్రభుత్వాలు భావిస్తాయి. అందుకని ప్రభుత్వమే ఆయా ఉద్యమాల్లో అరాచక వాదులను, సంఘ విద్రోహ శక్తులను, సివిల్ డ్రస్ పోలీసులను పంపించి శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తాయి. అలా సమస్యను సృష్టించాలని, సృష్టించి మొత్తం అందరిని అణచి వేయాలని కౌటిల్యుని అర్ధశాస్త్రం శతాబ్దాల క్రితమే రాజులకు సూచించింది.

శాంతియుత పద్ధతుల్లోనే ఉద్యోగులు అన్ని సాధించుకుంటున్నారు

ఉద్యోగులు తమ డిమాండ్లను అలాగే సాధించుకుంటున్నారు. ముందు శాంతియుత పద్ధతులన్నీ ఉపయోగించాలి. అన్నీ నిర్వీర్యమైన తరువాత మిలిటెంట్ పోరాటాల గురించి ఆలోచించవచ్చు. అందుకని ఉద్యోగులపై, కార్మికులపై, ఉపాధ్యాయులపై తెలంగాణ రాష్ట్ర ఉద్యమం పట్ల గురుతరమైన బాధ్యత ఉంది. సమాజానికి వారే మార్గదర్శకులుగా ముందు నడవాలి.

అలా తెలంగాణ రాష్ట్రం కోసం అన్ని రంగాల్లోని తెలంగాణ ఉద్యోగులు కనీసం ఒక నెల రోజుల పాటు నిరవధిక సమ్మె చేయడం అవసరం. తద్వారా సంఘటిత శక్తిగా తెలంగాణ విద్యావంతులు, ఉద్యోగులు, ఆర్‌టిసి, ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు తమ శక్తి సామర్థ్యాలను ఆకాంక్షలను ప్రదర్శించి ప్రజలకు ముందు నడవాలి. మార్గదర్శనం చేయాలి.

ఈ పనులు, ఇలాంటి ఉద్యమాలు ముందు జరగాలి. అవేవీ జరగకుండా తుపాకులు పట్టి పోరాటం చేయాలని సూచించే బ్యానర్లు, నినాదాలు, ప్రసంగాలు చేయడం సరియైనది కాదు.

మాట కళాకారులకు, పాట కళాకారులకు,
ఉద్యోగులకు, జర్నలిస్టులకు, సామాజిక ఉద్యమ కారులకు విజ్ఞప్తి

దయచేసి యువతరాన్ని రెచ్చగొట్టకండి.

తెలంగాణలో జరుగుతున్న నష్టం ఇప్పటికే ఎక్కువ.

తాము కడప దాటకుండా రోడ్లమీద ఊరేగింపులైనా తీయకుండా సమ్మె అయినా చేయకుండా ఇతరులకు 1969 నాటి వలె పోరాటాలు చేయాలని, తుపాకులు పట్టాలని సందేశాలను ఇవ్వడం 'తెలంగాణ దేశ భక్తి' అనిపించుకోదు అని మనవి.

శాంతియుత ఉద్యమాలు ఇంకా ఎన్నో చేయాల్సి వున్నవి.

వాటికి శక్తి యుక్తులను, సామర్థ్యాలను సాధించుకున్నప్పుడే సామాజిక ఉద్యమ కారులు నాయకులుగా ఎదుగుతారు.

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి ప్రజల్ని తమ వెంట నడిపిస్తారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా

ఫ్రంట్ ఏర్పడాలి

తెలంగాణ రాష్ట్రం వాయిదా వేయడం ఉద్యమాన్ని బలహీన పరచడం కోసమే

తెలంగాణ రాష్ట్రం ఇప్పుడే ఏర్పడుతున్నది అనుకొంటూనే ఏళ్ళు గడుస్తున్నాయి. ఎన్ని రోజులు వీలయితే అన్ని రోజులు వాయిదా వేయడమే అవతలి వారి లక్ష్యంగా కనిపిస్తున్నది. ఉద్యమాన్ని బలహీనపరచడం కోసం వాయిదా వేయడమే సరియైన మార్గమని వారి భావన.

కాంగ్రెస్ ఏ సమస్యను పరిష్కరించదు

కాంగ్రెస్ వాళ్ళు ఏ సమస్యను పరిష్కరించరు. వాయిదా వేయడమే వారికొచ్చిన పరిష్కారం. పంజాబ్ సమస్య, కాశ్మీర్ సమస్య, బాబరీ మసీదు సమస్య, చిన్న రాష్ట్రాల ఏర్పాటు సమస్య, పేదరికం నిర్మూలన సమస్య, అందరికీ ఉచిత విద్య సమస్య, ఇలా ఏ సమస్య తీసుకున్నా దేన్నీ పరిష్కరించింది లేదు. వాయిదా వేయడమే వారి విధానం.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిపాలన ఎలా చేయాలో తెలియని వాళ్ళు అధికారానికి రావడం వల్ల ఇలా జరుగుతున్నది. కాగల కార్యం గంధర్వులు తీరుస్తారు అని భావిస్తూ కాలయాపన చేస్తుంటారు. తమ స్వార్థాలను, తమ వర్గ ప్రయోజనాలను మాత్రం నెరవేర్చుకుంటూ ముందుకు నడుస్తారు.

కాలయాపన వల్లనే మిలిటెంట్ ఉద్యమాలు

ఈ కాలయాపన విధానం వల్ల ఉద్యమాలు మిలిటెంట్, సాయుధ ఉద్యమాలుగా పరివర్తన చెంది శాంతియుతంగా ఉద్యమాలు చేసే వారి నాయకత్వం నుంచి జారిపోతాయి. తద్వారా ఉద్యమాన్ని అణచివేయడం సులువు.

అయితే అందుకు ప్రభుత్వం కూడా ఫీజు చెల్లించక తప్పడం లేదు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ కూడా ఆ ఫీజు చెల్లించడంలో భాగంగా బలై పోయారు. డబ్బు రూపేణా శాంతిభద్రతల రక్షణ కోసం ఫీజుగా వేలకోట్ల రూపాయలు చెల్లించక తప్పలేదు. అది ప్రజల సొమ్ము. అలా ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా చూసుకోవడం కూడా ప్రజాస్వామిక వాదుల, ప్రజస్వామ్య ఉద్యమ కారుల కర్తవ్యం.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి మాట తప్పితే ఎలా?

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి కూడా మాట తప్పితే ఎలా? తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రిమండలి, రాష్ట్రపతి ప్రసంగంలో ప్రకటించి మూడేళ్ళు గడిచింది. కాంగ్రెస్ ఇందుకు ప్రారంభించిన చర్యలేమీ లేవు.

ఉద్యమం చేస్తే వేడి మీద నిర్ణయాలు చేయద్దంటారు ఉద్యమం ఆగితే ఉద్యమమే లేదు కదా అంటారు. ఇదొక వితండవాదం

సమస్య పరిష్కారాన్ని వాయిదా వేస్తూ ఉంటే ఉద్యమకారుల శక్తి, ప్రజల శక్తి క్రమక్రమంగా నీరసించిపోతుంది. ఆర్థికవనరులు సన్నగిల్లుతాయి. ఎవరి పనిమీద వాళ్ళు పడిపోతారు. అపుడు ఉద్యమం సన్నగిల్లింది ఇప్పుడెందుకు రాష్ట్రం అంటారు. ఉద్యమం నడుస్తూఉంటే అవేశంలో ఉన్నారు ఇపుడు నిర్ణయాలు తీసుకోకూడదు అని అంటారు. అందుకని ఎట్ల జరిగేది ఉంటే అట్ల జరగనీ అని పి.వి. నరసింహారావు ఏ నిర్ణయం తీసుకోకపోవడం కూడా ఒక నిర్ణయమే అని సూత్రీకరణే చేసి పదేశారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం సామాజిక ఉద్యమ కారుల చేతుల్లో నుండి రాజకీయ పార్టీల చేతుల్లోకి ఎలా వెళ్ళింది?

1996లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తిరిగి ఉధృతంగా మొదలైంది. రాష్ట్రం లోని మేధావులు, విద్యార్థులు, విద్యావంతులు, కళాకారులు లక్షలాదిగా ముందుకు కదిలారు. విప్లవ సంస్థలుకూడా ముందుకు కదలాయి. ఇలా తెలంగాణ రాష్ట్ర సాధన గురించి అందరు ఒక్కటిగా మొదటిసారిగా మళ్ళీ కలిసి ముందుకు సాగారు.

కోస్తా వలస వాదుల నాయకత్వం ఏం చేసింది?

టిడిపి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దీన్ని

సహించలేకపోయింది. నిర్బంధంతో విరుచుకు పడింది. సామాజిక శక్తులను, వర్గాలను చీల్చడం ప్రారంభించింది. ప్రజల ఉద్యమ శక్తిని ప్రక్కదారి పట్టించడానికి మరికొన్ని సమాంతర ఉద్యమాలను ప్రోత్సహించింది. మాదిగ దండోర, ఎ, బి, సి, డి వర్గీకరణ ఉద్యమం ఏ పరిష్కారం లేకుండా సాగదీస్తూ నిరంతరం కొనసాగడం అందులో ఒకటి.

ఇలాంటి ఉద్యమాల్లో ఎందరో పాల్గొన్నారు. గద్దర్ ప్రజాస్వామ్య ఉద్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రం సాధించాలని 1996 నుండి ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న బెల్లి లలితను చంపేశారు. ఈ క్రమంలో 1997లో గద్దర్ మీద దాడి జరిగింది. ఆరు తూటాలు శరీరంలోకి దూసుకు పోయాయి. సకాలంలో వైద్యం అందడం వల్ల బతికిపోయారు. ఇంకా ఒక తూటా శరీరంలోనే ఉండిపోయింది. రాష్ట్రం వెలుపల ఢిల్లీలో రెండేళ్ళు విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది.

తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేసిన చంద్రబాబు నాయుడు

చంద్రబాబు నాయుడు తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజా ఉద్యమాలను తీవ్రంగా అణచివేతకు గురి చేశారు. అధికారం కోల్పోయి చావుతప్పి కన్నులొట్టబోయి బతికారు. అధికారం పోగానే తెలంగాణ ప్రజల మీద ఎక్కడ లేని ప్రేమ ఒలక బోస్తున్నారు. ఉద్యమాలంటు ప్రజలను సమీకరిస్తున్నారు. టిడిపిని నమ్మితే ఏం జరుగుతుందో గత పాలనే సాక్ష్యం. తెలంగాణ ఉద్యమాన్ని, ప్రజా ఉద్యమాలను కోస్తా ప్రాంత దోపిడీ దారులకు, ఉద్యోగులకు అనువుగా అణచి వేస్తారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వున్నప్పుడు తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయడానికి చేసే ప్రయత్నాలను తిప్పి కొట్టడానికి సామాజిక శక్తులు క్రమక్రమంగా రాజకీయ రూపం సంతరించుకోవాలని భావించాయి.

ఎన్నో చర్చలు జరిగాయి. ఎన్నో ప్రయోగాలు జరిగాయి. అవి చరిత్రగా మిగిలిపోయాయి. మారోజు వీరన్న సాయుధ పోరాటం పంథా తీసుకోకపోయి వుంటే తెలంగాణ ఉద్యమం సామాజిక శక్తుల నాయకత్వంలోనే కొనసాగి ఉండేవి. అలా జరగలేదు. ఫలితంగా కేవలం రాజకీయాలే వృత్తిగా గల రాజకీయ నాయకుల రంగ ప్రవేశం జరిగింది. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడింది. మాస్ ఉద్యమం టిఆర్ఎస్ పార్టీ చూసుకొంటున్నది కదా అని అందరిలాగే గద్దర్‌తో సహా నాలాంటి వాళ్ళు కూడా భావించారు.

రాజకీయ వృత్తిదారుల చేతుల్లోకి వెళ్లిపోయిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం

2004 ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలిచిన తర్వాత అదిగో ఇదిగో తెలంగాణ అన్నారు. ఢిల్లీలో ఉండి పత్రికా ప్రకటనలకు పరిమితమయ్యారు. ఉద్యమాలను వదిలివేశారు. అప్పుడు ఎక్కడికక్కడ రచయితలు, కళాకారులు, విద్యావంతులు, జర్నలిస్టులు, తెలంగాణ ఉద్యమాలు ప్రారంభించారు. నిప్పారిపోకుండా ఉద్యమాలను నిరంతరం ఏదో ఒక స్థాయిలో ముందుకు తీసుకుపోతూనే ఉన్నారు. తెలంగాణ ఉద్యమం ఇంత సుదీర్ఘ కాలం కొనసాగడానికి వీరి కృషే ప్రధాన కారణం.

కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికకు ముందు దాకా తెలంగాణ ఉద్యమాన్ని నడిపింది సాంస్కృతి యోధులే

2004లో ఉద్యమ పార్టీ అనుకొని గెలిపించిన టిఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయ నాయకులుగా తమ అసలు స్వరూపాన్ని ప్రదర్శించడం ప్రారంభించారు. ఉద్యమాలు అటకెక్కాయి. ఢిల్లీలో కూర్చుని నిదరపోయారు. కార్యక్రమాలు స్తంభించాయి. ఉద్యమ పార్టీగా టిఆర్ఎస్ తన స్వభావాన్ని కోల్పోయింది. ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ప్రబలింది. ఈ కాలంలో తెలంగాణ ఉద్యమానికి జవసత్వాలను అందించి ప్రజలను సమీకరించి, ఉత్తేజితులను చేసింది తెలంగాణ సాంస్కృతిక యోధులే. గూడ అంజయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, సంతోష్, మోహన్, వరంగల్ శ్రీను, కొడాలి శ్రీను, గర్జన, దయా నర్సింగ్, ఏపూరి సోమన్న, ఏటా రవి, అంతడపుల నాగరాజు, బాలకిషన్, దేశపతి, దరువు ఎల్లన్న, అంజన్న, స్నేహ, విమల, చైతన్య, విజయ మొదలైన వందలాది కళాకారులు, పాట కవులు తెలంగాణ ఉద్యమాన్ని సజీవంగా నిలిపారు. ముందుకు నడిపారు.

ప్రజా యుద్ధ నౌక గద్దర్ తిరిగి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రవేశం

ప్రజా యుద్ధ నౌక, మహాకవి గద్దర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పని చేయాలని 2006లో మళ్ళీ ముందుకు వచ్చారు. సాంస్కృతిక ఉద్యమం ముందుకు సాగింది. తెలంగాణ ధూంధాం కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజలను చకితులను చేసింది. తెలంగాణ ధూంధాం తక్కువ సమయంలో విస్తృత ప్రచారంలోకి వచ్చింది. వందలాది కళాకారుల కృషి ఫలించి తెలంగాణ ఉద్యమం తిరిగి ప్రజా ఉద్యమంగా, మాస్ ఉద్యమంగా ముందుకు వచ్చింది. మీడియా కూడా ఇందుకు సహకారాన్ని అందించింది.

మాట తప్పిన తెలంగాణ ధూంధాం

తెలంగాణ కళాకారుల వేదిక కార్యక్రమాలు ప్రారంభించినపుడు గూడ అంజయ్యకు బి.ఎస్.రాములు అనేక సూచనలు చేశారు. పాటకవుల వేదిక అనే దృక్పథం కూడా బి.ఎస్.రాములే అందించారు. ఏ రాజకీయ పార్టీకి కళాకారుల వేదిక జై కొట్టకూడదు, అనుబంధంగా ఉండకూడదు. తెలంగాణకు మద్దతిచ్చే అన్నిపార్టీలు, మనవే. అయినప్పటికీ తెలంగాణ కళాకారుల వేదికపై రాజకీయ నాయకులు ఎవరూ ఉండకూడదు. ఒకవేళ అనివార్యమయితే రాజకీయ నాయకులను వేదికనుండి దండంపెట్టి దిగిపోవడానికి అంగీకరించవచ్చు అన్నారు. తొలుత అలాగే జరిగింది. తొలుత కామారెడ్డిలో, ఖమ్మం, కొత్తగూడెంలో కళాకారుల వేదిక తరపున జయరాజ్ నాయకత్వంలో కళాకారులతోనే సభలు జరిగాయి.

తెలంగాణ ధూంధాం

హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని లలిత కళాతోరణంలో పెద్ద ఎత్తున జరిగిన సభలతో తెలంగాణ కళాకారుల వేదిక 'తెలంగాణ ధూం ధాం'గా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రజాయుద్ధ నౌక గద్దర్, మహాకవి గూడ అంజయ్య, జయరాజ్, మహాకవి అందెశ్రీ, మహాకవి గోరటి వెంకన్న మొదలైన వారు తెలంగాణ ధూంధాం వేదికపై కనిపించడం ద్వారా ఆ వేదికకు గొప్ప సామాజిక సాంస్కృతిక గౌరవ ప్రతిపత్తి కలిగింది. దాన్ని అలాగే పార్టీలకతీతంగా కాపాడుకుంటూ రావాలని గద్దర్, గూడ అంజయ్య, గోరటి వెంకన్న, పాశం యాదగిరి తదితరులు అనేక జాగ్రత్తలు చెప్పడం జరిగింది. కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికదాకా అలాగే సాగింది. రసమయి బాలకిషన్ ధూంధాం నిర్వహణకు విశేషంగా కృషి చేశారు. గొప్ప కళాకారుడిగా తక్కువ కాలంలో గుర్తింపు తెచ్చుకున్నారు.

కరీంనగర్ విజయం ప్రజలదే - తెలంగాణ కళాకారులదే

కరీంనగర్ లోక్‌సభ ఉప ఎన్నికలో తెలంగాణ ధూంధాం పేరు మారుమ్రోగిపోయింది. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల ధూంధాం మీటింగులతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. రాజకీయ చైతన్యం తిరిగి రాజుకుంది. గద్దర్, గూడ అంజయ్య, జయరాజ్, గోరటి వెంకన్న, అందెశ్రీ, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, అంతడుపుల నాగరాజు, వరంగల్ శీను, నేర్నాల కిశోర్, సంతోష్, బైరాగి, విజయ, స్నేహ, అమ్ములు మొదలైన కళాకారులు, వారి బృందాలు తెలంగాణ ఉద్యమ చైతన్యాన్ని రగిలించడంలో చరిత్ర నిర్మించారు.

తెలంగాణ రచయితలు, విద్యావంతులు, జర్నలిస్టులు కూడా ధూంధాం వేదిక నుండి మౌన సందేశాలను అందించారు. ప్రజలకు సంకేతాలు అందాయి. గెలిచిన తర్వాత నియోజకవర్గం మొఖం చూడని మనిషిని మళ్ళీ గెలిపించాల్సి వచ్చింది కదా అని ప్రజలు బాధ పడ్డారు. కానీ ఈ రచయితల, కళాకారుల, జర్నలిస్టుల నిజాయితీ చూసి ప్రజాయుద్ధనౌక గద్దర్ కూడా తెలంగాణ వాదాన్ని గెలిపించండని పిలుపునివ్వడం చూసి ఒక జాతీయోద్యమంగా ప్రజలందరూ కదిలారు. ఓట్లు వేశారు. గెలిపించారు. ఇది టిఆర్ఎస్ తన బలం అనుకొని భ్రమపడింది. అంతా తన చేతుల్లోనే ఉందని భావించారు. ఇది ప్రజల ఆకాంక్షకు చిహ్నమని వారికి తన చర్మంతో చెప్పులు కుట్టి ఇచ్చినా ఈ ఋణం తీర్చుకోలేనిదని కెసిఆర్ అన్నారు. అన్నప్పటికీ తనదే గొప్ప అనే భావం ఆయనలో పెంచుకున్నారు.

కెసిఆర్ కొన్ని విషయాల్లో ఎంత సమర్థుడో మరికొన్ని విషయాల్లో అంత అసమర్థుడని, అంతటి అసమర్థుడు ఏ పార్టీలో నాయకుడుగా లేడని అతని సన్నిహితులు, అతని వ్యతిరేకులు అంటుంటారు. కేసిఆర్ సామర్థ్యం ఏమిటో ఇంతకుముందటి పుస్తకాల్లో వివరించాను.

కేసిఆర్ అసమర్థత గురించి ఎన్నో కథలు చెపుతూ వాటితో పాటు పది మంది ఎమ్మెల్యేలు పార్టీని వదిలిపోవడం కేసిఆర్ అసమర్థతకు ప్రబల నిదర్శనం అని వాదిస్తారు. తల్లి కోడిలా తన ఎమ్మెల్యేలను తన రెక్కల కింద ప్రేమపూరితంగా కాపాడుకోవాలని ఆ శక్తి సామర్థ్యాలు, ప్రేమ, ఆత్మీయత కేసిఆర్‌లో లేకపోవడం వల్లే వాళ్ళు వదిలి వెళ్ళారని వారి అభిప్రాయం. వారిని తిరిగి పార్టీలోకి రప్పించుకునే నైపుణ్యం కూడా కెసిఆర్‌కు లేకపోయిందని విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. కాంగ్రెస్ నుండి ఎందరో చీలిపోతుంటారు. మళ్ళీ చేరుతుంటారు. టిఆర్ఎస్‌లో చీలిపోవడం తప్ప వాళ్ళు తిరిగి చేరడమనేది జరగడం లేదు. ఇలా 26 మందిలో 10 మంది చీలిపోయారు. 16 మందే ఇపుడు టిఆర్ఎస్ వెంట, కెసిఆర్ వెంట ఉన్నారు. వీళ్ళు కూడా నిర్మాణపరంగా కలిసి ఉంటున్నారు తప్ప హృదయపూర్వకంగా కలిసి ఉంటున్నవాళ్ళు సగానికన్నా తక్కువే. ఇదంతా కెసిఆర్ పనివిధానం వల్ల జరిగిందని, కేసిఆర్ సమర్థతకు, అసమర్థతకు కూడా ఆయన పని విధానమే కారణమని వారి అభిప్రాయం.

ఉద్యమాన్ని మలుపు తిప్పిన గద్దర్ శాంతియాత్ర

గద్దర్ గత 12 ఏళ్ళ తెలంగాణ సాంస్కృతిక, సామాజిక రాజకీయ

ఉద్యమాలన్నింటిని సమీక్షించి తన అనుభవాలను కూడా జతచేసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నడుం బిగించారు. శాంతియాత్రను చేపట్టారు. అయితే తెలంగాణ ధూం ధాం పేరిట రసమయి బాలకిషన్ దాన్ని స్వతంత్రంగా ఉండనీయకుండా టిఆర్ఎస్ ప్రచార వేదికగా మార్చారు. గద్దర్ అందుకు బాధపడ్డారు. ఎన్నో చర్చలు జరిగాయి. తనకు కళాకారుడిగా జన్మనిచ్చింది, ప్రోత్సహించింది కెసిఆర్ యే కనుక ఆయనతోనే ఉంటానని కెసిఆర్‌కు ధూం ధాంను అనుబంధ సంస్థగా మార్చివేశాడు రసమయి బాలకిషన్.

తెలంగాణ ఆట-పాట ఆవిర్భావం

ఇలా ఒక వ్యవస్థను అందరూ కలిసి నిర్మించాక దాన్ని కొందరు హైజాక్ చేసుకొని తీసుకుపోవడం కొత్త కాదు. తెలంగాణ ధూంధాం అందరి సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందాక దానికి తమ ప్రతిష్టను, కలాన్ని, గలాన్ని జత చేసిన, సీనియర్ కళాకారుల్ని పొమ్మనలేక పొగబెట్టి దూరం కొట్టి టిఆర్ఎస్‌కు వేదికగా మార్చే కేసిఆర్ వ్యూహ రచనలో భాగంగా తెలంగాణ ధూంధాంను రసమయి బాలకిషన్ తన సొంత వేదిక అని స్పష్టం చేశారు. వస్తే రండి లేకపోతే లేదు. మీకు ఒక పాటకు మాత్రమే అవకాశం ఉంటుంది. మొత్తం ఐదు గంటల మీటింగ్‌ను నేనే నా ఇష్టం ప్రకారం నడిపించుకుంటాను. పాడుమన్నప్పుడు పాడాలి. ఇలా బాలకిషన్ ఒరవడి సాగింది. అనేక మంది కళాకారులు ఒక్క పాటకైనా అవకాశం ఇవ్వకపోవడంతో అలిగారు. భౌతిక దాడులు చేయాలనే దశ దాకా పోయింది. ఇలా వందలాది కళాకారులను అవమానించడం జరిగింది. ధూంధాం కార్యక్రమాలను కేటరింగ్ కాంట్రాక్టులాగా, ప్యాకేజిలాగా ఒక ప్యాకేజి మాట్లాడుకొని ఎవరిని పిలవాలో ఎవరిని పిలవకుండా, సమాచారం లేకుండా చేయాలో బాలకిషన్ నిర్ణయించుకున్నారు. చివరకు మహాకవులు, మహాకళాకారులు కూడా సర్కస్‌లో ప్రదర్శనకు... లాగా మార్చిన ఘనత బాలకిషన్‌దే. ఇదంతా టిఆర్ఎస్‌కు అనుబంధంగా మార్చడం కోసం ప్రణాళికా బద్ధంగా చేసిందే. చేసింది బాలకిషన్ చేయించింది కేసిఆర్ అని అందరూ భావించారు.

దాంతో కళాకారులందరినీ తిరిగి ఒక్కటి చేయాలని వారికి అవకాశాలు కల్పించాలని, అందరినీ పార్టీలకతీతంగా కలుపుకుపోయే సంస్థగా 'తెలంగాణ ఆట - పాట' పేరుతో తెలంగాణ కళాకారులను మళ్ళీ కూడగట్టారు గద్దర్. నిజానికి గద్దర్‌ది ఆర్గనైజర్‌గా పని చేసే వయస్సు కాదు. అయినా తప్పలేదు. దప్పు రమేష్, పాశం యాదగిరి, గూడ అంజయ్య, జయరాజ్, బాబ్జీ, గర్జన,

దయా నర్సింగ్, ప్రహ్లాద్, మోహన్, ఏపూరి సోమన్న, ఏట రవి, సంతోష్, అమ్ములు, మధు ప్రియ, నేర్నాల కిషోర్, రమ, వరంగల్ శ్రీను మొదలైన వారి సహకారంతో గద్దర్ 'తెలంగాణ ఆట-పాట'ను తెలంగాణ కళాకారుల ఐక్య వేదికగా తీర్చిదిద్దారు. తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల ఐక్య వేదిక, తెలంగాణ ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ సంఘర్ష సమితి, తెలంగాణ జనపరిషత్ మొదలైన సంస్థలతో కలిసి గద్దర్ అనేక కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు.

గద్దర్ తెలంగాణ ఉద్యమం ఎలా ఉండాలో, ఎలా నడపాలో అని అనేక బృందాలతో, పార్టీలతో, మేధావులతో, కళాకారులతో, నాయకులతో చర్చలు జరిపారు. దేశంలోని అనేక ఉద్యమాల తీరు తెన్నులను, వాటి నాయకత్వాన్ని అవి తీసుకున్న మలుపులను గద్దర్ విస్తృతంగా అధ్యయనం చేశారు. భారత దేశంలోని పార్లమెంటరీ పార్టీల ప్రణాళికలను, నిర్మాణాలను, పని విధానాన్ని ఈ సందర్భంగా సునిశితంగా పరిశీలించారు. ఝార్ఖండ్ రాష్ట్ర ఉద్యమాన్ని, అస్సాం ఉద్యమాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. దేశవ్యాప్తంగా వందలాది మంది మేధావులతో, నాయకులతో ఫోన్ ద్వారా చర్చ జరిపారు. పరస్పర సంభాషణలు జరిపారు. వీటన్నింటి పర్యవసానంగా గద్దర్ కొన్ని నిర్ణయాలకు వచ్చారు. అదే తెలంగాణ ఐక్య ఫ్రంట్. అస్సాం ఉద్యమమే దీనికి ఆదర్శం.

తెలంగాణ ఐక్య ఫ్రంట్

గద్దర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదించిన పార్టీలన్నీ కలిసి ఒక ఫ్రంటుగా ఏర్పడి ఉద్యమాలు నిర్వహించాలి అని అభిప్రాయపడ్డారు. బిజెపి వేదికమీద ఇతర పార్టీల వేదికల మీద, చిన్నా చితక పార్టీల రాష్ట్ర నాయకుల వేదికలమీద ఇంకా అనేక సభల్లో గద్దర్ గత నాలుగు నెలలుగా ఇదే విషయం అనేక కోణాల్లో నొక్కి చెబుతూ వస్తున్నారు. మొదట అశ్రద్ధ చేసినా క్రమంగా గద్దర్ చెబుతున్న విషయాలు ఎంతో ప్రాధాన్యత గలవని గ్రహించారు.

అలా ఫ్రంటు ఏర్పాటు కోసం అనేక ఇష్టాగోష్టులు, రౌండు టేబుల్ సమావేశాలు జరిగాయి. 12 పార్టీలు, మూడు ప్రజా సంస్థలు కలిసి ఫ్రంటు ఏర్పడినది. దీనికి కేశవరావు జాదవ్, బెల్లయ్య నాయక్ నాయకత్వం వహిస్తున్నారు. గౌరవ సలహాదారుగా గద్దర్ వారి వెంట కలిసి నడుస్తున్నారు. ఈ ఫ్రంటు తక్షణ

కార్యక్రమం గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో నిలబడి గెలవడం. అందుకు గ్రేటర్ హైదరాబాద్ చుట్టూతా ఉన్న గ్రామాలన్నింటినీ శాంతి యాత్ర లాగా కళాకారుల జర్నలిస్టుల, రచయితల బృందంతో పర్యటిస్తూ హమారా హైదరాబాద్ నినాదంతో సభలు, ఊరేగింపులు, రాజకీయ చైతన్య సదస్సులు నిర్వహించే కార్యక్రమాలు తీసుకుంటున్నారు. మురికి వాడలను, మురికివాడ ప్రజలను ముందు సమీకరించడానికి పని మనుషులను కలవడానికి, డ్రైవర్లను కలవడానికి, భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులందరినీ కలవడానికి కార్యక్రమాలు రూపొందించడం జరిగింది.

ఫ్రంటులో చేరకపోవడం ద్వారా టిఆర్ఎస్, బిజెపి ఉద్యమ స్వభావం వదిలేసి కేవలం రాజకీయ పార్టీలుగా మారిపోయాయని తమకుతామే నిరూపించుకున్నారు

ఈ ఫ్రంటులో టిఆర్ఎస్, బిజెపి చేరాలని కోరడం జరిగింది. వాళ్ళు తమ పార్టీ నిర్మాణంలో భాగంగా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామని, అందరినీ కలుపుకొని ఉద్యమాన్ని నిర్మిస్తే తమ పార్టీ నిర్మాణం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

తెలంగాణ ఏకైక లక్ష్యంగా ముందుకు రావాలని కోరితే వాళ్ళు పార్టీ లక్ష్యంగా పార్టీకి తెలంగాణ ఉద్యమం ఒక సాధనంగా భావించారు. గద్దర్‌తో సహా మా వంటి రచయితలు, మేధావులు, కళాకారులు వాళ్ల మాటలతో ఆశ్చర్యపోయారు. వారికి తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల ఉన్న చిత్తశుద్ధి పట్ల వారికి ఉన్న పరిమితి ఏమిటో తెలిసి వచ్చి వాళ్ళతో ఏ మేరకు కలిసి పని చేయాలో కూడా తేల్చుకున్నారు.

అలా టిఆర్ఎస్, బిజెపి వేదికల ద్వారా ప్రజలను తెలంగాణా ఉద్యమాన్ని ప్రచారం చేయడానికి పరిమితులు విధించుకున్నారు. స్వతంత్ర ఉద్యమాన్ని నిర్మించడం ద్వారానే వీళ్ళందరినీ ఆ ఉద్యమం వెంట ర్యాలీ చేయడం సాధ్యం అని గద్దర్ అభిప్రాయ పడ్డారు. అలా తెలంగాణ రాష్ట్రం ఏకైక లక్ష్యంగా ఫ్రంటు నిర్మాణం సాగుతున్నది.

గద్దర్ ప్రతిపాదిస్తున్న ఫ్రంటుతో ఆలె నరేంద్ర టిఆర్ఎస్, విజయశాంతి, లాలు ప్రసాద్ యాదవ్ రాష్ట్ర కమిటి పార్టీ, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ, బహుజన కమ్యూనిస్టు పార్టీ మొదలైన పార్టీలన్నీ ఏకీభవిస్తున్నాయి. కలిసి పని

చేస్తున్నాయి. అయితే ఈ పార్టీలు అంత బలమైనవేమీ కావు. సొంత బలాన్ని సమీకరించుకోవలసిన అవసరం ఉంది. అందుకు ఉద్యమాలు నిర్మించాలి. నాయకత్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ఉన్నత లక్ష్యాలు లక్ష్యంగా ఉండాలి.

తెలంగాణ ఏకైక లక్ష్యంగా ఉంటే రాష్ట్రపతి అభ్యర్థిని నిలిపి దేశం దృష్టిని ఆకర్షించే వాళ్ళు

తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ప్రచారంలో భాగంగా తెలంగాణ వాదాన్ని ప్రపంచానికి విస్తృతంగా తెలిపే ఒక గొప్ప అవకాశంగా తీసుకొని గద్దర్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించి నామినేషన్ వేయించాలని తెలంగాణ రాష్ట్ర కళాకారుల, రచయితల ఐక్య వేదిక రాష్ట్రంలోని పార్టీలకు ప్రతిపాదన చేసింది.

ఆ పార్టీలు ఏవీ గద్దర్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడానికి, నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయడానికి సంసిద్ధతను వ్యక్తం చేయలేదు. దేశంలో ఇప్పుడు పోటీ పడుతున్న అభ్యర్థులందరికన్నా సుప్రసిద్ధుడైన గద్దర్ పట్ల వారి ప్రేమ ఏ పాటిదో, తెలంగాణ రాష్ట్ర ఉద్యమం పట్ల, దాని ప్రచారం పట్ల వారికున్న కమిట్‌మెంట్ ఏపాటిదో వాళ్ళు స్పష్టం చేసుకున్నారు.

అలాంటి వారి కోసం అలాంటి వారితో కలిసి ఎందుకు పని చేయాలి? అని ఇవాళ తెలంగాణ రచయితలు, విద్యావంతులు గద్దర్‌ను ప్రశ్నిస్తున్నారు. ఈ ఏక పక్ష సహకారం ఇంకా ఎన్నేళ్ళు సాగిస్తారని అలాంటి ఏకపక్ష సహకారం నిలిపి వేయాలని గద్దర్‌ను తెలంగాణ రచయితలు, కళాకారులు నిలదీస్తున్నారు.

గద్దర్ మానసపుత్రిక అయిన ఫ్రంట్‌లో ఉన్న పన్నెండు పార్టీల నాయకులు కూడా గద్దర్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడానికి ఆయా పార్టీల సుప్రీం నాయకులతో చర్చలు చేసినట్లు లేదు. ఆయా పార్టీలన్నీ ఆ నాయకుల పేర్లు చెప్పుకొని బతికేవే తప్ప ఆ నాయకుల స్థాయికి తాము ఎదగాలని, వారితో సమానంగా చర్చించే స్థాయి సాధించుకోవాలని లక్ష్యం గల నాయకత్వం కాదు.

ఫ్రంట్ బలహీనతలు – సాధించుకోవలసిన సామర్థ్యం

ఇలాంటి తోక పార్టీ నాయకులను పట్టుకొని గద్దర్ నిర్మించే ఫ్రంట్ నిజంగా విజయాలు సాధిస్తుందా? అని పరిశీలకులు సందేహిస్తున్నారు. ఈ సందేహాలకు కాలమే జవాబు చెబుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా ముందుకు సాగే యువతరం నాయకత్వం చిత్తశుద్ధితో, సమర్థవంతమైన నాయకత్వంగా

ఎదిగి ఫ్రంటు నాయకత్వంలో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయినప్పుడు గద్దర్ ఆశించే లక్ష్యం నెరవేరుతుంది. అది జరగక పోతే మరొక ప్రయోగంగా లేదా మరొక ప్రతిపాదనగా చరిత్రలో మిగిలి పోతుంది.

ఫ్రంటు నిర్మాణంలో గద్దర్ ఏ పదవినీ స్వీకరించలేదు. అయినా దానికి పెద్ద దిక్కుగా తన 36 ఏళ్ళ సామాజిక, సాంస్కృతిక ఉద్యమ కృషిని, త్యాగాన్ని దానికి అందిస్తూ దాని వెంట నడవడానికి సిద్ధంగా ఉన్నారు. యువతరం నుండి నాయకత్వం ఎదిగి ఈ ఫ్రంటును నడపాలని గద్దర్ ఉద్దేశం. యువతరం నాయకత్వం ఎదిగించడానికి ఫ్రంటు కృషి చేస్తున్నది.

గద్దర్ ఉద్దేశంలో మూడు రంగాల్లో ఫ్రంట్ అవసరం

గద్దర్ ప్రధానంగా అస్సాం ఉద్యమంలో వలె మూడు రంగాల్లో ఫ్రంట్ అవసరమని వాటి నిర్మాణానికి దారులు వేశారు. ఒకటి రాజకీయ పార్టీల ఫ్రంట్. రెండు కల్చరల్ ఫ్రంట్. మూడు స్టూడెంట్స్ ఫ్రంట్. ఈ మూడు ఫ్రంట్‌ల ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లో మరింత విస్తరింప జేయాలని గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సీట్ల ఒప్పందం కుదుర్చుకొని 150 కార్పొరేటర్లకు పోటీ చేయాలని ఈ ఫ్రంటు లక్ష్యం.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో శక్తి నిరూపించుకోవాలి

ఆరు నెలల్లో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల పోటీలో కలిసి వచ్చే పార్టీలు ఈ ఎన్నికలో పోటీ చేయడం ద్వారా కలిగిన అనుభవాలను బేరీజు వేసుకొని వచ్చే శాసనసభ ఎన్నికల కోసం వ్యూహం, ఎత్తుగడలు, కార్యక్రమాలు రూపొందించుకోవడం జరుగుతుంది.

అయితే ఈ మూడు ఫ్రంటులతో పాటు మరో మూడు ఫ్రంటులు ఏర్పడడం అవసరం. ఒకటి ఆల్ తెలంగాణ ఎంప్లాయిస్ ఫ్రంట్. రెండు ఆల్ తెలంగాణ టీచర్స్ ఫ్రంట్. మూడు అన్ని ఫ్రంటుల సమన్వయ కమిటి.

తెలంగాణ కళాకారులు, తెలంగాణ జర్నలిస్టులు, తెలంగాణ విద్యావంతులు తెలంగాణ ఉద్యమాల నిర్మాణంలో తలమునకలవుతూ సభలూ, సమావేశాలూ, ఊరేగింపులు, పాదయాత్రలు, ఫ్రంటులు మొదలైన అన్నింటా ముందుకు సాగుతూ వుంటే తెలంగాణ రచయితలు, తెలంగాణ వచన కవులు ఎక్కడా చొరవగా ముందుకు సాగుతున్నట్లు కనపడదు. తెరవే నాయకులు కొన్ని పత్రిక ప్రకటనలు

ఇవ్వడానికి పరిమితమయ్యారు.

ఇలా టిఆర్ఎస్ అనుబంధంలో పని చేస్తున్న సంఘాలు ఏవో స్వతంత్రంగా సంఘాలు ఏవో వాటి పని విధానంలో తెలిసిపోతున్నది. గద్దర్ ఫ్రంటుతో కలిసి నడవడానికి సిద్ధంగా లేక పోవడం ద్వారా టిఆర్ఎస్, కెసిఆర్ అనుబంధంగా ఉన్న సంఘాలు ఏవో, ప్రజలందరికోసం కలిసి పని చేస్తున్న సంఘాలు ఏవో తెల్సిపోతున్నాయి.

ముచ్చటగా మూడు పాయలుగా సాగుతున్న తెలంగాణ ఉద్యమం

అందువల్ల తెలంగాణ ఉద్యమం రెండు పాయలుగా కొనసాగుతున్న క్రమం స్పష్టమైన రూపం తీసుకున్నది. ఒకటి గద్దర్ ప్రకటిస్తున్న ఐక్య సంఘటనతో కలిసి పని చేసే సంస్థలు, పార్టీలు, ఉద్యమాలు. రెండు టిఆర్ఎస్ తో అనుబంధంలో ఉంటూ సాగుతున్న సంస్థలు. మూడవ పాయ కూడా ముచ్చటగా బిజెపి ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఇలా మూడు పాయల ఉద్యమాలు సాగుతున్నాయి.

సంపన్నుల సేవలకోసమైనా

పేదలు, పని మనుషులు నగరాల్లో జీవించే అవకాశాలుండాలి

హైదరాబాద్ నగరంలో పని మనుషులుగా సుమారు 6లక్షల మంది మహిళలు పని చేస్తున్నారని ఇటీవల ఒక దినపత్రిక పని మనుషుల స్థితి గతుల గురించి ఆరా తీసింది. కానీ 7లక్షలకు పైగా పని మనుషులు గ్రేటర్ హైదరాబాద్‌లో పని చేస్తున్నారు.

పనిమనిషి కన్న తల్లి వంటిది - ఇంటి ఆడపడుచు వంటిది

ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యక్తి కుటుంబాలు ఏర్పడ్డాక పట్టణానికి ఉపాధి రీత్యా వలస వచ్చిన వారి కుటుంబాల్లో పని మనుషుల అవసరం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. పని మనిషి పూర్వం తల్లిదండ్రులు చేసే పనులను, ఆడపడుచులు, ఇల్లాల్లు చేసే పనులను చేస్తున్నారు. కాని పని మనుషులను తల్లిలా, చెల్లిలా, ఆడపడుచులా, ఇల్లాలుగా కనీసం కూతురులా గౌరవించడం లేదు. ఆ స్థానం ఇవ్వడం లేదు. వారి పిల్లల భవిష్యత్తు తమ బాధ్యత అని మానసిక దత్తత తీసుకోవడం లేదు.

పనిమనుషులు సృష్టిస్తున్న సంపద అదనపు విలువ కొన్ని వేల కోట్లు

వీరిని కేవలం పని మనుషులుగా చూస్తున్నారు. ఈ చూపు మారాలి. తల్లి చేసే పనులను, ఇల్లాలు చేసే పనులను, ఆడపడుచు చేసే పనులను పని మనిషి ఇంటి పనుల రూపంలో నెరవేరుస్తున్నది. వారికి అలాంటి గౌరవం ఇవ్వాలి. వారి పిల్లల భవిష్యత్తుకు తాము హామీగా ఉండాలి. వాళ్ళు సేవ చేయడం ద్వారా మధ్య తరగతికి, సంపన్నులకు ఎంతో విలువైన సమయం మిగులుతున్నది. తద్వారా వారు ఎంతో ఆరోగ్యాన్ని, సంపదను అదనంగా పొందుతున్నారు.

ఇంటిపని ఉత్పత్తిలో భాగమే అని ఫెమినిస్టులు ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రీయంగా నిరూపించి ఉన్నారు. ఇంటి పని అదనపు ఉత్పత్తిలో, అదనపు శ్రమశక్తి విలువ సంపాదించడంలో భాగమవుతున్నది. అందువల్ల పని మనుషులకు వారి యజమానుల జీతాల్లో ఒక భాగం పొందే నైతిక హక్కు ఉంది. ఈ హక్కును చట్టబద్ధ హక్కుగా మార్చడం అవసరం. ఫెమినిస్టులు ఇందుకు పూనుకోవడం వారి కనీస బాధ్యత.

పనిమనుషులు యజమానులకు మిగుల్చుతున్న 800 కాలరీలు

కాలరీల రీత్యా చూస్తే పని మనుషులు తమ సేవ ద్వారా ఇంటి ఇల్లాలుకు లేదా కుటుంబ సభ్యులకు సుమారు 800 కాలరీల శక్తిని మిగుల్చుతున్నారు. పనిమనిషి ఒక ఇంటిలో వారికి పనిమనిషిగా పని చేయడం ద్వారా 800 కాలరీల శక్తిని తన సేవ రూపంలో ఖర్చు చేస్తున్నది. తద్వారా సరైన ఆహారం లేక 70 ఏళ్ళు బతకాల్సిన ఆయుష్షు తగ్గి 45 - 50 మధ్య వృద్ధాప్యం మీద పడి పని చేయలేని దశలో కూరుకుపోతున్నారు. చనిపోతున్నారు. రోగాల పాలవుతున్నారు. తమ పిల్లలను ఎదిగించుకోవడంలో అశక్తులు అవుతున్నారు.

పనిమనుషులు చేసే పని విలువ ఎంత?

ఒక లెక్చరర్, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన ఇంట్లో తన పనులు చేసుకుంటే ఆ పని విలువ నెలకు కనీసం రెండువేల రూపాయలు ఉంటుంది. అమెరికాలో ఇదే నిష్పత్తితో పని మనుషులకు కూలీలు, జీతాలు ఉంటాయి. అందువల్ల వాళ్లు పనిమనుషులను పెట్టుకుంటే పొదుపు సాధ్యం కాదని స్వయంగా పని చేసుకుంటారు. అందుకు కొన్ని మిషన్లను కూడా కొనుక్కుంటారు. ఇండియాలో మనుషుల జనాభా హెచ్చు. పనిమనుషులు ఎంతో మంది కరువు వల్ల, పేదరికం వల్ల, ఉపాధి లేక పోవడం వల్ల అందుబాటులో ఉన్నారు. వీరికి సరియైన జీవన ప్రమాణాలు అందుకునే విధంగా కూలీలు ఇవ్వాలి. ఇప్పించాలి. అందుకు అందరి సహకారం అవసరం.

పని మనిషి రోజుకు నాలుగిళ్ల కన్నా ఎక్కువ చేయలేదు

ఒక పనిమనిషి రోజుకు నాలుగు ఇళ్ళకన్నా ఎక్కువ పని చేయలేదు. రోజుకు రెండు సార్లు ఇళ్ళల్లో పని చేయాల్సి ఉంటుంది. కొందరి ఇళ్ళు పెద్దవై, వాటి అలంకరణ పరిశుభ్రత, గార్డెనింగ్ ఎక్కువై ఒక్కొక్క ఇంట్లో ఒక్కరు కూడా

చాలక ఇద్దరిని పని మనుషులుగా పెట్టుకుంటారు. ఇలా ఒక పనిమనిషి సగటున నలుగురు ఇళ్ళల్లో మాత్రమే పనిచేయడం సాధ్యం. ఇవాళ సింగిల్ బెడ్‌రూంతో జీవిస్తున్న వాళ్ళు కూడా పని మనిషిమీద ఆధారపడక తప్పడం లేదు.

పనిమనుషులకు ఆర్టీసీ, బీడీ కార్మికుల్లా పిఎఫ్‌తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలి. వారి పిల్లలకు స్కాలర్‌షిప్పులు ఇవ్వాలి

ఇలా హైదరాబాద్‌లో సుమారు 7 లక్షల మంది పని మనుషులు ఇళ్ళల్లో పని చేస్తున్నారు. వీరిని కార్మికులుగా గుర్తించాలి. పని మనుషులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ కార్మికులకు, బీడీ కార్మికులకు వర్తించే సౌకర్యాలు, హక్కులు అన్నీ పనిమనుషులకు వర్తింప చేయాలి. ఇ.ఎస్.ఐ. ఆసుపత్రుల్లో వీరి కుటుంబాలకు ఉచిత వైద్యం అందించాలి. వీరి పిల్లల చదువులకు ఉదారంగా, ధారాళంగా స్కాలర్‌షిప్పులు ఇవ్వాలి.

పని మనుషులకు కనీసం 500 చ.అడుగుల నివాస వసతి అవసరం

పని మనుషులు నాలుగు ఇళ్ళకు తిరగాలి. కనుక వారి నాలుగిళ్ళకు దగ్గరగా ఉండాల్సి ఉంటుంది. ఒకటి రెండు కిలోమీటర్ల కన్నా ఎక్కువ దూరంలో ఉండి పని మనిషిగా పని చేయడం సాధ్యం కాదు. కనుక పని మనుషులు సంపన్నుల సేవలో, మధ్యతరగతి సేవలో ఉండడానికి కూడా వారు నగరం నడిమధ్యనే జీవించే అవకాశాలు ఉండాలి. కనుక వారికి నగరంలో మధ్యతరగతి ఇళ్ళ సమీపంలోనే వారి పిల్లలు చదువుకోవడానికి అనువుగా కనీసం సింగిల్ బెడ్ రూం 500 చదరపు అడుగుల నివాస వసతి కల్పించడం అవసరం. అలాగే వారికి హైదరాబాద్ నగరంలో సొంత ఇళ్ళు కట్టుకోగలం, మా పిల్లలు కూడా ఎదగడం సాధ్యమే అనే ఆత్మవిశ్వాసం కలిగించాలి. అప్పుడే పేద ప్రజల నుండి తిరిగి మధ్యతరగతి ఎదుగుతుంది. పేదల్లోని నైపుణ్యం సృజనాత్మకత వెల్లివిరుస్తుంది. గొప్ప మేధావులుగా, ఇంజనీర్లుగా, విద్యావంతులుగా ఎదుగుతారు.

అందుకని పని మనుషులకు కనీసం 60 గజాల నుండి 80 గజాల వరకు ఇళ్ళ స్థలాలను కేటాయించడం అవసరం. ఈ స్థలం ప్రభుత్వ స్థలం అయితే మంచిది. ప్రభుత్వం కొని వీరికి కేటాయించడం కూడా ప్రభుత్వ కనీస బాధ్యత. నగర కేంద్రానికి కాస్త దూరంగా ఉండే సబర్బన్ ప్రాంతాల్లో వీరికి స్థలం కేటాయించినా వారికి ఎంతో ఆత్మవిశ్వాసం కలుగుతుంది. వారి పిల్లల్లో మేమూ ఎదిగి సొంత ఇళ్ళు కట్టుకోగలం అనే గొప్ప స్థైర్యాన్ని ఇస్తుంది. అందువల్ల పని

మనుషులందరికీ కులాతీతంగా, మతాతీతంగా, ప్రాంతాలకతీతంగా అందరికీ హైదరాబాద్ పరిసరాల్లో ఇళ్ళ స్థలాలను కేటాయించాలి. ఔటర్ రింగ్‌రోడ్డు ఆనుకొని సేకరిస్తున్న స్థలాలను కేటాయిస్తే పేద ప్రజలు ఎంతో సంతోషిస్తారు. ఓట్లు కూడా వేసి గెలిపిస్తారు.

ఆటో డ్రైవర్లు, లేబర్, మేస్త్రీలకు కూడా సొంత ఇల్లు అవసరం

ఇలాగే ఆర్.టి.సి డ్రైవర్లు, కండక్టర్లు కాకుండా అసంఘటిత రంగంలో ఎంతో మంది డ్రైవర్లు హైదరాబాద్‌లో ప్రజలకు, సంపన్నులకు తమ సేవలను అందిస్తున్నారు. నగరంలో 95వేల ఆటోలు తిరుగుతున్నాయి. వారిలో సగం మందికి ఇప్పటికీ నివాస వసతి లేదు. వారికి సొంత ఇళ్ళు కోసం స్థలం అవసరం.

నగరంలో ఎన్ని కార్లు వున్నాయో అంత మంది డ్రైవర్లున్నారు

అలాగే నగరంలో సొంతానికి ఎన్ని కార్లున్నాయో అంత మంది డ్రైవర్లుగా వారి వద్ద పని చేస్తున్నారు. సుమారు లక్షకు పైగా ఇలా డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వాళ్ళు కారు ఓనరు ఇంటికి వెళ్ళడానికి అనువుగా వీలైనంత దగ్గరగా ఉండవలసి ఉంటుంది. కనుక వీరికి కూడా వసతి కల్పించడం అవసరం. వీరికి కూడా ఇళ్ళ స్థలాలు కేటాయించడం అవసరం.

అలాగే నగరంలో భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలు, కూలీలు అనేక జిల్లాల నుండి, రాష్ట్రాల నుండి ఇక్కడికి వలస వచ్చి జీవిస్తున్నారు. వారికి కూడా వసతి కల్పించాలి. సొంత ఇంటికోసం స్థలం కేటాయించాలి. అలాగే చెత్తను తీసుకువెళుతూ ఎంతో సేవ చేస్తున్న వారికి కూడా సొంత ఇంటి కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

కోట్ల రూపాయల విలువైన సెలవులను అందిస్తున్న పనిమనుషులు

ఇలా అసంఘటిత రంగంలో నగరంలోని పెద్దలకు, మధ్యతరగతి పేదల సేవలు ఎంతో అవసరమవుతున్నాయి. సంపన్నుల, మధ్యతరగతి సౌకర్యం కోసమైనా ఈ పేద పనిమనుషులు, డ్రైవర్లు, కూలీలు, మెకానిక్‌లు ఎంతో అవసరం. వాళ్ళు ఆరోగ్యంగా ఉంటేనే వీళ్ళ పనులు సజావుగా సాగుతాయి. వాళ్ళు ఒక్క రోజు అనారోగ్యంతో పడుకుంటే వీరి పనులు ఆగిపోతాయి. వీరి లీవులు ఎన్నో ఖర్చు అయిపోతాయి. అందువల్ల వాళ్ళ జీవితంలో ఎంతో విలువైన సంపద, ఎంతో విలువైన కాలం, ఎంతో విలువైన ఆరోగ్యం సంపాదించుకోవడానికి పని మనుషులు

తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. ధారపోస్తున్నారు.

మంచి మనుషులు సొంత మనుషుల్లా చూస్తారు

ఈ విషయం అర్థం చేసుకున్న కొందరు మంచి మనుషులు పనిమనుషులను తమ ఇళ్ళల్లో సొంత మనుషులుగా గౌరవిస్తున్నారు. టి, టిఫిన్ తమతో పాటు ఇవ్వడంతో పాటు ఫంక్షన్స్‌ల్లో తమ కుటుంబ సభ్యుల్లాగే వెంట తీసుకెళుతున్నారు. వారి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. వారి పిల్లలకు పెళ్ళీడు వస్తే స్వయంగా యజమానులే కట్నాలు కూడా ఇచ్చి పెళ్ళి ఖర్చులన్నీ పెట్టుకొని పెళ్ళిల్లు జరిపిస్తున్నారు. సొంత దత్త పుత్రికలాగా, సొంత ఆడపడచులాగా ఆదరిస్తున్నారు. ఇలాంటివాళ్ళు కొద్ది మందే కావొచ్చు. వాళ్ళే అందరికీ ఆదర్శం.

పనిమనుషుల పిల్లలు యజమానుల పిల్లల్లా ఎదగాలి

పనిమనుషులు కాస్త అవకాశం ఉంటే తమ పిల్లలను ఎంతో ఎదిగిస్తారు. తమ యజమానుల వలె, వారి పిల్లల వలె తమ పిల్లలు కూడా చక్కగా చదువుకొని ఎదగాలని ఆరాట పడుతుంటారు. అందుకే పని మనుషులు కూడా తమ పిల్లలను ఇంగ్లీషు మీడియంలో, ప్రైవేటు స్కూళ్ళలో వేసి చదివిస్తున్నారు.

పనిమనుషుల ఆరోగ్యమే మన మహాభాగ్యం అని మరవద్దు

పని మనుషుల అనారోగ్యం ఇంటి వారికి కూడా అనారోగ్యం తెస్తుంది. అందువల్ల పని మనుషులను సొంత ఇంటి మనుషుల్లాగా ఆరోగ్యంగా ఉండడానికి వైద్యం చేయించాలి. వారికి కొందరు పాచిపోయినవి పెడుతుంటారు. తాము తినలేనివి ఇతరులకు పెట్టడం అమానుషం. తాము తినేవి కాస్త మిగిల్చి వారికి పెట్టడం ఆత్మీయత.

పనిమనుషుల పట్ల ప్రవర్తించే తీరే
ప్రపంచం పట్ల ప్రవర్తించే తీరును నిర్దేశిస్తుంది

పనిమనుషులను ఆత్మీయంగా చూస్తే ఆ ఇంటి యజమాని పిల్లల్లో కూడా ఆత్మీయత స్పర్శ పెరిగి మనుషులను ప్రేమించే స్వభావం అబ్బుతుంది. పని మనుషులను ఈసడించుకుంటే యజమానుల పిల్లల్లో, వారి వ్యక్తిత్వాల్లో అమానుషత్వం వ్యక్తిత్వంగా రూపుదిద్దుకుంటుంది. అది వారి జీవితాల్లో ఎప్పుడో ఒకప్పుడు తీవ్ర నష్టాన్ని, కష్టాన్ని కలుగజేస్తుంది.

పనిమనుషులు అచ్చంగా కుటుంబ సభ్యులే

ఇలా పని మనుషులు కేవలం కూలి రీత్యానే పని మనుషులు తప్ప వాళ్ళు ఉమ్మడి కుటుంబంలో, వ్యక్తి కుటుంబంలో సహజమైన కుటుంబ సభ్యుల వంటి వారే. కుటుంబ సభ్యులు ఎన్ని ప్రభావాలు వేస్తారో పని మనుషుల ద్వారా ఇంటివాళ్ళు అన్ని ప్రభావాలు పొందుతారు. పని మనుషులను హింసించే స్వభావం ఆ మనుషుల్లోని క్రూరత్వాన్ని తెలుపుతుంది. అలాంటి వాళ్ళు బయటి సమాజంలో ఎంతో నాగరికంగా ప్రవర్తించి నప్పటికీ వారు సమయం వచ్చినప్పుడు ఎంత క్రూరంగా, నీచంగా ప్రవర్తించగలరో అనే విషయాన్ని తమ పని మనుషుల పట్ల, తమ డ్రైవర్ల పట్ల, తమ కింది సిబ్బంది పట్ల, తమ మీద ఆధారపడి బతికేవారి పట్ల ప్రవర్తించే తీరు తెలుపుతుంది.

అందువల్ల కొందరు పెళ్ళి సంబంధాల విషయంలో ఎదుటి పక్షం వారి పని మనుషులను ఆ యింటి వాళ్ళు ఎలాంటి వారో ఆరాతీస్తారు. పని మనుషులను ఎలా చూస్తున్నారో రకరకాలుగా అడిగి తెలుసుకుంటారు. మాకు కూడా పని మనిషి అవసరం అని ఎంత జీతం ఇస్తున్నారని అడిగి కూపీలు లాగుతారు. అలా వారి ఇంటికి తమ కూతురుని ఇవ్వవచ్చో లేదో, తమ కొడుక్కు వాళ్ళ కూతురును చేసుకోవచ్చో లేదో ఒక అంచనాకు వస్తారు.

తమ అధీనుల పట్ల, తమపై ఆధారపడిన వారిపట్ల ప్రవర్తించే తీరే వారు ఏ మేరకు ప్రజాస్వామిక స్వభావాన్ని కలిగి ఉన్నారో తెలుపుతుంది. పైవారిని ఎలాగూ గౌరవించక తప్పదు. గౌరవించక పోతే తిప్పలు వీరికే కనుక వారి నిజమైన ప్రజా స్వామిక స్వభావం తమ కన్నా కింది వర్గాల పట్ల, కింది కులాల పట్ల, తమ మీద ఆధారపడి బతికేవారి పట్ల ప్రవర్తించే తీరే వారిలోని సహృదయానికి, సంస్కారానికి, ప్రజాస్వామిక స్వభావానికి నిదర్శనం.

ఇలాంటి పనిమనుషులను, డ్రైవర్లను, అడ్డాకూలీ లేబర్‌లను, అసంఘటిత కార్మికులను రాజకీయ శక్తిగా మార్చాలి. వీళ్ళంతా కలిసి 15-20 లక్షల మంది వున్నారు. వాళ్ళు ఒక్కటైతే 5గురు ఎమ్మెల్యేలను, ఇద్దరు ఎంపిలను, 30 మంది కార్పొరేటర్లను గెలిపించుకోవచ్చు. అందుకు వారిని ఓటర్లుగా నమోదు చేయాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధి మొత్తంలో ఎవరు గెలవాలో, ఎవరిని ఓడించాలో నిర్ణయించగల శక్తి సంపన్నులు వీరే. ఓటే వారి మహాశక్తి. దాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగం చేయాల్సిన అవసరం ఉంది. అదెలా చేయాలో చూద్దాం.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో

పనిమనుషులు, అసంఘటిత కార్మికుల ఓట్లే కీలకం

పనిమనుషులు, డ్రైవర్లు, అడ్డాకూలీ లేబర్ గొప్ప రాజకీయశక్తి
జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ అధికారాన్ని వీళ్లే కూల్చి వేయగలరు

పనిమనుషులు, డ్రైవర్లు, అసంఘటిత రంగ కార్మికులు, రాజకీయ శక్తిగా మహాబల సంపన్నులు. వీరిని సంఘటిత పరిచి రాజకీయ చైతన్యంతో తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా ముందుకు కదిలిస్తే అందరి పునాదులు కదులుతాయి. జూబ్లీహిల్స్, బంజారా హిల్స్ మొదలైన ఎలైట్ శిష్ట వర్గాల ఆధిపత్యాన్ని కూల దోయడం వీరి ఓట్లతోనే సాధ్యం.

బిఎస్‌పి తీసుకున్న 'భారతీయ శరణార్థుల ఉద్యమం' ఆదర్శం కావాలి

బిఎస్‌పి చేసే అయిదు ఉద్యమ ప్రధాన కార్యక్రమాల్లో 'భారతీయ శరణార్థుల ఉద్యమం' ఒకటి. వారి ఆలోచన ఆసక్తి కరంగా ఉంది. 'రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విదేశాల నుంచి వలస వచ్చే ప్రజలను విదేశీ శరణార్థులని అంటాయి. విదేశీ శరణార్థులకు కేంద్ర ప్రభుత్వం భారతదేశ బడ్జెట్‌లోంచి వారికి కొంత కేటాయిస్తుంది.

అయితే స్వదేశంలో గ్రామాల్లో అగ్రకులాలు, భూస్వాములు పెట్టే బాధలు భరించలేక, ఉపాధి లేక పట్టణాలకు వలసవచ్చే ప్రజలను కాన్షీరాం భారతీయ శరణార్థులని నామకరణం చేశారు. వీరు ఫుట్‌పాత్‌ల మీద, మురికి కాలువల ప్రక్కన గుడిసెలు వేసుకొని ఈ దేశ పౌరులు కాదనే రీతిలో బతుకులు వెళ్ళదీస్తున్నారు. అనేక మురికి వాడల్లో గుడిసెలు వేసుకొని తాగడానికి నీళ్ళు లేక, ఇళ్ళు లేక, వారి పిల్లలకు చదువులు లేక, సరైన తిండి లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వారిని ఏ ప్రభుత్వాలు ఈ దేశ పౌరులు, ఈ దేశ శరణార్థులని పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి కోసం బడ్జెట్ కేటాయించడం లేదు. బిఎస్‌పి

భారతీయ శరణార్థుల కార్యక్రమం పేరిట వీరి కోసం ప్రత్యేకంగా పథకాలు రూపొందిస్తున్నది. ఈ స్వదేశీ శరణార్థుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయిస్తున్నది. వారి జీవన ప్రమాణాల ఎదుగుదలకు, వృత్తుల్లో నైపుణ్యానికి వారి పిల్లల విద్యాభివృద్ధికి విస్తారంగా బడ్జెట్‌లు కేటాయిస్తుంది. కేటాయించాలని ఉద్యమాలు చేస్తుంది.' అని బిఎస్‌పి ప్రకటించుకుంది. ఇది గ్రేటర్ హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని పట్టణాలకు వర్తింప చేయడం అవసరం.

అందుకు తొలిమెట్టుగా వీళ్ళందరిని ఓటర్లుగా వెంటనే నమోదు చేయించాలి. వారి అవసరాలను తీర్చుతూ, వారి పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దే కార్యక్రమాలను వారి ముందుంచాలి.

వారి రాజకీయ శక్తి సామర్థ్యాలపై వారికి విశ్వాసం కలిగించాలి. సంఘటిత శక్తిగా మలచాలి. వారి నుంచే నాయకత్వాన్ని తయారు చేయాలి. ఎదిగించాలి. వారే ఉద్యమాలు నడుపుకునే విధంగా తీర్చిదిద్దాలి. తెలంగాణ రాష్ట్రవాదులకు ఇది ఒక గొప్ప అవకాశం. సొంత ఊరు వదిలి పాలమూరు ప్రజలు 14 లక్షల మంది ఇతర ప్రాంతాల్లోకి శరణార్థులుగా వెళుతున్నారు. ప్రకాశం, శ్రీకాకుళం, వరంగల్ జిల్లాల పేదలు లక్షలాది మంది హైదరాబాద్ వంటి నగరాల్లో పొట్ట చేత పట్టుకొని శరణార్థులుగా బతుకుతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌కు జరుగబోయే ఎన్నికలకు అన్ని పార్టీలు సమాయత్తమవుతున్నాయి. ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆధ్వర్యంలో చిన్నా చితక పార్టీలతో సహా అనేక పార్టీలు, సంస్థలు, కుల సంఘాలు కలిసి ఒక ఫ్రంటుగా ఏర్పడి 150 కార్పొరేటర్లకు పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయి. 'మా హైదరాబాద్ మాకే' అంటూ ప్రజా కవి గద్దర్ గ్రేటర్ హైదరాబాద్‌లో తెలంగాణ వాదులే గెలవాలని అందుకు సమాయత్తమవుతున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు రణరంగాన్ని తలపించేట్టు ఉంది. ఒకవైపు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేలాది కోట్ల రూపాయలు సంపాదించి రంగంలో ఉన్నవారిని తమకు అనుకూలంగా మార్చుకునే ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఎవరిని గెలిపించాలో వీరే నిర్ణయించాలనుకుంటున్నారు. మరొకవైపు బిల్డర్లు ఇదే కోవలో ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్ వారిని వచ్చే శాసనసభ ఎన్నికల్లో మట్టి కరిపించడానికి గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో దాని మచ్చు చూపించాలని చాలా మంది ఉవ్విళ్ళూరుతున్నారు. కాంగ్రెస్, టిడిపి, బిజెపి, సిపిఎం తమ పట్టును పెంచుకోవాలనుకుంటున్నారు.

కొత్త శక్తితో ప్రవేశిస్తున్న బిఎస్‌పి, తెలంగాణ రాష్ట్ర వాదులు

ఈ మధ్యే ఉత్తరప్రదేశ్ విజయంతో ఉరకలెత్తుతున్న బిఎస్‌పి రాష్ట్రంలో ఊర్మిళ నిద్ర వదిలి, జూలు విదిల్చి కదులుతున్నది. తెలంగాణ రాష్ట్ర వాదులు ఇదే ఆఖరి మోఖా అంటూ గ్రేటర్ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వాదులు మాత్రమే గెలవాలని ఎత్తుగడలు వేస్తున్నారు. కాంగ్రెస్ మోసం చేస్తున్నదని గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించాలని తెలంగాణ రాష్ట్ర వాదులు భావిస్తున్నారు. టిఆర్ఎస్, బిజెపి పార్టీలు తమ ఉనికి కోసం కూడదీసుకొని కదులుతున్నాయి. ఎం.ఐ.ఎం మొదలైన ముస్లిం పార్టీలు గ్రేటర్ హైదరాబాద్‌పై తమ పట్టుకోసం ప్రయత్నిస్తున్నాయి.

భూములు కోల్పోయిన రైతులు అదను కోసం చూస్తున్నారు

మరొకవైపు ఔటర్ రింగ్‌రోడ్డుతో భూములు కోల్పోయిన ప్రజలు కోపంగా తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాల్లో, గ్రామాల్లో బతుకు లేక పొట్ట చేత పట్టుకొని పట్టణానికి వలస వచ్చిన పేదలు గ్రేటర్ హైదరాబాద్‌లో తమ భవిష్యత్ ఏమిటని ప్రశ్నించుకుంటున్నారు. తమ అవసరాలు, గోడు, గూడు గురించి పట్టించుకునేవారినే ఎన్నుకోవాలని మనసులో గుణించుకుంటున్నారు. బహుజన సమాజ్ పార్టీ 'భారతీయ శరణార్థుల ఉద్యమం' పేరిట వీరి కోసం రూపొందించిన ఆర్థిక విముక్తి ఉద్యమం కార్యక్రమాన్ని అన్ని పార్టీలు స్వీకరించాలి.

గ్రేటర్ హైదరాబాద్‌లో
తెలంగాణ వాదులనే గెలిపించుకోవాలి ఎందుకంటే

గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడున్న హైదరాబాద్ కార్పొరేషన్ వంటిది కాదు. నాలుగు తెలంగాణ జిల్లాల గ్రామాలను మింగేసి విస్తరించిన పెద్ద జంతువు గ్రేటర్ హైదరాబాద్. అందువల్ల గ్రేటర్ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదించేవారిని గెలిపించుకోవడం తెలంగాణ రాష్ట్ర వాదుల ప్రథమ కర్తవ్యం అయి కూర్చుంది. ఫ్రంట్ తరఫున అసంఘటిత రంగ పేదలను, ప్రజలను ఆర్గనైజ్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు.

కత్తి పద్మారావు నాయకత్వంలో నిర్మించిన దళిత మహిళా సంఘం ఉద్యమం - పనివిధానం ఒక గొప్ప అనుభవం, మార్గదర్శకం

సిపిఎమ్, సిపిఐ ఈ మధ్య పేదలకు ఇళ్ళ స్థలాల కోసం, దున్నే భూమి కోసం ప్రజలను కదిలిస్తున్నాయి. అయితే వాళ్ళు శాస్త్రీయంగా ముందుకు సాగడం లేదు. ప్రజలను గుడిసెలు వేస్తే స్థలం మీదే అవుతుందని భ్రమ పెట్టడం సరైంది కాదు. ప్రభుత్వం చట్టబద్ధంగా ఇవ్వడానికి అవకాశం ఇవ్వాలి.

అందుకు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు, మిగులు భూములు ఉన్నాయో లేదా ఏ భూములు ప్రభుత్వం కొని కేటాయిస్తే బాగుంటుందో వెలికి తీయాలి. ఆ భూములు మాకు కావాలని తన కుటుంబ వివరాలతో ఆర్థిక స్తోమతతో, పూర్తి చిరునామాతో మండల రెవెన్యూ కార్యాలయంలో ఇచ్చి రశీదు తీసుకోవాలి. కలెక్టర్ కార్యాలయానికి, గవర్నర్‌కు, రాష్ట్రపతికి అదే దరఖాస్తు ప్రతిని పంపాలి. కొంతమంది కలిసి ఒక సంస్థగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ పని చేస్తే ఇంకా మంచిది.

ఉద్యమ నాయకులు ప్రతి దరఖాస్తును కంప్యూటరైజ్ చేయాలి,
సీరియల్ నెంబర్ ఇవ్వాలి, కరస్పాడెన్స్ చేయాలి

ప్రతి దరఖాస్తును అందులోని వివరాలను మండలాల వారీగా, రెవెన్యూ డివిజన్ వారిగా, జిల్లాల వారీగా, వృత్తుల వారీగా కంప్యూటరైజేషన్ చేయాలి. ఉద్యమ నాయకుల వద్ద అందరి వివరాలు ఉండాలి.

ప్రతి దరఖాస్తుకు సీరియల్ నెంబర్ కేటాయించాలి. ఆ సీరియల్ నంబర్ ద్వారా ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. సిటిజన్ ఛార్టర్ ప్రకారం ప్రభుత్వ అధికారులకు సమయం ఇవ్వాలి.

ఆ తరువాత ఉద్యమంగా వెళ్ళి గుర్తు చేయాలి. అప్పుడు మీడియా సహకారం తీసుకోవాలి. అధికారుల నుండి రాత పూర్వకంగా అవును లేదా కాదు అనే జవాబు రాబట్టాలి. ఆ తరువాత అక్కడ ఎన్నికైన ఎమ్మెల్యేను నిలదీయాలి. స్థలాలైనా ఇప్పించండి రాజీనామా అయినా చేయండి అంటూ ఆయా స్థానిక శాసనసభ్యులను, పార్లమెంట్ సభ్యులను, మండలాధ్యక్షులను నిలదీయాలి. ప్రజాస్వామిక ధర్నా చేయాలి. ఘెరావ్ చేయాలి. నిరాహార దీక్షలు నిర్వహించాలి. రోడ్డు రోకో, రాస్తారోకో చేయాలి.

ఇలా ప్రభుత్వ యంత్రాంగం మన దరఖాస్తు ముట్టిన తరువాత దానికి తగిన రసీదు పొందిన తరువాత, దరఖాస్తుకు సిటిజన్ ఛార్టర్ ప్రకారంగా జవాబు రాతపూర్వకంగా పొందిన తరువాత ఆ జవాబు వ్యతిరేకంగా ఉంటే తమకనుకూలంగా ఉండడం కోసం శాంతియుతంగా అప్పుడు ఇలా ఎన్ని

ఉద్యమాలైనా చేయవచ్చు. ఇది ప్రజాస్వామిక ప్రభుత్వంలో పని చేసే విధానం. ప్రజాస్వామిక ప్రభుత్వంలో ప్రభుత్వ సేవలను పొందే విధానం. ఇది మనం నిర్ణయించుకున్న పద్ధతే. ఈ శాస్త్రీయమైన పద్ధతిని ముందు అనుసరించాలి.

ఇలా నిర్మాణ పరంగా సభ్యత్వ పరంగా సంఘటితంగా అందరి సభ్యుల వివరాలతో పటిష్టంగా ఉద్యమం నిర్మించాలి. ఇది శాస్త్రీయంగా ఇళ్ళ స్థలాల కోసం, దున్నే భూమి కోసం ఉద్యమాలు నిర్మించాల్సిన పద్ధతి. అంతేగాని ఇవేవీ చేయకుండా లాఠీదెబ్బలకు గురి చేయడం, గుడిసెలు వేసుకోవడానికి సరంజామా తెచ్చుకోమనడం దాన్ని పోలీసులు, మున్సిపాలిటీలు బుల్‌డోజర్లతో తొక్కించడం ప్రజలపై కేసులు పెట్టడం, కేసులకు తిరిగి తిరిగి వున్నది వూడిపోవడం ఇలాంటి పని విధానంలోని ఉద్యమాలు కేవలం ప్రచారానికే పనికి వస్తాయి తప్ప పరిష్కారం దాకా రావు అని ప్రజలు గమనించడం అవసరం. ప్రజలకు తెలియ చెప్పడం అవసరం.

గ్రేటర్ హైదరాబాద్ పట్టణంలో ఎల్‌బినగర్ మన్సూరాబాద్ సమీపంలో ఎరుకుల కులస్థులు స్త్రీల పేరిట గిరిజన అభివృద్ధి సేవా సంస్థ పేరుతో 120 మందితో సంస్థను రిజిష్టర్ చేసుకున్నారు. 1996లో తమకు ఇళ్ళ స్థలాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారు. కోర్టుకు వెళ్ళారు. 2003లో కోర్టు తీర్పు వచ్చింది. కలెక్టర్ వీరందరికి రెండున్నర ఎకరాలు కేటాయించారు. దాన్ని 120 మందికి ఇళ్ళ స్థలాలుగా భాగించుకున్నారు. ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వలిగి ప్రభాకర్, సిటీ నాయకులు వి.గంగయ్య నాయకత్వంలో, నిర్దేశకత్వంలో ఈ ఉద్యమం సాగింది.

హైదరాబాద్‌లో పనిమనుషులకు, అసంఘటిత కార్మికులకు సొంత ఇల్లు గురించి ఉద్యమాలు చేయడం కోసం వారి గురించిన అధ్యయనం మొదలైంది. కత్తి పద్మారావు నాయకత్వంలో దళిత మహిళా సంఘం పేరిట నాలుగేళ్ళ క్రితం 9 లక్షల మంది మహిళలను భూమి కోసం, ఇళ్ళ స్థలాల కోసం, ఇళ్ళ కోసం ఆర్గనైజ్ చేయడం జరిగింది. రాత పూర్వకంగా దరఖాస్తు నింపి ఎంఆర్ఓ, కలెక్టర్, గవర్నర్, రాష్ట్రపతి మొదలైన వారికి ప్రతి ఒక్కరు దరఖాస్తు పంపడం జరిగింది. వాటిని పరిష్కరించాలని ఉద్యమాలు చేపట్టడం జరిగింది. వీటన్నిటా నేను కూడా వెంట వున్నాను. ఆ ఉద్యమం డర్బన్‌లో జరిగిన సమావేశం అనుభవాల నుండి ఇతర దేశాల అనుభవాల నుండి తీసుకున్న పోరాట రూపం. దాన్ని

గ్రేటర్ హైదరాబాద్‌లో, అలాగే అన్ని జిల్లా కేంద్రాల్లో అసంఘటిత ప్రజలకు, కార్మికులకు మార్గదర్శకంగా తీసుకొని ఉద్యమాలు నిర్మించడం అవసరం.

ఇళ్ళు, ఇళ్ల స్థలాలు ఇప్పుడు రాకపోయినా తెలంగాణ రాష్ట్రంలో తప్పకుండా వస్తాయి

మేము ఇళ్ళ స్థలాలు ఇప్పించము.

మీరు ఇళ్ళ స్థలాలు సాధించుకోడానికి మీరే పోరాటం చేయాలి.

మీరే సంఘటితం కావాలి.

అందుకు సూచనలు మాత్రమే మేము చేస్తాం.

ఇళ్ళ స్థలాలు ఇప్పించే వారికే ఓటు వేయండి.

ఇప్పుడు సంఘటితంగా దరఖాస్తు చేసుకొని ఉద్యమిస్తే సీనియారిటీ పెరిగి తెలంగాణ రాష్ట్రం రాగానే ఇళ్ళ స్థలాలు ఇవ్వడం సులువవుతుంది.

అందుకు తెలంగాణ వాదులకు ఓటు వేసి గెలిపించుకోవాలి.

తెలంగాణ వచ్చాక తప్పకుండా మీకు ఇళ్ళ స్థలాలు వస్తాయి.

మేము మీకు నాయకులం కాదు.

మీరే నాయకులు.

మీరే ముందుకు సాగాలి.

మేము మార్గదర్శకులం మాత్రమే.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మీరే కదలాలి.

తద్వారా మీరే మీ ఇళ్ళ స్థలాలను, ఇళ్ళను సాధించుకోవాలి

అని వివరిస్తూ ఈ ఉద్యమాన్ని నిర్వహించాలి.

అప్పుడే రాజకీయంగా చైతన్యవంతమవుతారు.

నాయకులుగా ఎదుగుతారు.

తమ ఓటు విలువ ఎంత గొప్పదో తెలుసుకుంటారు.

తెలుగుదేశం పార్టీ తనకు బదులుగా

టిఆర్ఎస్ పార్టీ ఎదగాలని కోరుకుంటున్నదా...?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడానికి తెలుగుదేశం పార్టీ కూడా తీర్మానం చేయాలని, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ అది నిర్వహిస్తున్న పాత్ర కీలకమైనది. తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ఆమోదిస్తే తెలంగాణ రాష్ట్రం పేరు చెప్పుకొని ఓట్లు అడిగే రాజకీయాలకు తెరపడుతుంది. తద్వారా అన్ని పార్టీలు తమ తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. కేవలం రాష్ట్ర నినాదం మీద ఆధారపడడం, దాని బలం మీదే నిలబడడం వల్ల టిఆర్ఎస్ వంటి పార్టీలు తమ శక్తి సామర్థ్యాలను, నిర్మాణాన్ని విస్తరించలేక పోతున్నాయి. తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తీర్మానిస్తే టిఆర్ఎస్ తన నిజమైన శక్తి సామర్థ్యాలను పెంచుకుంటుంది. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో తిరిగి పుంజుకుంటుంది. రేపు బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినా అందుకు బిజెపితో అలయెన్స్ పెట్టుకోవచ్చు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మాణం చేయాలని తెలంగాణ మేధావులు, కళాకారులు, విద్యావంతులు, జర్నలిస్టులు, ప్రజలు తెలుగుదేశం పార్టీకి విజ్ఞప్తి చేస్తున్నారు. టిడిపి తిరుపతి మహానాడులో ఈ తీర్మాణం చేసి తెలంగాణ ప్రజల్లో టిడిపి తిరిగి బలాన్ని పుంజుకోవచ్చని గుర్తు చేస్తున్నాయి. గుడ్డివాడికి కావలసింది రెండు కళ్ళు తెలంగాణా ప్రజలకు కావల్సింది ప్రత్యేక రాష్ట్రం. అది ఏ పార్టీ ఇస్తేనేమి? అన్ని పార్టీలు కలిసి ఇస్తే ఆయా పార్టీలన్నీ

చరితార్థమవుతాయి.

టిడిపి తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదించక పోయినా తెలంగాణ రాష్ట్రం ఏర్పడక తప్పదు. కాని తెలంగాణ ప్రజల ద్రోహిగా టిడిపి, సిపిఎం చరిత్రలో అపకీర్తిని సాధించుకుంటాయి. తద్వారా దశాబ్దాల తరబడి తెలంగాణలో ఈ రెండు పార్టీలకు పుట్టగతులు లేకుండా పోతాయి. తెలంగాణలోని సిపిఎం, టిడిపి పార్టీ కార్యకర్తలు, నాయకులు తమ భవిష్యత్తు కోసం పునరాలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎన్నికల ముందు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మరు. ఇప్పుడే తెలంగాణ రాష్ట్రం ఆమోదిస్తూ ముందుకు వచ్చినప్పుడే ప్రజలు క్షమించి తిరిగి ఈ పార్టీలను ఆదరిస్తారు.

తెలుగుదేశం పార్టీ సమైక్య రాష్ట్రంలో అధికారంలోకి రావడం అసాధ్యమైన విషయం. లాలు ప్రసాద్ యాదవ్ నుంచి చంద్రబాబు, దేవేందర్ గౌడ్ నేర్చుకోవల్సింది ఎంతో వుంది. బిహార్ రాష్ట్రం నుంచి జార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకించిన లాలు జార్ఖండ్ పార్టీ మద్దతుతోనే తిరిగి అధికారంలోకి రాగలిగారు. అందుకు జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ బిహార్ అసెంబ్లీలో జార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మాణం చేయాలని కోరింది. ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందం ప్రకారం లాలు ప్రసాదే జార్ఖండ్ రాష్ట్రం ఆమోదిస్తూ అసెంబ్లీలో తీర్మాణం చేసారు. అయితే లాలు ప్రసాద్‌కు వచ్చిన అవకాశం రాష్ట్రంలో తెలుగుదేశానికి రాదు. ఎందుకంటే ఇక్కడ లాలు ప్రసాద్ ఒక్కరే లేరు. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, బిఎస్‌పి, సిపిఐ మొదలైన పార్టీలన్నీ తెలంగాణా రాష్ట్రాన్ని ఆమోదించి తమ బలాన్ని నిరంతరం పెంచుకుంటున్నాయి.

అయితే టిడిపి తన వ్యతిరేక పార్టీలను బలోపేతం చేయడానికి కంకణం కట్టుకుంది. అందువల్లే తెలంగాణలో తనకు తాను భూ స్థాపితం అయ్యే ఎత్తుగడలను తీసుకుంటున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ప్రత్యక్షంగా ఆమోదించని పార్టీలను నామరూపాలు లేకుండా చేయడానికి తెలంగాణ లోని మేధావులు, కళాకారులు, విద్యావంతులు, ప్రజలు ఒకే కట్టుబాటు మీద ఉన్నారు. మాలో ఎన్ని విభేదాలున్నా సమైక్యవాదమా? ప్రత్యేక రాష్ట్రమా? అన్నప్పుడు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరే వారికే పాండవులు కౌరవులు కలిసి 105 మంది అని కలిసికట్టుగా ఉంటారు. తమలో తాము పోట్లాడుకున్నప్పుడు పాండవులు 5గురు, కౌరవులు 100 అని పోట్లాడుకుంటారు. ఈ రహస్యం తెలుగుదేశం పార్టీకి అర్థం

కావల్సిన అవసరం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోను తెలుగుదేశం పార్టీని భూ స్థాపితం చేయడమే తెలంగాణ ప్రజల తక్షణ కర్తవ్యం. దీనికి భిన్నంగా బిసి కార్డును వాడినా ఎన్ని ఉద్యమాలు చేసినా పేదలకు ఇళ్ళ స్థలాలు అని గొంతు చించుకున్నా టిడిపి, సిపిఎం పార్టీలకు మద్దతు లభించడం అసాధ్యమైన విషయం.

టిడిపి ఇప్పుడు టిఆర్ఎస్ బలం ఎలా పెంచాలా అనే వ్యూహం ఎత్తుగడను తీసుకుంటున్నది. టిడిపికి, టిఆర్ఎస్‌కు మధ్య లోపాయికారి ఒప్పందం ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కుదిరిందని ఒక గాలి వార్త ప్రసారమైంది. ఆ గాలి వార్తకు ఒక పునాది ఉంది. టిడిపి తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇవ్వొద్దని, ఇస్తే టిఆర్ఎస్ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని దేవేందర్ గౌడ్ నాయకత్వంలో యాదగిరి గుట్టలో టిడిపి తెలంగాణ నాయకులు కల్సుకున్నప్పుడు అటు టిడిపి భవన్, ఇటు తెలంగాణ భవన్ రెండూ వణికి పోయాయి. పుటుక్కున తెలంగాణ టిడిపి ఏర్పడి తెలంగాణ రాష్ట్ర నినానాదాన్ని తీసుకుంటే పుట్టగతులుండవని దేవేందర్ గౌడ్ నాయకత్వం నెంబర్ 2 నుండి నెంబర్ 1కు మారుతుందని చంద్రబాబు భయపడి పోయారు. అంతకన్నా ఎక్కువ టిఆర్ఎస్ భయపడి పోయింది. ఎందుకంటే టిఆర్ఎస్ పేరిట వెలమ కుల రాజకీయాలను నడుపుకోవాలని బిసిలను వెనక్కి నెట్టాలని ఒక పథకం ప్రకారంగా ముందుకు సాగుతున్న పార్టీ అది. అందువల్ల శత్రువు యొక్క శత్రువు మిత్రుడు అనే న్యాయం ప్రకారం చంద్రబాబు నాయుడు, టిఆర్ఎస్ లోపాయికారి ఒప్పందాలతో ముందుకు సాగారు అనేది ఆ గాలి వార్త వెనక ఉన్న తాత్వికాంశం. ఇది నిజమైన మౌలికమైన అంశం కూడా.

తెలుగుదేశం పార్టీ తమ కమ్మ రాజకీయాల కోసం టిఆర్ఎస్‌లోని వెలమ రాజకీయాలు ఎదగాలని కోరుకుంటున్నది. కానీ, కమ్మ కుల సంఘం రెండు రాష్ట్రాలు ఆమోదిస్తూ ఎప్పుడో తీర్మానించింది. లోతుగా ఆలోచిస్తే తెలంగాణ రాష్ట్ర సమితి బలం ఇప్పుడు పెరగాలా? తగ్గాలా? అనే నిర్ణయాత్మక శక్తి తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఉంది. తెలంగాణ లోని టిడిపి నాయకత్వం యొక్క బలం పెరగకూడదని పథకం ప్రకారం టిడిపిలోని ఒక వర్గం టిఆర్ఎస్ బలం పెరగడమే మంచిదని భావిస్తున్నది. రోగి పాలే కోరాడు. డాక్టరు పాలే చెప్పాడు. అన్నట్టుగా టిఆర్ఎస్‌కు కావలసింది కూడా ఇదే. ఇలా వెలమ రాజకీయాలు, కమ్మ రాజకీయాల మధ్య తెలంగాణ లోని టిడిపి, బిసి నాయకత్వం ఇతర

కులాల నాయకత్వం నలిగిపోతున్నది. నాశనమవుతున్నది. రాజకీయాల్లో ఆత్మహత్యలే ఉంటాయి. హత్యలుండవు అని సామెత. తెలంగాణ టిడిపి నాయకులు తిరుగుబాటు చేస్తే రెండు విధాలా టిడిపికి మేలు జరుగుతుంది. ఆంధ్ర ప్రాంతంలో టిడిపి ఎలాగూ గెలుస్తుంది. తెలంగాణలో టిడిపి తిరిగి తలెత్తుకుంటుంది. తెలంగాణలోని బిసి వర్గాలు టిడిపి వెనుక ర్యాలీ అవుతాయి. అలా రాజకీయాల పునర్‌విభజన జరుగుతుంది. తద్వారా ఆంధ్ర తెలంగాణ రెండు రాష్ట్రాల్లో టిడిపి అధికారానికి చేరువవుతుంది. అప్పుడు సిపిఐ, సిపిఎం, బిజెపి, టిఆర్ఎస్ ల మద్దతుతో లేదా అలయన్స్‌తో టిడిపి అధికారంలో భాగస్వామ్యం పంచుకుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రకటన లోగా ఈ నిర్ణయం తీసుకుంటే తెలుగుదేశం భవిష్యత్, రాష్ట్ర రాజకీయాల భవిష్యత్తు అనేక మలుపులు తీసుకుంటుంది. దీనికి సమాంతరంగా గద్దర్ మొదలైన ప్రజాస్వామిక వాదులతో సామాజిక ఉద్యమకారులు మరో రాజకీయ ఫ్రంటు ఏర్పడాలని కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఏకైక లక్ష్యంగా అన్ని పార్టీలను ఒక తాటిపైకి తెచ్చి గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్నికల్లో కలిసి కట్టుగా పోటీ చేసే ఆలోచన క్రమంగా కార్యరూపం దాలుస్తున్నది.

గ్రేటర్ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర వాదం గెలవాలని తెలంగాణ సామాజిక ఉద్యమ కారులు విభిన్న రంగాలలో విభిన్న పద్ధతుల్లో ముందుకు సాగుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మెజార్టీ కార్పొరేటర్లు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అంగీకరించే వాళ్ళే గెలిచినప్పుడు తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది. అందువల్ల తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఒక కీలక దశలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

తెలంగాణ ఉద్యమ సమీక్ష - 8

టిడిపి తీసుకోవాల్సిన గుణపాఠాలు

తెలంగాణ తల్లి పాలు తాగిన తెలుగుదేశం పార్టీ

తెలంగాణ తల్లి రుణం ఎలా తీర్చుకోనున్నది ?

తెలుగుదేశం పార్టీ మొదటి నుండి తెలంగాణ తల్లి పాలు తాగి పుట్టి పెరిగింది. 1982లో టిడిపి పుట్టినప్పుడు తెలంగాణ ప్రజలు తెలుగుదేశం పార్టీకి నీరాజనాలు పట్టారు. తెలుగుదేశం పార్టీ ఓడిపోయినప్పుడల్లా సేద తీర్చింది తెలంగాణ తల్లే. 2004 ఎన్నికల్లో టిడిపి ఘోరంగా ఓడిపోయినప్పటికీ ఒడిలో చేర్చుకొని లాలించిన తల్లి తెలంగాణ తల్లే. దేశవ్యాప్తంగా కోల్పోయిన ప్రతిష్టను టిడిపికి తిరిగి సాధించింది తెలంగాణ తల్లే.

తెలంగాణ తల్లి నేలలో తెలుగుదేశం పార్టీ నాయకులు దేవేందర్‌గౌడ్, ఎల్. రమణ, కడియం శ్రీహరి, దయాకర్ రావు, మొదలైనవారు పాదయాత్ర చేసినప్పుడు, నీళ్ళకోసం ఆరాటపడినప్పుడు వెంట నడిచింది తెలంగాణ ప్రజలే. బాబ్లీ ప్రాజెక్టు కట్టొద్దని, పుర్రెగుర్తు బీడీలమీద పెట్టొద్దని ఉద్యమాలు చేసినప్పుడు కదిలింది తెలంగాణ ప్రజలే. తెలంగాణ ప్రజల రక్త తర్పణలతో బాబ్లీ, పుర్రెగుర్తు వ్యతిరేక ఉద్యమాలు సాగాయి. ఇలా పాదయాత్రలు, బాబ్లీ, పుర్రె గుర్తు, నీళ్ళ కోసం ఆరాటాలు మొదలైన కదలికలన్నీ తెలంగాణ ప్రజల రక్త మాంసాలతోనే వారి త్యాగాలతోనే జరిగాయి. గత నవంబర్ ఉప ఎన్నికలో టిడిపి పార్టీకి ఓట్లు వేసి పరువు నిలిపింది తెలంగాణ తల్లులే. ఇలా పడిపోయిన ప్రతీసారి తెలంగాణ తల్లులే తెలుగుదేశం పార్టీని ఆదుకున్నారు. అక్కున చేర్చుకున్నారు.

అలా తెలంగాణ తల్లి పాలు తాగిన తెలుగుదేశం పార్టీ తెలంగాణ తల్లి రుణం ఎలా తీర్చుకోనున్నది ? చంద్రబాబు నాయుడు జన్మభూమి కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజతో చక్కని పాటలు రాయించారు. “కదలుదాం రండి

జన్మభూమికి... తల్లి పాల రుణం కొంత తీర్చడానికి....” అనే పాట ప్రపంచ దేశాల్లో మారుమ్రోగింది. తల్లి పాల రుణం మొత్తం తీర్చుకోవడం ప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని తల్లిపాల రుణం కొంత తీర్చడానికి తరలిరండి అని కవి స్పష్టం చేశారు. అలాంటి తెలంగాణ తల్లి పాల రుణం తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడానికి మద్ధతు ఇస్తూ కొంత మేరకైనా తీర్చుకుంటుందా? తల్లి పాలు తాగి తల్లి రొమ్ముపై గుద్దుతుందా? అనే విషయం తెలుగు దేశం పార్టీ తేల్చుకోవాల్సి ఉంది.

2004 ఎన్నికల్లో తెలంగాణలోనే టిడిపి పట్ల అభిమానం కనపరిచారు. సీట్లు ఎక్కువ ఇచ్చారు. ఇది సమైక్య రాష్ట్రం కోరి తెలంగాణ ప్రజలను నిరుద్యోగులుగా మార్చడం కోసం కాదు. తెలంగాణ నీళ్ళను మళ్ళించడం కోసం కాదు. తెలంగాణ భాషను కించపరచడం కోసం కాదు. తెలంగాణ ఉద్యోగాలను ఇతర ప్రాంతాలవారు ఆక్రమించడం కోసం కాదు. క్రమశిక్షణ గల పరిపాలనను గుర్తించడం ఒకటి, బిసిలకు టిడిపిలో కాస్త మెరుగైన అవకాశాలు ఇవ్వడం అనేది మరొక ప్రధానమైన విషయం. బిసిలకు బడుగువర్గాలకు టిడిపిలో కాస్త మెరుగైన అవకాశాలు ఇవ్వడం వల్ల ప్రజలు పార్టీ పట్ల అభిమానం చూపుతున్నారు తప్పితే సమైక్య రాష్ట్రం నినాదం కోసం కాదు. తెలుగు దేశం పార్టీ ఇలా వచ్చే ఓట్లను సమైక్య రాష్ట్రం అంగీకరించిన ఓట్లు అని వక్రీకరించడం వల్ల తెలంగాణ ప్రజలు కోపంతో తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించాలనుకుంటున్నారు. ఈ విషయం తెలుగుదేశం అగ్ర నేతలు గుర్తించడం అవసరం.

ఇవాళ తెలుగుదేశం పార్టీ కోల్పోయిన ప్రతిష్ఠను పెంచుకోవడానికి ఆంధ్ర ప్రాంత ప్రజలు కాకుండా తెలంగాణ ప్రజలే సహకరించారు. ఆంధ్ర ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ఇటీవల కదిలించిన ఉద్యమాలేవి? అక్కడ ప్రజలు ఇప్పటికీ వ్యతిరేక దృష్టితోనే ఉన్నారు. రాయలసీమ ప్రజలు రాజశేఖర్ రెడ్డి తెలంగాణ నీళ్ళను, సంపదను దోచి రాయలసీమకు మళ్ళించడం వల్ల కాంగ్రెస్ పట్ల అభిమానం పెంచుకునే అవకాశం ఉండనే ఉంది. ఇక తెలుగుదేశం పార్టీకి కమ్మ కులం వాళ్ళు తప్ప ఎవరూ ఆంధ్ర ప్రాంతంలో వెంట నిలవడానికి సిద్ధంగా లేరని ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమాలు చేయలేకపోవడమే స్పష్టం చేస్తున్నది.

ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ మాయావతి నాయకత్వంలో స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని బహుజనులు ఏ కాస్త అయినా

టిడిపి వెంట నడిచిన వాళ్ళు దాన్ని వదిలి తిరిగి బిఎస్‌పి వెంట నడిచే క్రమాలు మొదలయ్యాయి. బి.ఎస్.పి. వంటి బహుజనుల పార్టీలు గెలువకుండా ఉండడం కోసం వర్గీకరణ చిచ్చు రావణ కాష్టంలా మార్చి ఏళ్ళ తరబడి సాగదీస్తూ తెలుగుదేశం, కాంగ్రెస్ తమకు అనుకూలంగా మాల మాదిగలను రెండు వర్గాలను కూడా సమీకరించుకోగలుగుతున్నాయి. ఈ స్థితి ఎంతో కాలం ఉండదు.

అలా అగ్ర కులాలు పన్నాగాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంటారు. ఈ విషయం బహుజనులు ఉత్తరప్రదేశ్‌లో పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చాక తిరిగి కొత్తగా అధ్యయనం చేస్తున్నారు. రాబోయే రెండేళ్ళలో దళితులను చీల్చే ఈ కుట్రలకు పూర్తిగా తెరపడుతుంది. ఈ రెండు వర్గాలు కూడా ఒక్కటై తమ స్వీయ రాజకీయ అధికారం కోసం కలిసి పని చేస్తాయి.

తెలుగుదేశం పార్టీ చీలదీసి రెంటినీ కలవకుండా చేయడంలో సాధించిన విజయం ఉత్తరప్రదేశ్‌లో బహుజనులు గెలువడంతో వమ్ము కానుంది. కమ్మ కుల సంఘం తెలంగాణ ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానం ఎప్పుడో చేసింది. ఇలా సామాజిక సమీకరణలో మారుతున్న క్రమంలో తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకును అన్ని విధాలుగా కోల్పోయే క్రమం మొదలైంది. తెలంగాణ ప్రజలు తెలుగుదేశం పార్టీ వెంట ఉన్న వాళ్ళు కూడా క్రమంగా దాన్ని వదిలేస్తున్నారు. టిడిపికి రాబోయే కాలంలో నాయకులు కార్యకర్తలు తప్ప ప్రజలు వెంట ఉండే అవకాశం సన్నగిల్లుతున్నది. గద్దర్ తదితరుల ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా చిన్నా, చితక పార్టీలన్నీ ప్రంటుగా ఏర్పడి రంగంలోకి దిగుతున్నాయి.

ముందుగా తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదించడానికి, ఓడిపోయే ముందు ఆమోదించడానికి మధ్య ఎంతో తేడా ఉంది. ముందుగా ఆమోదించినప్పుడు విద్యావంతులు, మేధావులు, కళాకారులు, ప్రజలు, కార్యకర్తలు హర్షిస్తారు. చివరి నిమిషంలో తెలంగాణ రాష్ట్రాన్ని అంగీకరించడం వల్ల తెలంగాణ ద్రోహులుగా ముద్ర మాసిపోతుంది కానీ ప్రజలు నమ్మి ఓట్లు వేయడానికి ఇష్టపడరు. అవకాశవాదాన్ని ప్రజలు తిరస్కరిస్తూనే ఉన్నారు.

తెలుగుదేశం పార్టీ అది పుట్టిన నుండి తెలంగాణ తల్లి పాలు తాగి పెరిగిందే. తెలంగాణ తల్లి పాల రుణం కొంత తీర్చుకోవడానికి సిద్ధపడుతుందో, తెలంగాణ తల్లిని అవమానిస్తుందో తెలుగుదేశం పార్టీ తేల్చుకోవాల్సి ఉంది.

మాయావతి గెలుపు

తెలంగాణ రాష్ట్ర సాధనలో గొప్ప మలుపు

ఉత్తర ప్రదేశ్ భారత రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నది. ఉత్తర ప్రదేశ్ తర్వాత భారత రాజకీయాల్లో కీలక పాత్ర ఆంధ్రప్రదేశ్‌దే. 1977లో జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ అధికారం కొనసాగింది. కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆసరాతో ఇందిరాగాంధీ కేంద్రంలో తిరిగి 1980లో అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చాక జాతీయ రాజకీయాల్లో ఆంధ్రప్రదేశ్ మరింత కీలక పాత్ర పోషించింది. జనతాదళ్ ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడడానికి, 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడానికి ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రాధాన్యత చరిత్రాత్మకమైనది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో మాయావతి, బహుజన సమాజ్ పార్టీ సొంత బలంతో అధికారంలోకి రావడం ద్వారా భారత రాజకీయాల్లో ఉత్తర ప్రదేశ్‌కు తిరిగి ప్రాధాన్యత పెరిగింది.

మాయావతి గెలుపు భారత రాజకీయాల్లో ఒక మహోన్నతమైన మలుపు. ఇదొక చరిత్రాత్మక విజయం. దళితుల నాయకత్వంలో విభిన్న వర్గాలు ఒక్కటై అధికారంలోకి రావడం మాయావతి గెలుపు స్పష్టం చేస్తున్నది. భారత రాజకీయాల్లో బిసిల నాయకత్వంలో అనేక రాష్ట్రాల్లో కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడినప్పటికీ కొన్ని విజయాలు సాధించారే గాని, భారత రాజకీయాలను మలుపు తిప్పలేక పోయారు. తాము భారత రాజకీయాలకు నాయకత్వంగా నిలదొక్కుకోలేక పోయారు. అధికార వ్యామోహం, వ్యక్తిగత స్వార్థం, సిద్ధాంత రాహిత్యం, సామాజిక న్యాయ దృష్టి కొరవడడం ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు భిన్నంగా మాయావతి బిఎస్‌పి భారత రాజకీయాల్లో తన ఆరంభం నుండే కీలకమైన

పాత్ర వహిస్తూ వస్తున్నది. మేము గెలువక పోయినా ఎవరు ఓడాలో నిర్ణయించగలం అని కాన్షీరాం తొలిదశలో స్పష్టం చేసి కాంగ్రెస్‌ను ఉత్తర ప్రదేశ్ నుండి తరిమేసి చూపించారు.

వంద ఏళ్ళ పైన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ మాతో కొన్ని సీట్ల కోసం ఒప్పందం పెట్టుకోవడం మా విజయం అని కాన్షీరామ్ ప్రకటించినప్పుడు అతిశయ ప్రకటన అనుకున్నారు. కానీ దాన్ని నిజం చేశారు. ములాయంసింగ్ సమాజ్‌వాది పార్టీ, బిఎస్‌పి కలిసి ప్రభుత్వాన్ని 1994లో ఏర్పాటు చేశాయి. కాని ఒప్పందం ప్రకారం ములాయంసింగ్ యాదవ్ బిఎస్‌పిని గౌరవించకపోగా అవమానించారు. దాంతో బిఎస్‌పి బిజెపితో చేతులు కలిపింది. ఇలా బిసిల పేరు చెప్పుకుని ములాయంసింగ్ యాదవ్ బిఎస్‌పిని గౌరవించాల్సింది పోయి శత్రువుగా దూరం కొట్టడం వల్ల అగ్రవర్ణాలతో, బడా పారిశ్రామిక వేత్తలతో చేతులు కలపడం వల్ల బిసిలు ఎంతో నష్ట పోయారు. చంద్రభాను ప్రసాద్ వంటి జర్నలిస్టులు కాన్షీరామ్ చెప్పిన బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ ఐక్య సంఘటన ఫార్ములాకు భిన్నంగా ఇందులోంచి బిసిలను తొలగించి అగ్రవర్ణాలను చేర్చుకుని కొత్త ఫార్ములాను ప్రచారం చేశారు. ఈ కొత్త ఫార్ములా ద్వారా బిఎస్‌పి ఇప్పుడు సంపూర్ణ మెజార్టీతో ఉత్తర ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చింది.

చరిత్రలో బిసిలకు జరిగిన నష్టం – బిసి మేధావులు చేసిన పొరపాటు

ములాయం సింగ్ యాదవ్ బిసి నాయకుడని సమర్థించుకుంటూ బిసిలు బిసి సమాజానికి చేసిన నష్టం భారత రాజకీయాలలో బిసిలను తిరిగి వెనక్కి నెట్టేదిగా మలుపు తిరిగింది. ములాయం సింగ్ యాదవ్‌ను ఆనాడే నిలదీసి మధ్యవర్తిత్వం వహించి బీసీ వర్గాలు బిఎస్‌పి, ఎస్‌పి పార్టీల మధ్య సమన్వయం అవగాహన పెంపొందించి ఉంటే భారత రాజకీయాలు ఇలా ఉండేవి కావు. జాతీయ ఉద్యమ కాలంలో అంబేద్కర్ నాయకత్వాన్ని చిన్న చూపు చూసి అగ్రవర్ణాల పంచన చేరిన బిసి నాయకత్వం తద్వారా గత 70 ఏళ్ళుగా చట్టసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో, బడ్జెట్లలో తమ వాటాని రిజర్వేషన్లను కోల్పోయారు. ఇప్పటికీ ఆ నష్టం పూరించబడలేదు.

ములాయం సింగ్ యాదవ్ ముఖ్యమంత్రి కావడం కోసం బిసి మేధావులు నాయకులు తిరిగి జాతీయ ఉద్యమంలో చేసిన పొరపాటునే మళ్ళీ చేశారు. తద్వారా బిఎస్‌పి బిసిలను స్థానంలో అగ్రవర్ణాలను చేర్చుకుని ఫార్ములా మార్చి

విజయం సాధించింది. బిసిలు ఎప్పుడూ ఎస్సీలను చిన్న చూపు చూస్తూ అగ్రకులాల పంచన అనుచరులుగా చేరి నాయకులమైపోయామని విర్రవీగుతుంటారు: సొంత బలం లేని బిసిలు, సొంత బలం ఉన్న బిసిలు కూడా బిసి ప్రజల ఆకాంక్షలను అగ్రకులాలకు తాకట్టు పెడుతున్నారు. తెలుగు దేశం పార్టీలోని బిసిలు, కాంగ్రెస్‌లోని బిసిలు, టిఆర్ఎస్‌లోని బిసిలు రాష్ట్రంలో ఇదే పని చేస్తున్నారు.

బిఎస్‌పి ఎదిగితే మంచిదేనని బిసి నాయకులు కోరుతున్నది నిజమే. కానీ వాళ్ళు బిఎస్‌పి ఎదిగితే తామున్న పార్టీలలో బేరం చేసే శక్తి పెంచుకోవచ్చుననే స్వార్థం తప్ప బిఎస్‌పికి మద్దతు ఇవ్వాలని బిఎస్‌పిలో చేరాలని బిఎస్‌పిని బలోపేతం చేయాలని వారు భావించడం లేదు. కె. కేశవరావు మొదలుకొని టి. దేవేందర్ గౌడ్ దాకా అందరూ ఇలాంటివారే. అయితే బిసిల మద్దతు లేకుండా బిఎస్‌పి ఎలా మద్దతు పుంజుకుంటుంది? ఉత్తర ప్రదేశ్‌లో లాగా బిఎస్‌పి రాష్ట్రంలో కూడా అగ్ర కులాలకు ప్రాధాన్యత ఇచ్చి ముందుకు సాగాలనుకుంటే బిసి రాజకీయాలు ఏమౌతాయి? ఉత్తర ప్రదేశ్‌లో లాగా ఇక్కడ ములాయంసింగ్ వంటి సొంత పార్టీతో సొంత నాయకులుగా ఎదిగిన నాయకులు బిసిల్లో ఎవరూ లేరు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఆ అవకాశం ఇచ్చినప్పటికీ తెలంగాణలోని బిసి నాయకులు ఈ చారిత్రక అవకాశాన్ని చేజేతులారా కాలదన్నుకున్నారు. వాళ్ళు కాంగ్రెస్‌లో బిజెపిలో, తెలుగుదేశంలో, టిఆర్ఎస్‌లో తమ అదృష్టాన్ని, రెండవ స్థానాన్ని, మూడవ స్థానాన్ని వెతుక్కునే ప్రయత్నంలో కొనసాగుతున్నారు. వీరి బతుకు కేసిఆర్ అన్నట్టు బండి కింది కుక్క లాగా కొనసాగుతున్నది. బండి కింద నడిచే కుక్క బండిని నడిపే యజమాని విసిరేసే బొక్కలను తింటూ బండిని నేనే నడుపుతున్నానని అనుకుంటుందట! అగ్ర కులాల్లోని బిసి నాయకత్వం ఇలాంటి భ్రమల నుండి బయట పడడం లేదు. వాళ్ళ మరణ శాసనాన్ని వాళ్ళు రాసుకుంటే అభ్యంతరం లేదు. కానీ అది బిసిల సామాజిక రాజకీయ అభివృద్ధికి మరణ శాసనంగా పరిణమించడం ఘోరం.

రాష్ట్రంలో 13ఏళ్ళ తర్వాత బిఎస్‌పికి కలిగిన కొత్త అవకాశాలు

అందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో బిఎస్‌పి పార్టీకి 13 ఏళ్ళ తరువాత తిరిగి ఒక కొత్త ఉత్తేజం కలిగింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని బిఎస్‌పి తన నాయకత్వంలో ముందుకు తీసుకొని పోతూ అన్ని కులాలతో, అన్ని పార్టీలతో కలసి పనిచేస్తూ తెలంగాణ రాష్ట్ర సాధన ఐక్య ఫ్రంట్‌కు నాయకత్వం వహించాలి. అందుకు

పూనుకోవాలి. ఆ ఒప్పందం పై తెలంగాణలోని బిసి నాయకులు ఇతర నాయకులు బిఎస్పితో జత కట్టి తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడం ద్వారా బహుజన సమాజ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజకీయ చారిత్రక పరిణామాల్లో గెలుపు వైపు సాగడం సాధ్యపడుతుంది.

తెలంగాణ రాష్ట్రం కోరుతున్న వ్యక్తులు, శక్తులు, ప్రజాస్వామిక వాదులు బిఎస్పి రాష్ట్ర నాయకత్వం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అంకితమై కృషి చేయాలని అందుకు తామంతా సహకరిస్తామని డిమాండ్ చేసి బిఎస్పిని ఉద్యమ పార్టీగా అందరూ కలిసి నడిచే పార్టీగా మార్చవలసి ఉన్నది.

ఉత్తర ప్రదేశ్ ప్రయోగాన్ని రాష్ట్రంలో కాస్త సవరించుకోవాలి

ఉత్తర ప్రదేశ్ ప్రయోగం ఆంధ్రప్రదేశ్‌లో అవసరమా? ఆంధ్రప్రదేశ్ పరిస్థితులననుసరించి దాన్ని మార్చుకోవాలి. ఉత్తర ప్రదేశ్ పరిస్థితులు ఇక్కడ లేవు. అగ్ర వర్ణాలను బిఎస్పిలో ఇక్కడ చేర్చుకో నవసరం లేదు. ఒక వేళ ఉంటే బిసిలను, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులను పూర్తిగా చేర్చుకున్న తర్వాత ఉండే ఖాళీలో అగ్రకులాలల్లోని కులతత్వంలేని సెక్యులరిస్టులకు, ప్రజాస్వామిక వాదులకు చోటు ఇవ్వడం అవసరం. ఈ పని చేయకుండా బిఎస్పి అగ్రకులాలకే పెద్ద పీట వేస్తే ఆంధ్రప్రదేశ్‌లో ములాయం వంటి వ్యతిరేకులు లేకున్నా తనకు తానే బిసిల్లో సృష్టించుకున్నట్టుగా అవుతుంది. అది బిఎస్పి అధికారానికి చేరువ కాకుండా అడ్డుకుంటుంది.

రాష్ట్ర బిఎస్పి నాయకత్వం, సామాజిక రాజకీయ సైద్ధాంతిక రంగాల్లో, అవగాహనల్లో, రాజకీయ వ్యూహం ఎత్తుగడల్లో తనకు తాను స్వయంగా ఎదగాలి. మాయావతి కడుపు నిండితే రాష్ట్ర బిఎస్పి ఆకలి తీరినట్టు కాదు. రాష్ట్ర బిఎస్పి తనకు తాను ఆహారాన్ని సంపాదించుకోవాలి. కడుపు నింపుకోవాలి. తన బలం తాను పెంచుకోవాలి. ప్రజల్లోకి విస్తరించాలి.

ఇతరుల మీద, ఇతర రాష్ట్రాల మీద ఆధారపడి గెలవాలనుకునే అనుచర మనస్తత్వాన్ని వదులు కోవాలి. కొందరు రష్యాను, చైనాను, కొందరు అమెరికాను, కొందరు కాంగ్రెస్‌ను, కొందరు టిడిపిని, కొందరు ఉత్తర ప్రదేశ్‌ను అనుసరించి నట్టుగా రాష్ట్రంలోని బిఎస్పి అదే క్రమాన్ని అనుసరిస్తే తిరిగి యధా స్థానంలోనే ఉండి పోతుంది. మూడు సార్లు ఉత్తర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి అయినా ఆంధ్రప్రదేశ్‌లో బిఎస్పి ఎందుకు గెలువ లేదో అదే తిరిగి కొనసాగుతుంది.

రాష్ట్రంలో బిసిలను, సెక్యులర్, ప్రజాస్వామిక శక్తులను కలుపుకోవాలి

అందువల్ల ఉత్తర ప్రదేశ్ ఉత్తేజం ఉండాలి కానీ, ఉత్తర ప్రదేశ్ ప్రయోగం ఆంధ్రప్రదేశ్ లో యథాతథంగా ఉండాలనేదేమీ లేదు. ఎస్సి, బిసి ఎస్టి, మైనార్టీలతో పాటు సెక్యులర్ ప్రజాస్వామిక శక్తులను కలుపుకొని బలోపేతం కావడం ఇక్కడి అవసరం. తద్వారా మనువాదులతో చేతులు కలిపారనే మాటకు ఆస్కారంలేకుండా పోతుంది. టిఆర్ఎస్‌లోని వెలమ రాజకీయ నాయకత్వంపై అందరూ అసంతృప్తితో ఉన్నారు.

కాంగ్రెస్, తెలుగు దేశంలలోని అగ్ర కుల నాయకత్వంపై అందరూ ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఆగ్రహాన్ని బిఎస్పి తన రాజకీయ చైతన్యంతో, రాజకీయ చతురతతో, తన గెలుపుగా మార్చుకుంటుందా? లేదా? అనేది భవిష్యత్ నిర్ణయిస్తుంది. జాతీయ రాజకీయాల్లో సోనియా గాంధీ వంటి స్థానానికి మాయావతి ఎదగాలని అనుకుంటున్నారు కనుక అనేక విషయాల్లో కాంగ్రెస్ లాగా, బిజెపి లాగా ఫ్రంటుల ఏర్పాటులలో, ఉద్యమాల నిర్మాణాలలో విస్తరణ ఇంకా ఎంతో అవసరం.

మాయావతి విజయం అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేరి రాజ్యాంగాన్ని రాసిన రోజులను గుర్తుకు తెస్తున్నది

మాయావతి విజయం అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేరి రాజ్యాంగాన్ని రాసిన నాటి రోజులను గుర్తుకు తెస్తున్నది. భారత దేశంలోని బహుజనులకు ఒక ఆశాజ్యోతిని అందిస్తున్నది. జాతీయ రాజకీయాల్లో బహుజనులు నిర్వహించబోయే పాత్ర మహత్తరమైనదని గొప్ప ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నది. ఇది యాభై ఏళ్ళ భారతీయ చరిత్రలో ఒక మహోన్నతమైన మలుపు.

భారత రాజకీయాలు ఓట్ల ద్వారా శాంతియుత పద్ధతుల్లో బహుజనులకు అనువుగా వారి అధికార భాగస్వామ్యం కోసం ఇక నుండి ముందుకు సాగడం ఎంతో దూరంలో లేదు అని బిఎస్పి గెలుపు స్పష్టం చేస్తున్నది.

ప్రాంతీయ పార్టీలతో ఇక నుండి బిఎస్పి నాయకత్వంలో మూడవ ఫ్రంట్ ఏర్పడాల్సిన చారిత్రక దశ ఆసన్నమైంది. బహుజన సిద్ధాంత కర్తలు, మేధావులు, నాయకులు ఈ వైపుగా దృష్టి సారించి బిజెపి కాంగ్రెస్‌ల నాయకత్వంలోని ఫ్రంటుల స్థానంలో మూడవ ఫ్రంటు రెండవ జాతీయ పార్టీగా ఎదుగుతున్న బిఎస్పి కర్తవ్యాలను విస్తరించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఎస్‌పి చిత్తశుద్ధితో కృషి చేయాలి

ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బిఎస్‌పి చిత్తశుద్ధితో కృషి చేయాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేస్తున్న అన్ని శక్తులను, అన్ని పార్టీలను తన నాయకత్వంలో ఫ్రంటుగా ఏర్పర్చి ముందుకు సాగాలి. రాబోయే సినిమా తారల పార్టీని కూడా బిఎస్‌పిలో విలీనం చేసుకోగలగాలి. ఇందుకు అన్ని వైపుల నుండి కృషి జరగాలి. తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేసే సామాజిక ఉద్యమకారులు, కళాకారులు, బి.ఎస్.పికి పూర్తి సహకారాన్ని అందిస్తారనే విషయం తద్వారా బిఎస్‌పి రాజకీయాలకు ఒక గొప్ప మలుపును ఇస్తుంది అనే విషయం మర్చిపోకూడదు.

బాల కార్మికులు – విద్య

ఆధునిక విద్యా వ్యవస్థ ఏర్పడి 200 ఏళ్ళవుతున్నది. అంతకు ముందు అందరూ ఎదిగే క్రమంలో పని చేసుకుంటూనే బతికారు. అక్షరాస్యత అవసరం లేకుండానే నైపుణ్యంతో అనేక సంపదలు సృష్టించారు. ఇప్పుడు అక్షరాస్యతకు నైపుణ్యానికి సంబంధం ఏర్పడింది. అయితే నేటి విద్యా విధానం మొదటి 12 ఏళ్ళు విద్యార్థుల్లో ఏ ఉత్పత్తి నైపుణ్యాలను నేర్పుతున్నది? అనేది ఒక ప్రశ్న.

ఈ ఆధునిక విద్య అందుకోవడానికి ఎన్ని సంవత్సరాలు వృధా చేయాలి? ఈ విద్య ప్రజల రోజువారీ జీవితానికి ఏ మేరకు పనికి వస్తుంది? అక్షరాస్యతే విద్యా? పాఠ్యాంశాలు ఉన్నత విద్యను అందుకోవడానికి వేసే పునాదులే తప్ప జీవితంలో నైపుణ్యాలు సాధించుకొని జీవికను సంపాదించుకోవడానికి పనికి వచ్చే విధంగా వున్నాయా?

నేటి విద్యా విధానం అందరికీ ఉపాధి కల్పిస్తుందా? ఉపాధి కల్పించకుండా 12ఏళ్ళు చదువు పేరిట వృధా చేయటం దేనికి అని పేద తల్లిదండ్రుల సూటి ప్రశ్న. ఈ ప్రశ్నకు ఆధునిక విద్యా వేత్తల వద్ద జవాబు వుందా? పూర్వం రాజులు, మంత్రులు తమ పిల్లలను కొందరు గురువులకు అప్పగించేవారు. గురుసుశ్రూశ చేసి 12 సంవత్సరాలు విలువిద్య, కత్తివిద్య, పరిపాలనా పద్ధతులు నేర్చుకొని తిరిగి వచ్చేవాళ్ళు. వచ్చాక యువరాజుగా, యువ మంత్రిగా పట్టాభిషేకం చేసేవారు. పట్టాభిషేకానికి ముందు ఒక ఆరునెలలు దేశం తిరిగి తెలుసుకోవాలని పంపించేవారు. అలా 12 ఏళ్ళలో పరిపాలనా దక్షులుగా, రాజ్యాధినేతలుగా సమర్థులయ్యే విధంగా విద్య నేర్పారు. ఇప్పుడు అలా ఎందుకు జరగడం లేదు? పాఠ్యాంశాలు ప్రజలకోసమా? సైన్స్ టెక్నాలజీ అభివృద్ధి చెందించే నిపుణుల కోసమా?నేటి ఉన్నత విద్యా విధానం రెండవదానికోసమే అన్నట్టుగా పాఠ్యాంశాలు కొనసాగుతున్నాయి. అందువల్ల అవి పారిశ్రామిక వేత్తల అవసరాలను కొంత

తీరుస్తున్నవి. తానే ఈ విద్యను ప్రవేశపెట్టింది కనుక ప్రభుత్వం ఆ అర్హతలననుసరించే ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. నిజానికి ఈ ఉద్యోగాలకు ఆ అర్హతలకు సంబంధం లేదు. డిగ్రీ చదివిన వాళ్ళకు ఏదో ఉద్యోగం ఇస్తే ఆ ఉద్యోగం ఆ చదువుకు సంబంధించింది కానే కాదు. బ్యాంకుల్లో, ఇన్సురెన్స్ కంపెనీల్లో ఇచ్చే ఉద్యోగాలకు, చదివే డిగ్రీలకు ఏ సంబంధం లేదు. ఉద్యోగాలు ఇస్తున్నారు కనుక ఆ పాఠ్యాంశాల వల్ల ఉద్యోగాలు లభించినట్టా? ఏదో చదువు చెప్పాం కాబట్టి అదే అర్హతగా నియమించకపోతే ఎలా అని నిర్ణయించిన అర్హతలే తప్ప ప్రభుత్వ ఉద్యోగాలకు, నేటి చదువులకు పెద్దగా సంబంధం లేదు.

జీవించడానికి ఉపయోగపడే చదువు అయితే తల్లిదండ్రులు ఎందుకు చదివించరు? జీవించడానికి ఈ చదువు ఉపయోగపడితే పోటీపడి చదివిస్తారు. ఈ చదువు బతుకు నేర్పదు. అక్షరాస్యత నేర్పుతుంది. పదవ తరగతిలో హిందీ, ఇంగ్లీషు, తెలుగు, సాంఘిక, సామాన్య, గణితం బోధిస్తారు. వీటిల్లో ఫేలయితే చదువు ఆపివేయాల్సిందే. ఈ పదవ తరగతిలో నేర్పే హిందీ, ఇంగ్లీషు చదువు అయిపోయిన తరువాత ఎంత మంది వాడుతున్నారు? గణితం ఎంత మందికి అవసరమవుతున్నది? సామాన్యశాస్త్రం ఎంతమేరకు అవసరమవుతున్నది? ఇవి ఫేలయితే ఉన్నత విద్యకు గేట్లు మూసివేస్తున్నారు. కనుక ఇవి జీవితానికి అవసరమా? అని ఏ మేరకు అవసరమవుతున్నాయి? అని తెలుసుకోవడం అవసరం. చర్చించడం అవసరం.

అలా అని చదువుకోవొద్దు అని చెప్పడం లేదు. చదువు పేరిట 12 సంవత్సరాల బాల్యాన్ని వృధా చేస్తున్నారు. ఇలా వృధా చేయడానికి పేదలు తమ కష్టార్జితాన్ని దారపోయాలా? 12ఏళ్ళలో యువరాజుగా, యువ మంత్రిగా ఎదగగల్గినప్పుడు ఇప్పుడు అలా సమర్థులుగా ఎదిగించడం ఎందుకు చేయడం లేదు? 10వ తరగతి చదివిన ప్రతి ఒక్కరూ రాజకీయాలంటే ఏమిటి? ఈ జీవితం అంటే ఏమిటి? సామాజిక సమస్యలంటే ఏమిటి? ప్రజలు ఎలా బ్రతుకుతున్నారు? మంచిజీవితం జీవించాలంటే ఏం చేయాలి? ఎలాంటి వృత్తులు ఇప్పుడు సమాజానికి అవసరం? ఏ వృత్తి తన అభిరుచికి సరిపడుతుందో ఎలా గుర్తించడం, దేనికి ఎంత పెట్టుబడి, నైపుణ్యం అవసరమో ముడి సరుకులు ఎలా సేకరించాలో, అమ్మకాలు ఎలా చేయాలో, పంటలు ఎలా పండించాలో మొదలైనవి అయినా కనీసం నేర్పకుండా ఈ చదువు చదవాలి అని కోరడం

పేదలను నిర్బంధ విద్య పేరిట నిర్బంధ జైలుగా స్కూళ్ళను మార్చడం కాక మరేమిటి అనేది అసలు ప్రశ్న.

ఈ ప్రశ్నలకు జవాబులు వెతక్కుండా పరిష్కారాలు కనుక్కోకుండా బాల కార్మికులు అంటూ పిల్లలు పని చేసుకొని బతకడాన్ని ఈసడిస్తే ఎలా? అమ్మపెట్టదు అడుక్క తిననివ్వదు అని అన్నట్లు సమాజం, ప్రభుత్వం పెట్టదు, పని చేసుకొని బతకనివ్వదు. ఇలా ప్రజలను, బాల్యాన్ని బలిపశువులుగా మార్చడం సరియైనది కాదు.

క్రీస్తు శకం 1810 దాకా ఈ దేశంలో ఉత్పత్తి నైపుణ్యం కొప్పది. దీనికి కారణం పిల్లలు చిన్నప్పటినుంచే తల్లిదండ్రులను చూసి నేర్చుకోవడం. ఇలా ప్రపంచంలో అందరికన్నా నైపుణ్యంగల కార్మికులుగా, నిపుణులుగా సూద్రులు, అతిసూద్రులు ఎదగడానికి కులవృత్తులకు పిల్లలు పనిచేయడానికి మధ్య సంబంధం ఉంది. అనుభవంతో పనిచేసి ప్రమోషన్ మీద వస్తే ఫోర్‌మెన్ అంటున్నారు. చదువుకొని వస్తే ఇంజనీర్ అంటున్నారు. మునుపు ఫోర్‌మెన్ ఇంజనీర్ ఒక్కరే.

అనుభవంతో లక్షలాది మంది డ్రైవర్లుగా, మెకానిక్‌లుగా, మేస్త్రీలుగా, ఎలక్ట్రీషియన్లుగా, పనిచేస్తున్నారు. వీరికి ఆధునిక విద్య నేర్పిందేమీ వారి వృత్తిలో పనికి రాలేదు. దాని అవసరం లేకుండానే ఎదిగారు. కోట్లాది మంది రైతు కూలీలు స్త్రీలు వ్యవసాయం, వంటపని, ఇంటిపని ఈ ఆధునిక విద్యతో పని లేకుండానే నిపుణులుగా పనిచేస్తున్నారు. చివరకు కుటుంబం, భార్యాభర్తలు కలిసి ఎలా జీవించాలో కూడా ఈ పాఠ్యాంశాల్లో లేవు. అందువల్ల అనుభవం మీద నేర్చుకుంటున్నారు. చూసి నేర్చుకుంటున్నారు. ప్రపంచంలో నూటికి 90శాతం చూసి నేర్చుకుంటున్నారు.

అందువల్ల బాల కార్మికులపట్ల సానుభూతి ఎంతో అవసరమైనప్పటికీ పేదలైన తల్లిదండ్రుల జీవన ప్రమాణాలు పెరగకుండా పిల్లల్ని చదివించడం సాధ్యం కాదు. చదివించినా అది జీవితానికి గాని, జీవితాన్ని గెల్చుకోవడానికి గాని పనికిరావడం లేదు. బాల్యంలో పని చేయడం బాల్యాన్ని కాలరాయడమే అనే మాట నిజమే. అయితే ఆట పాటల్లాగా పని అనేది ఆనందంగా ఉంటే భారం కాదు. తల్లిదండ్రులు చేసే పని చూస్తూ, తామూ చేయాలని పిల్లలు ఉత్సాహపడుతుంటారు. ఇందులో భారమేమీ లేదు. ఇంటిపని, వృత్తిపని పొలంపని

మొదలైన వాటిల్లో పిల్లలు చిన్నప్పటినుంచి పనిచేస్తుంటారు. బరువు పనులు చేయడం అనారోగ్యకరమైన పరిస్థితుల్లో పనిచేయడం పిల్లల ఎదుగుదలకు నష్టం.

అందువల్ల పిల్లలను స్వచ్ఛందంగా పనిచేసే విధంగా పనులుండాలి. పని చేస్తూ చదువుకొనే పార్ట్ టైం విద్యా విధానం ఉండాలి. లేదా వారానికి 3 రోజులు చదువు 3 రోజులు పని, ఒక రోజు సెలవు అనే విధంగా విద్యా విధానం ఉండాలి. స్కూలు రెండు షిఫ్టులలో పని చేయాలి. టీచర్లు ఫుల్‌టైం చేయాలి. ఒక షిఫ్టులో చదువుకున్న విద్యార్థులు మరో షిఫ్టులో పని కోసం వెల్తారు. ఉదయం బడికి పోయినవాళ్ళు మధ్యాహ్నం పనికి పోతారు. ఉదయం పనికి పోయినవాళ్ళు మధ్యాహ్నం బడికి పోతారు. వాళ్ళు పని చేసుకొని బతికే జీవన విధానానికి సంబంధించిన పాఠ్యాంశాలు కనీసం ప్రతి క్లాసులో 50శాతం మేరకు అయినా ఉండాలి. ఊరు, వాడ - పల్లె, పట్నం పాఠ్యాంశాల ద్వారా పిల్లలు తెలుసుకునే విధంగా ఉండాలి. అప్పుడే ఏ దశలో చదువు ఆగిపోయినా కనీసం అనేక వృత్తులు, వ్యాపారాలు, ఊరూ-వాడ, సమాజం తెలిసి తనకు తనను బతకగలుగుతారు.

తేది : 24-5-2007

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానం చేయాలని

తెలుగుదేశం పార్టీకి తెలంగాణ రచయితల, కళాకారుల, మేధావుల విజ్ఞప్తి

(టిడిపి తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదిస్తూ తీర్మానం చేస్తే తెలంగాణ రాష్ట్ర సాధనకు మార్గం సుళువవుతుంది. అందువల్ల రాజకీయ తెలుగుదేశం పార్టీని తెలంగాణ రాష్ట్రం కోసం డిమాండ్ చేయడం, మార్చడం అవసరం. తిరుపతిలో 2007, మే 28, 29న జరిగిన టిడిపి మహానాడు సభల్లో ఈ తీర్మానం చేయాలని పంపిన లేఖ ప్రతి ఇది. టిడిపి బహిరంగంగా జవాబు ఇవ్వలేదు. - బిఎస్)

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదిస్తూ తీర్మానం చేయాలని తెలుగుదేశం పార్టీకి తెలంగాణ మేధావులు, కళాకారులు, విద్యావంతులు, జర్నలిస్టులు అయిన మేము తెలంగాణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాము. 2007 మే నెలలో తిరుపతిలో జరిగే మహానాడులో ఈ తీర్మానం చేసి తెలంగాణ ప్రజల్లో తెలుగుదేశం పార్టీ తిరిగి ప్రజాభిమానాన్ని పొందవచ్చునని మనవి చేస్తున్నాము.

గుడ్డివాడికి కావలసింది రెండు కళ్ళు. తెలంగాణా ప్రజలకు కావల్సింది ప్రత్యేక రాష్ట్రం. అన్ని పార్టీలు తెలంగాణ రాష్ట్రం ఆమోదిస్తూ తీర్మానిస్తే ఆయా పార్టీలన్నీ చరితార్థమవుతాయి. తెలుగుదేశంపార్టీ అధికారంలో లేకపోయినప్పటికి అది నిర్వహిస్తున్న పాత్ర కీలకమైనది.

స్వాతంత్ర్యం రాక పూర్వం హైదరాబాద్ రాజ్యం ప్రత్యేక దేశంగా కొనసాగింది. 50 దేశాల్లో హైదరాబాద్ రాజ్యానికి విదేశీ రాయబారులు ఉండేవారు. కాశ్మీర్, హైదరాబాద్ రాజ్యాలను పాలకులను లొంగదీసుకొని, పాలకులతో ఒప్పందాలు చేసుకొని బలవంతంగా భారతదేశంలో విలీనం చేశారు. కాశ్మీర్ దేశ సరిహద్దుల్లో ఉండడం వల్ల అంతర్జాతీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యాన్ని బలవంతంగా భారత యూనియన్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ నైజాం రాజు ఐక్యరాజ్య సమితిలో వేసిన పిటిషన్ 1970 దాకా ఎజెండాలో కొనసాగుతూ వచ్చింది. చాలా విచిత్రంగా 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలయ్యాక కాశ్మీర్ లాగా అంతర్జాతీయ ప్రాధాన్యత సంతరించుకుంటుందని భయపడి ఎవరో ఐక్యరాజ్య సమితిలో 1970 నుండి ఎజెండాకు రాకుండా చేశారు.

హైదరాబాద్ రాజ్యం ప్రత్యేక దేశంగా అస్థిత్వం కోల్పోయి భారత యూనియన్‌లో 17-9-1948 నుండి హైదరాబాద్ రాష్ట్రంగా కొనసాగింది. అందులో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలు కూడా కలిసి ఉండేవి. దేశంలోని 560 సంస్థానాల్లో హైదరాబాద్ రాజ్యమే అతిపెద్దది. ప్రపంచంలో 3వ సంపన్న రాజ్యంగా హైదరాబాద్ రాజ్యం అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. అలాంటి హైదరాబాద్ రాజ్యం భారత యూనియన్ దురాక్రమణకు గురైన తరువాత కనీసం ఒక రాష్ట్రంగా కూడా స్వతంత్ర్య అస్థిత్వం లేకుండా కుట్ర చేయబడింది.

కొందరి స్వార్థం కోసం హైదరాబాద్ రాష్ట్రం విడగొట్టబడి కనీసం తెలంగాణ ప్రాంతమైనా ప్రత్యేక రాష్ట్రంగా కొనసాగకుండా ఇక్కడి సిరి సంపదలను చూసి పేదరికంలో మగ్గుతున్న ఆంధ్ర ప్రాంతం 1953లో ప్రత్యేక రాష్ట్రంగా మద్రాసు నుండి విడిపోయి ఏర్పడ్డాక ఏర్పడిన ఆర్థిక దుస్థితిలో బంగారు బాతు వంటి తెలంగాణపై వారి దృష్టి మళ్ళింది. దాంతో సెంటిమెంట్స్‌ను ప్రచారం చేసి తెలంగాణ ఆంధ్ర ప్రాంతాలను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ ఏర్పరిచారు. అప్పటి నుండి కాంగ్రెస్ తెలుగు దేశం పార్టీలే రాష్ట్రాన్ని ఏలుతూ వచ్చాయి. తెలంగాణకు జరిగిన అన్యాయాల్లో తెలంగాణాను అణిచివేయడంలో, దోపిడి చేయడంలో కాంగ్రెస్‌తో పాటు తెలుగుదేశం పార్టీ పాత్ర కూడా ప్రధానమైనది. వీటన్నిటిని తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదిస్తే తెలంగాణ ప్రజలు క్షమించడానికి సిద్ధంగా ఉన్నారని 2004లో కాంగ్రెస్ తిరిగి టిఆర్ఎస్ మద్ధతుతో గెలుపొందడం ద్వారా రుజువవుతున్నది.

ఈ రెండు పార్టీలు ఆంధ్ర ప్రాంత శాసన సభ్యులు ఎక్కువ సంఖ్యలో ఉండడం వల్ల వారికి అనుకూలంగా తెలంగాణ సంపదను నీళ్ళను ఉద్యోగాలను ఆంధ్రప్రాంతం వాళ్ళు కైవసం చేసుకున్నారు. ప్రపంచంలో మూడవ సంపన్న రాజ్యంగా ఉన్న తెలంగాణ 60 ఏళ్ళలో అతి పేద ప్రాంతంగా మారిపోవడానికి ఆంధ్రప్రాంత వలస దోపిడి ప్రధాన కారణమని ప్రజలు పూర్తిగా విశ్వసిస్తున్నారు.

అనుమానాలతో కలిసి సంసారాలు చేయడం తగని పని. ఉమ్మడి కుటుంబాలు విడిపోయి వ్యక్తి కుటుంబాలుగా ఏర్పడుతున్నాయి. తెలంగాణ ఆంధ్ర విడిపోయి రెండు రాష్ట్రాలు ఏర్పడడం వల్ల ఆంధ్ర ప్రాంత ప్రజలకు జరిగే నష్టం ఏమీ లేదు. అనుమానాలు పోయి ప్రేమ పూరితంగా బెంగుళూరు, చెన్నై, ఢిల్లీ, కోల్‌కటా, ముంబాయి నగరాల్లో తెలుగు వాళ్ళు ఇతర భాషా ప్రజలు స్నేహ పూరితంగా కలిసి జీవించినట్టుగా జీవిస్తారు.

ఇండియా పాకిస్థాన్ మధ్య ఇనుప కంచె పడ్డట్టుగా తెలంగాణ ఆంధ్ర మధ్య ఇనుప కంచె ఏమీ పడదు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల సెక్రటేరియట్‌లు, శాసన సభలు ప్రత్యేకంగా ఏర్పడి స్వతంత్రంగా తమ తమ ప్రాంతాల్లో పరిపాలన సాగిస్తాయి. ఇంతకు మించి జరిగేదేమీ లేదు.

ఆంధ్ర ప్రాంత ప్రజలు హైదరాబాద్‌లో కూడా కలిసి ఇప్పటిలాగే సహజీవనం

చేయవచ్చు. వారికి మేము తెలంగాణ రాష్ట్రంలో పూర్తి భద్రతను కల్పిస్తామని హామీ ఇస్తున్నాము. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమోదించకుండా చరిత్రలో తెలుగు దేశం పార్టీ తెలంగాణ ప్రజల ద్రోహిగా నిలిచిపోదలుచుకున్నదా? తెలంగాణ ప్రజల విశ్వాసం చూరగొన దల్చుకున్నదా? మీ చేతుల్లోనే ఉంది.

ఇటీవల బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలిపివేయాలని, బీడికట్టలపై పుర్రె గుర్తు తొలగించాలని, గోదావరి, కృష్ణ నదుల నీళ్ళు తెలంగాణ అవసరాలను తీర్చే ప్రాజెక్టులు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ ఉద్యమించడం హర్షదాయకం. ఇలా ప్రజల సమస్యలను పట్టించుకుంటున్న తెలుగుదేశం పార్టీ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ఆమోదిస్తూ అందుకు తనవంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

కొందరు తెలంగాణ రాష్ట్ర సమస్యను రాజకీయ లక్ష్యాలకు సాధనంగా భావిస్తున్నారు. కాని తెలంగాణ ప్రజలు తెలంగాణ రాష్ట్ర సమస్యను రాజకీయాల్లో పావుగా మార్చడం పట్ల ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ ప్రజలు అలాగే ఆంధ్ర ప్రజలు తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా ముందుకు సాగే సామాజిక ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం విస్తరించాలని దానికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరుకుంటున్నారు.

ఆయా పార్టీల రాజకీయ అధికార సాధనకు కాకుండా తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక లక్ష్యంగా పార్టీలన్నీ కలిసి పని చేయాలని మేము కోరుతున్నాము. ప్రజాకవి గద్దర్, సామాజిక తత్వవేత్త బి.ఎస్. రాములు ప్రజల నాడి పట్టుకుని ప్రజల తరపున తెలంగాణ రాష్ట్ర సాధన ఏకైక నినాదంగా, ఏకైక లక్ష్యంగా ఒక ఫ్రంటు ఏర్పడాలని గత కొన్ని నెలలుగా బలంగా ముందుకు వస్తున్నారు. మీరు కూడా తెలుగుదేశం పార్టీ మొత్తం కూడా అన్ని స్థాయిల్లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడానికి స్వయంగా గానీ, మాతో కలిసిగానీ, ఉద్యమించవలసిందిగా కోరుతున్నాము. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యం కోసం మీతో కూడా కలిసి పని చేయడానికి మాలో ఎందరో సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ ప్రజలు కూడా లక్షలాదిగా సిద్ధంగా ఉన్నారని మనవి చేస్తున్నాము.

తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆమోదిస్తే తెలంగాణ రాష్ట్రం పేరు చెప్పుకొని ఓట్లు అడిగే రాజకీయాలకు తెరపడుతుంది. తద్వారా అన్ని పార్టీలు తమ తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇలా తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు తీర్మానిస్తే తెలంగాణలో తిరిగి బలం పుంజుకుంటుంది. టిడిపిలోని తెలంగాణ నాయకుల, కార్యకర్తల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

తద్వారా కాంగ్రెస్‌ను తెలంగాణలోను, ఆంధ్ర ప్రాంతంలోను పూర్తిగా వెనక్కి నెట్టి టిడిపి, టిఆర్ఎస్ పార్టీలు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతంలో బలపడి ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి పరస్పరం సహకరించుకోవచ్చు. తద్వారా టిడిపికి ఆజన్మ శత్రువు అయిన కాంగ్రెస్ తమిళనాడులో, బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో అడ్రసు కోల్పోయినట్టుగా మిగిలి

పోతుంది. ఇక దశాబ్దాల తరబడి డిఎంకె, అన్నాడిఎంకె, సమాజ్‌వాది పార్టీ, ఆర్.జె.డి., బిఎస్‌పి ఆయా రాష్ట్రాల్లో అధికారం వచ్చినట్లుగా టిఆర్ఎస్, టిడిపి మొదలైన ప్రాంతీయ పార్టీల్లో ఏదో ఒకటి అధికారంలోకి వస్తుంటాయి.

అలాగే టిఆర్ఎస్, బిజెపి, సిపిఐ మొదలైన పార్టీలతో అలయన్స్‌తో ఆంధ్ర - తెలంగాణ రెండు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావచ్చు. లేదా అధికారంలో భాగస్వామ్యం పొందే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీ 2004 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ ఎం.పి. సీట్లు సాధించడం వల్లనే కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ తెలంగాణ నినాదంతో ఏకమై మద్దతు ఇచ్చి టి.ఆర్.ఎస్‌తో సీట్ల ఒప్పందం కుదుర్చుకోవడం ప్రధాన కారణమని మీకు ప్రత్యేకంగా గుర్తు చేయనవసరం లేదనుకుంటాము. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఆధిక్యత కోల్పోతే రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ అధికారం కోల్పోతుంది. మీరనుకుంటున్న 3వ ఫ్రంటు బిఎస్‌పిని కూడా కలుపుకొని ఏర్పాటు చేసుకునే సామాజిక భారతీయ చారిత్రక పరిణామాలు చోటు చేసుకుంటాయి.

అప్పుడు దేశంలోని ఫెడరల్ స్ఫూర్తికి అనువుగా ప్రాంతీయ పార్టీల ఆధిక్యతతో కేంద్ర ప్రభుత్వాలు కొనసాగుతాయి. ఇన్ని మార్పులను కేవలం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును ఆమోదించడం ద్వారా మీరు సాధించుకోవచ్చు. భారతదేశ రాజకీయ చిత్ర పటాన్ని సమూలంగా మార్చే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మీకు అనుకూలంగా ఉండడానికి మీరు కూడా తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇస్తే ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ పూర్వం లాగా తిరిగి కీలక పాత్ర నిర్వహించే అవకాశం ఏర్పడుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును వ్యతిరేకించినంత కాలం తెలుగుదేశం పార్టీని తెలంగాణలోనే కాదు, ఆంధ్ర ప్రాంతంలో కూడా భూ స్థాపితం చేయాలని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారనే విషయం కూడా గమనించవలసిందిగా కోరుతున్నాము.

మేము తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై నిరంతరం కృషి చేస్తున్నాము. తెలంగాణ సిద్ధాంతకర్తలుగా, తత్వ వేత్తలుగా, రచయితలుగా, కళాకారులుగా, మేధావులుగా, విద్యావంతులుగా, జర్నలిస్టులుగా చిత్తశుద్ధితో తెలంగాణ రాష్ట్రం కోసం చేస్తున్న కృషిలో భాగంగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాం. దశాబ్దాల తెలంగాణ ప్రజల అభిష్టాన్ని నెరవేర్చాలని అందుకు మాతో కలిసి ఉద్యమించాలని కోరుతున్నాము.

ఇట్లు

(బి.ఎస్. రాములు)
సామాజిక తత్వవేత్త
కన్వీనర్ తెలంగాణ రాష్ట్ర కళాకారుల రచయితల మేధావుల ఐక్య వేదిక

బి.ఎస్. రాములు రచనలు



సామాజిక తాత్విక విశ్వ విద్యాలయం

www.etelangana.org